

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు

సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు

ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ



epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital


ఎయిరిండియా ప్రమాదంపై ప్రాథమిక నివేదిక సమర్పణ

రాముడు,శివుడు మావాళ్లే: నేపాల్ ప్రధాని

5


Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

9-7-2025 బుధవారం సంపుటి: 31 సంచిక: 158 పేజీలు: 10+4 వెల: 6.50


## భద్రాచలం ఇఓపై కబ్జాకోర్ల దాడి



పురుషోత్తపట్నంలో సొమ్మసిల్లి పడిపోయిన భద్రాచల దేవస్థానం ఇఓ రమాదేవి

### స్పృహతప్పిన మహిళా అధికారి

### హుటాహుటిన ఆస్పత్రికి తరలింపు

### దేవాలయ భూముల్ని కాపాడే యత్నంలో ఘర్షణ

### పురుషోత్తపట్నంలో తీవ్ర ఉద్రిక్తత

### హైకోర్టు ఆదేశాలు బుట్టదాఖలు

### ఎపి ప్రభుత్వం తక్షణం స్పందించాలని భక్తుల డిమాండ్

### దేవాదాయ మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి

**భద్రాచలం, జులై 8, ప్రభాతవార్త:** సీతారామచంద్రమూర్తి ఆస్తుల్ని కాపాడే ప్రయత్నంలో భద్రాచల దేవస్థాన ఈఓ రమాదేవి దాడికి గురయ్యారు. మంగళవారం సాయంత్రం ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఈ దుర్ఘటన జరిగింది. కబ్జాకోర్లు కొందరు ఆమెపై దౌర్జన్యానికి పాల్పడగా స్పృహకోల్పోయారు. హుటాహుటిన అక్కడున్న సిబ్బంది ఈఓని భద్రాచలంలోని కిమ్స్ ప్రయివేట్ వైద్యశాలకు తరలించగా వైద్యులు >>2



ఆసుపత్రిలో ఇఓను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

## పారిశ్రామిక పార్కులకు నిధులివ్వండి

### జహీరాబాద్‌లో ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ..

### వరంగల్ ఎయిర్‌పోర్టుకు చేయూత

### హైదరాబాద్- బెంగళూరు ఏరోడిఫెన్స్ కారిడార్ మంజూరు చేయండి

### కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను కోరిన ముఖ్యమంత్రి రేవంత్



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి పీయూష్ గోయెల్‌తో భేటీ అయిన సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూలై8:** జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్‌కు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలోని వాణిజ్య భవన్‌లో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌తో సీఎం రేవంత్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. జహీరాబాద్ ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివృద్ధికి జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసిడిఐటీ) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలని కేంద్ర మంత్రిని ముఖ్యమంత్రి కోరారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్, ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని కేంద్ర మంత్రికి సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్- వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని సీఎం అభ్యర్థించారు. హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ ఫీజుబిలిటీని అధ్యయనం చేస్తున్నట్లు కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో అత్యున్నతమైన మౌలిక వసతులతో ప్రత్యేకమైన రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందని.. ఈనేపథ్యంలో హైదరాబాద్ బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరోడిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని కేంద్ర మంత్రి గోయల్‌కు సీఎం రేవంత్ విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న వంద ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధికి సంబంధించిన ప్రతిపాదనలు సమర్పిస్తామని, కేంద్ర ప్రభుత్వం వాటికి మద్దతుగా నిలవాలని కేంద్ర మంత్రిని సీఎం కోరారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

**యూరియా కోటా పెంచండి: కేంద్రమంత్రి నడ్డాకు వినతి**

తెలంగాణ రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని కేంద్ర ఎరువులు, రసాయనాల మంత్రి జె.పి.నడ్డాకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో >>2



## నేడు భారత్ బంద్

### సార్వత్రిక సమ్మెలో 25 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు

**న్యూఢిల్లీ, జూలై 8:** కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా పది కేంద్ర కార్మిక సంఘాల ఉమ్మ డి ఫోరం బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె కు పిలుపునిచ్చింది. ఈ భారత్ బంద్‌లో సుమా రు 25 కోట్ల మంది కార్మికులు, ఉద్యోగులు పాల్గొంటారని సంఘాల నేతలు అంచనా వేస్తు న్నారు. ప్రభుత్వ విధానాలు కార్మిక, రైతు, దేశ వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా ఉన్నా యని వారు ఆరోపిస్తున్నారు. ఈ సమ్మె ప్రభావంతో బ్యాంకింగ్, బీమా, పోస్టల్, బొగ్గు గను లు, రవాణా వంటి కీలక ప్రభుత్వ రంగ సేవల కు తీవ్ర అంతరాయం కలిగే అవకాశం ఉందని హింద్ మజ్దూర్ సభ నేత హర్భజన్ సింగ్ సిద్ధూ తెలిపారు. దేశవ్యాప్తంగా వ్యవస్థీకృత, అసం ఘటిత రంగా ల్లోని కార్మికులు ఈ నిరసనలో >>2

## డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు

### 12 నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ

### ఆరు గ్యారంటీలు పూర్తిగా అమలు

### రూ. 100 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన: డి.సిఎం భట్టి విక్రమార్క



**మహబూబాబాద్ బ్యూరో,ప్రభాతవార్త:** ఇందిరమ్మ రాజ్యంలో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ప్రతి పేదవారి సొంతిటి కల సాకారం అవుతుందని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లాలోని పర్వతగిరి గ్రామ శివారు సోమ్లతండాలో పర్యటించారు. ఈ మేరకు నియోజకవర్గంలో రూ.100కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భూక్య మురళినాయక్ అధ్యక్షతన జరిగిన బహిరంగ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, సీతక్క, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ రామచంద్రునాయక్, ఎమ్మెల్యేలతో కలసి పాల్గొని ముందుగా జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఈ ప్రాంతాన్ని పూర్తిగా విస్మరించిందని బిఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గిరిజనులు ఎక్కువగా ఉన్న మహబూబాబాద్ జిల్లాలో గత 10సంవత్సరాల్లో అభివృద్ధికి నోచుకోలేదన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం ఎమ్మెల్యే మురళినాయక్ నిరంతరం శ్రమిస్తూ 100కోట్ల నిధులను తీసుకొచ్చారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలోనే తమకు న్యాయం జరుగుతుందని గిరిజనులు అందరు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే ఇచ్చిన మాట మేరకు రూ.21వేల కోట్ల రైతురుణమాఫీ చేసిందని అన్నారు. రైతుల అవసరాలను తీర్చడానికి రైతుబంధు పథకం కింద తొమ్మిది రోజుల్లోనే 9వేల కోట్ల >>2



రియోడీజెనీరోలో బ్రెజిల్ అత్యున్నత పురస్కారం 'గ్రాండ్‌కాలర్ ఆఫ్‌ది నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్‌క్రాస్' ప్రదానం చేసిన అధ్యక్షుడు లులాడీసిల్వా

## ప్రధాని మోడీకి బ్రెజిల్ అత్యున్నత పురస్కారం

### 'గ్రాండ్‌కాలర్ ఆఫ్‌ది నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్‌క్రాస్' ప్రదానం చేసిన అధ్యక్షుడు లులాడీసిల్వా

**రియోడీజెనీరో, జూలై 8:** భారత ప్రధాని నరేంద్రమోడీని బ్రెజిల్ దేశపు అత్యున్నత పౌరపురస్కారంతో సత్కరించింది. 'గ్రాండ్‌కాలర్ ఆఫ్‌ది నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్‌క్రాస్' పురస్కారంతోబ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లులా >>2

## సిఎంకు చర్చ రాదు.. రచ్చ ఒక్కటే!

### మైక్ కట్ చేయకుంటే రైతుసమస్యలపై అసెంబ్లీలో చర్చకు సిద్ధం

### సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

### సిఎం రేవంత్‌రెడ్డికి కుర్చీ వేసి.. అరగంటపాటు నిరీక్షణ

### సవాల్ విసిరి ఢిల్లీకి వెళ్లారని విమర్శ

**హైదరాబాద్,జూలై 8,ప్రభాతవార్త:** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి రచ్చ చేయటమే తెలుసు.. చర్చ చేయటం రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కి రావాలని తాను సవాల్ చేస్తే రేవంత్‌రెడ్డి ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తమకు మైక్‌కట్ చేయమంటే రైతు సమస్యలపై అసెంబ్లీలోనైనా చర్చించేందుకు సిద్ధమని ప్రకటించారు.తనతో చర్చకు రాకుండా.. రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పారిపోయారనిసెటైర్లు గుప్పించారు. తాను చెప్పినట్లుగానే చర్చకు వచ్చానని.. రేవంత్‌రెడ్డి ఎక్కడంటూ నిలదీశారు. ఈ క్రమంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కేటీఆర్.. సీఎం రేవంత్ రెడ్డికి కుర్చీ వేసి చర్చకు రావాలని సుమారు అరగంటపాటు వేచిచూశారు. ఈసందర్భంగా " సిఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీకి పరార్ అంటూ బీఆర్ఎస్ శ్రేణులు >>2




హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో సిఎం రేవంత్ కోసం కుర్చీ వేసి వేచిచూస్తున్న కెటిఆర్



మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు నాలుగుగేట్లు ఎత్తివేసిన దృశ్యం

## సాగర్‌కు కృష్ణమ్మ పరుగులు

### శ్రీశైలం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తివేత

**మహబూబ్‌నగర్ బ్యూరో, జూలై 8, ప్రభాతవార్త:** శ్రీశైలం ప్రాజెక్టు 4 గేట్లు తెరుచుకున్నాయి. కర్ణాటక నుంచి కృష్ణా నదికి భారీగా వరద జలాలు రావడంతో జూరాల నుంచి శ్రీశైలం ప్రాజెక్టుకు గత నెల రోజుల నుంచి దాదాపుగా ప్రతిరోజు నీళ్లు వచ్చి చేరుతున్నాయి. దీంతో ప్రాజెక్టు నీటిమట్టలు గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగుల గాను ప్రస్తుతం 885 అడుగులకు చేరుకొంది. ఇక నీటి నిల్వలు 215 టీఎంసీలకుగాను 199 టీఎంసీలకు చేరుకున్నాయి. ఇంకా ఎక్కువ నుంచి ఇన్‌ఫ్లో రావడంతో పాటుగా వర్షాలు >>2




## ఒకడుగు ముందుకి.. రెండడుగులు వెనక్కి!

### స్థానిక ఎన్నికలపై స్పష్టత కరవు..

### తేలని బిసి రిజర్వేషన్లు, పెండింగ్ బిల్లుల చెల్లింపు పంచాయితీ

### నిధులు విడుదలయితేనే ఎన్నికలకు సహకరిస్తామంటున్న జెఎసి నాయకులు

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఎప్పుడు ఉంటుందనేది ఇంకా క్లారిటీరాలేదు. లోకల్ పోరుకు సవాలక్ష అడ్డంకులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల పంచాయితీ ఇంకా తేలనేలేదు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏ విధంగా అమలు చేయాలనే దానిపై ప్రభుత్వం తర్జన భర్జన పడుతోంది. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా బీసీ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్ అమలు చేయడానికి ఏ విధంగా కార్యాచరణ అమలు చేయాలనే దానిపై సమాలోచనలు జరుపుతున్నారు. రాష ప్రభుత్వ పరంగా ఎన్ని విధాలుగా అవకాశాలు ఉన్నాయో అన్నింటిని సర్కార్ పరిశీలిస్తుంది. అయితే, న్యాయ నిపుణులు, రిజర్వేషన్లపై అవగాహన ఉన్న వారంతా పార్లమెంట్లో చట సవరణ చేస్తే తప్ప రిజర్వేషన్లు 50 శాతానికి మించడానికి వీలులేదని, అలా అయితేనే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు సాధ్యం అవుతుందని స్పష్టం చేస్తున్నారు.బీసీల రిజర్వేషన్లపై ప్రభుత్వం అవసరమైన సర్వేను నిర్వహించింది. అందుకు అనుగుణంగా అసెంబ్లీలో చట్టం కూడా చేశారు. కానీ, దాన్ని పార్లమెంట్ ఆమోదిస్తేనే రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉంటుంది. అయితే, కేంద్రానికి బిల్లును పంపించినా ఇంతవరకు స్పందన లేదు. వారు పరోక్షంగా ఈబిల్లును పరిగణలోకి తీసుకోమని చెప్పినట్లు సమాచారం. కేంద్రం నిర్వహించే కులగణనను >>2

## నేడు ప్రజాభవన్‌లో కాళేశ్వరంపై పిపిటి

### హాజరుకానున్న సిఎం రేవంత్

### ఎన్‌డిఎస్‌ఎ నివేదికపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూలై8:** కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం.. దాని లోపాలపై కాంగ్రెస్ ప్రజాప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఇటీవల బనకచర్ల, గోదావరి, కృష్ణా జలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించి ప్రభుత్వం... ఈసారి కాళేశ్వరం ప్రాజెక్టు. ఆ ప్రాజెక్టుపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ ఇచ్చిన నివేదికపై ప్రజాప్రతినిధులకు వివరించనుంది. ఎన్డీఎస్ఏలో నివేదించిన ప్రాజెక్టు లోపాలపై అవగాహన కల్పించనుంది. ప్రజాభవన్ వేదికగా బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహిస్తున్నారు. నీటిపారుదల మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో >>2



## మన నీళ్లు 'నైట్రేట్' మయం!

### విచ్చల విడిగా యూరియా వాడకం

### రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్దిపేట్ జిల్లాల్లో అధిక శాతం

### పంజాబ్ తర్వాత తెలంగాణ,ఎపిలోనే ఎక్కువ

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉండి ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. ప్రధానంగా దేశంలోని 440 జిల్లాల్లోని భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉంది. 20 శాతం నమూనాల్లో అనుమతించదగిన దాని కన్నా ఎక్కువ నైట్రేట్ ఉన్నదని గుర్తించడం జరిగింది. భూగర్భ జలాల్లో నైట్రేట్ అత్యధికంగా ఉన్న జిల్లాలు దేశవ్యాప్తంగా 15 కాగా, వీటిలో తెలంగాణలోని రంగారెడ్డి, ఆదిలాబాద్, సిద్ధిపేట, ఆంధ్రప్రదేశ్‌లోని పల్నాడు ఉన్నాయి. ఈ మేరకు విడుదల చేసిన ఒకనివేదికలో ఈ విషయాలనువెల్లడించింది.నైట్రేట్ కాలుష్యం వల్ల పర్యావరణం, ప్రజారోగ్యం దెబ్బతింటాయి. ముఖ్యంగా నైట్రోజన్ ఆధారిత ఎరువులు, పశువుల పెంటలను ఉపయోగించే వ్యవసాయ ప్రాంతాలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉంటుందని ఆందోళన వ్యక్తం చేసింది. 9.04 శాతం నమూనాల్లో ఫ్లోరైడ్ స్థాయిలు సురక్షిత పరిమితి కన్నా అధికంగా ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వెల్లడించింది. అలాగే 3.55 శాతం నమూనాల్లో ఆర్సెనిక్ కాలుష్యం ఉన్నట్లు పేర్కొంది. నైట్రేట్ స్థాయిలు 40 శాతానికిపైగా నమూనాల్లో కనిపించిన రాష్ట్రాలు రాజస్థాన్, కర్ణాటక, తమిళనాడు కాగా, మహారాష్ట్రలో 35.74 శాతం, >>2



శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు హారతి ఇస్తున్న ఏపి సిఎం చంద్రబాబు

## కృష్ణమ్మ పరుగులు

>> కురిసే అవకాశం ఉండడంతో శ్రీశైలం రిజర్వాయర్ గేట్లలో ఎత్తేందుకు అధికారులు నిర్ణయించారు. ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు మధ్యాహ్నం కృష్ణమ్మకు జలహారతితో 4 గేట్లను ప్రారంభించారు. ప్రాజెక్టు నాలుగు గేట్లను 10అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.కాగా భారీ ఇన్ ఫ్లోతో ఏపీలోని పోతిరెడ్డిపాడుతో పాటుగా తెలంగాణలోని మహాత్మాగాంధీ కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి నీళ్లు విడుదల చేస్తున్నారు. అలాగే కుడి ఎడమ గట్టు జల విద్యుత్ కేంద్రాల ద్వారా రెండు తెలుగు రాష్ట్రాలకు విద్యుత్ ఉత్పత్తి కొనసాగుతుంది. జూలై 29న ప్రాజెక్ట్ గేట్లు ఎత్తగా ఈసారి 21 రోజుల ముందే గేట్లను తెరవనుండటం గమనార్హం. జూలై మొదటి వారంలోనే గేట్లు ఎత్తడం గత పాతి కేళ్లలో ఇదే తొలిసారి కావడం గమనార్హం.ప్రస్తుతం ప్రాజెక్టుకు జూరాల సుంకేసుల నుంచి ఒక లక్ష 94వేల క్యూసెక్కుల నీళ్లు వచ్చి చేరుతున్నాయి. విద్యుత్ ఉత్పత్తితో పాటుగా కల్వకుర్తి పోతిరెడ్డిపాడు రిజర్వాయర్లకు మరియు నాగార్జునసాగర్ కు లక్ష 6వేక్యూసెక్కుల నీళ్లు తరలి వెళ్తున్నాయి. మొత్తం మీద శ్రీశైలం ప్రాజెక్టు కృష్ణా నది నీటితో కళకళలాడుతోంది. గేట్లు తెచ్చుకోవడంతో ప్రాజెక్టు మరియు నల్లమల అడవి పర్యాటక శోభను సంతరించుకోనుంది.

## భద్రాచల ఆలయ ఇఒ రమాదేవిపై దాడి హేయం

### రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ బ్రాంచి డిప్యూటీ కలెక్టర్ల సంఘం

**హైదరాబాద్,జులై 8 ప్రభాతవార్త:** భద్రాచలం ఆలయ ఈ. ఓ రమాదేవి పై పురుషోత్తపట్నంకు చెందిన వారు చేసిన దాడిలో ఆమె స్పృహ తప్పి ఐసీయూలో చికిత్స పొందుతున్న వివరాలు తెలిసి తెలంగాణ రాష్ట్ర సివిల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ బ్రాంచి డిప్యూటీ కలెక్టర్ల సంఘం అవేదన వ్యక్తం చేసింది.అసోసియేషన్ అధ్యక్షుడుకె.చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌తో ఫోన్లో మాట్లాడి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకొని ఆందోళన వ్యక్తం చేశారు.తదుపరి ఈ.ఓ వ్యక్తి గత సిబ్బంది తో ఫోన్ ద్వారా యోగక్షేమాలు వాకబు చేశారు. ఐసీయూలో ఉన్న ఈ.ఓ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.కోర్టు తీర్పు మేరకు భద్రాచలం రాముని భూములకు ఆలయ ఈవో రక్షణగా ఉన్నారని,చట్టాన్ని ఉల్లంఘించి ఆక్రమణలు చేస్తున్న వారిని అడ్డుకున్న రమాదేవిపై దాడి చేసిన వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలనివారు ప్రభుత్వాన్నిడిమాండ్ చేశారు.పురుషోత్తమ పట్నం భౌగోళికంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు రాష్ట్ర ప్రభుత్వంపై దాడికి పాల్పడ్డ వారిపైన కఠిన చర్యలు తీసుకొనేలా ఒత్తిడి తీసుకొనివచ్చి అధికారులకు మనో ధైర్యం కల్పించే చర్యలు చేపట్టాలని కోరారు.క్షేత్ర స్థాయిలో ప్రభుత్వ భూములకు, దేవాలయ భూములకు రక్షణగా ఉంటున్న అధికారులకు ప్రభుత్వ పరంగా రక్షణ కల్పించాలని వారు రాష్ట్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేసారు.

## సిఎంకు చర్చ రాదు.. రచ్చ ఒక్కటే!

>> నినాదాలు చేశారు. అనంతరం కెటిఆర్ మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముక్కు నేలకు రాసి కేసీఆర్‌కు క్షమాపణ చెప్పాలని చర్చకు వచ్చే సత్తా లేనప్పుడు.. మరోసారి సవాల్ చేయొద్దని హితవు పలికారు. రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లింది యూరియా బస్తాల కోసం కాదని.. ఏ బస్తాలు మోసి రేవంత్ ముఖ్యమంత్రి పదవి కాపాడుకుంటున్నారో అందరికీ తెలుసునని విమర్శించారు. ఏ బేసిన్ ఎక్కడుందో కూడా రేవంత్‌రెడ్డికి తెలియదని ..ఈయన హయాంలో నీళ్లు ఆంధ్రకు.. నిధులు ఢిల్లీకి.. నియామకాలు రేవంత్ తొత్తులకు పోతున్నాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి గురువు చంద్రబాబు కోసం తెలంగాణ నీళ్లను ఆంధ్రకు పంపుతున్నారని కెటిఆర్ ఆరోపించారు. నాలుగు రోజులు మోసాలు చేసి రేవంత్ తప్పించుకోవచ్చు... కానీ రాష్ట్ర ప్రజలు క్షమించరన్నారు. అలాగే సవాల్ విసిరి మాట తప్పటం సీఎం రేవంత్‌రెడ్డికి అలవాటేనని 2018లో కొండగల్‌లో ఓడిపోతే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మాట తప్పారని..ఆతర్వాత జిహెచ్ఎంసి ఎన్నికల్లో సవాల్ చేసి మాటతప్పారని ఎద్దేవా చేశారు. తనతో చర్చకు మంత్రులను అయినా పంపుతారనుకున్నానని కానీ వారు కూడా రాలేదని విమర్శించారు. ప్రజా సమస్యలపై మళ్లీ ఎప్పుడైనా చర్చకు పిలిచినా రేవంత్‌రెడ్డితో మాట్లాడటానికి తాను సిద్ధమేనని ఛాలెంజ్ చేశారు. ప్లేస్, టైం రేవంత్‌రెడ్డి డిసైడ్ చేయాలని సవాల్ విసిరారు. సీఎం రేవంత్‌రెడ్డి స్థాయికి తాము చాలని...కేసీఆర్ అవసరం లేదని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు ఇస్తామని అన్నారని... బాండ్ పేపర్లు కూడా రాసి ఇచ్చారని.. వాటిని ఎందుకు పూర్తిగా ఇవ్వడం లేదని కేటీఆర్ ప్రశ్నల వర్షం కురిపించారు. ఈకార్యక్రమంలో మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగులకమలాకర్, సబితాఇంద్రారెడ్డిలతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు బిఆర్ఎస్ కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## ప్రజాభవన్‌లో కాళేశ్వరంపై పిపిటి

>> నిర్వహిస్తున్న ఈ పీపీటీకి ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సైతం హాజరవుతారని సమాచారం. దీనికి ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, మంత్రులు,ఎంపీలు, అసెంబ్లీ స్పీకర్,మండలి చైర్మన్ తదితరులంతా హాజరు కనాఉన్నారు. కాళేశ్వరం ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు, ఇంజినీరింగ్ అద్భుతం అంటూ కేసీఆర్, బీఆర్ఎస్ బృందం చాలా సందర్భాల్లో గొప్పలు చెప్పుకుంది. అయితే.. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆ ప్రాజెక్టుకు సంబంధించిన లోపాలు ఒక్కసారిగా వెలుగుతూశాయి. కాళేశ్వరంలో భాగంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజీకి సంబంధించిన రెండు పిల్లర్లు పది మీటర్ల లోతులోకి కుంగిపోయాయి. దాంతో ప్రాజెక్టు భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది. వేల కోట్లాది రూపాయలతో నిర్మించిన ప్రాజెక్టు లోపాలను తెలుసుకునేందుకు వెంటనే ఎన్డీఎస్ఏ రంగంలోకి దిగింది. ఆ వెంటనే అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం ఈ విషయాన్ని సీరియస్‌గా పరిగణించింది. వెంటనే కమిషన్‌ను ఏర్పాటు చేసింది. కాళేశ్వరం నిర్మాణం, నాణ్యత లోపాలు, చేసిన ఖర్చు తదితర వాటిపై కమిషన్ విచారించింది. ప్రస్తుతం ఈ కమీషన్ విచారణ సైతం చివరి దశలో ఉంది. ఎన్డీసిఏ ఇచ్చిన ప్రాథమిక నివేదికలో ప్రాజెక్టు ప్రణాళిక,డిజైన్,నిర్మాణం,నిర్వహణలో తీవ్ర లోపాలున్నాయని తేల్చి చెప్పింది. మేడిగడ్డతో పాటు సుందిళ్ల,అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు సంబంధించి డిజైన్లను మరోసారి పరిశీలించాలని సూచించింది. మేడిగడ్డ ఏడో బ్లాక్‌ను బాగు చేయడం సాధ్యం కాదని,ఇక్కడ గేట్లు నిర్వహించడానికి వీలు లేదని చెప్పింది. ఈ బ్లాక్‌ను పూర్తిగా తొలగించి మిగిలిన బ్లాక్‌లకు నష్టం జరగకుండా చూడాలని సూచించింది.

## నేడు భారత్ బంద్

>> పాల్గొనేలా నెలల తరబడి సన్నాహాలు చేసినట్టు కార్మిక సంఘాల నేతలు వివరించారు. 25 కోట్ల కు పైగా కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటారని ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఏఐటీయూసీ) నేత అమర్జీత్ కౌర్ స్పష్టం చేశారు. గతేడాది కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవియాకు సమర్పించిన 17 డిమాండ్ల పత్రాన్ని ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని సంఘాలు ఆరోపిస్తున్నాయి. గడిచిన పదేళ్లుగా కనీసం వార్షిక కార్మిక సదస్సును కూడా నిర్వహించక పోవడం కార్మికుల పట్ల ప్రభుత్వ ఉదాసీన వైఖరికి నిదర్శనమని విమర్శించాయి. పార్లమెంటు ఆమోదించిన నాలుగు కొత్త లేబర్ కోడ్‌లు కార్మికుల హక్కులను కాలరాసేలా ఉన్నాయని, సామూహిక బేరసారాలను దెబ్బ తీసి, యూనియన్ల కార్యకలాపాలను అణచి వేసేలా ఉన్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానాలను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు సంఘాలు తెలిపాయి. కార్మికుల సమ్మెకు సంయుక్త కిసాన్ మోర్చా, వ్యవసాయ కార్మిక సంఘాల ఉమ్మడి వేదిక పూర్తి మద్దతు ప్రకటించాయి. గ్రామీణ ప్రాంతాల్లో కూడా పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించాయి.

## ఇప్పటి దాకా జరిగిన కేబినెట్ నిర్ణయాలపై రేపు సమీక్ష

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూలై8:** ఈనెల 10న తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. సిఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన సచివాలయంలో మధ్యాహ్నం 2 గంటలకు జరిగే కేబినెట్ భేటీలో ప్రత్యేకత ఉంది.ఇప్పటి వరకు ఏ రాష్ట్రంలో లేని విధంగా తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది. 2023 డిసెంబర్ 7 నుంచి ఇప్పటి వరకు 18 సార్లు కేబినెట్ సమావేశాలు నిర్వహించారు. సుమారు 315 పై చిలుకు అంశాలపై కేబినెట్ సమావేశంలో మంత్రులు చర్చించారు. అయితే ఇప్పటి వరకు జరిగిన కేబినెట్ నిర్ణయాలు, ఆమోదించిన అజెండా అంశాలపై ఈసారి సమీక్ష చేయనున్నారు. ప్రతిసారీ జరిగే కేబినెట్ మీటింగ్ హాల్‌లో కాకుండా, సిఎం మీటింగ్ హాల్‌లో 19వ కేబినెట్ సమావేశం జరగనుంది.

### వారం - వర్జ్యం

తేది : 09-07-2025, బుధవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
చతుర్దశి రా.1.35
మూల తె.4.49
వర్జ్యం : 2.52-4.32
దు.ఉ.11.47-12.39
రాహుకాలం - మ.12.00-1.30

### వార్తాఫలం

**మేషం:** సంతానం నుండి కీలక సమాచారం అందుతుంది. గృహనిర్మాణ ఆలోచనలలో తొందరపాటు వద్దు.

**వృషభం :** ఉద్యోగాలలో స్థానచలనం వుంటుంది. దూరప్రాంతాల నుండి వచ్చిన వార్త కొంత ఆనందం కలుగుతుంది.

**మిథునం:** బంధువులతో అనవసరంగా మాటపడాల్సిన సమయం, జాగ్రత్త అవసరం.

**కర్కాటకం :** ముఖ్యమైన వ్యవహారాలలో ఆచితూచి అడుగవేయండి. ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వుంటుంది.

**సింహం:** విలువైన ఆభరణాలు, వాహనాలు కొనుగోలు చేస్తారు. వివాహ, ఉద్యోగయత్నాలు కలిసివస్తాయి.

**కన్య :** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. సభలు, సమావేశాలలో చురుకుగా పాల్గొంటారు.

**తుల :** ఊహించని బాధ్యతలు పెరుగుతాయి. వాటిని సమర్థవంతంగా వ్యాపిస్తారు.

**వృశ్చికం:** ఆర్థికపరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది.కాంట్రాక్టులు దక్కుతాయి.

**ధనుస్సు:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి ప్రభుత్వం నుండి ఆహ్వానాలు అందుతాయి.

**మకరం:** వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైనా సన్నిహితుల సాయం అందుతుంది.

**కుంభం:** ఆరోగ్య సమస్యలు ఎదురై చికాకులు పెట్టినా అధిగమిస్తారు. అనుకున్న దొకటి జరిగేది వేరొకటిగా ఉంటుంది.

**మీనం :** రాజకీయ, కళారంగాల వారికి కొంత అనుకూలంగా వుండును. పనులు నత్తనడకన సాగుతాయి.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ఒకడుగు ముందుకి.. రెండడుగులు వెనక్కి!

>> లెక్కలోకి తీసుకుని మాత్రమే బీసీల రిజర్వేషన్పై స్పందిస్తామనేది వారి వాదనగా ఉంది. రాష్ట్రం పంపించిన బిల్లును కేంద్రం తిరస్కరించలేదు. అదే సమయంలో ఆమోదించ లేదు కూడా. దీంతో ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్లాలనే దానిపై న్యాయ నిపుణులతో చర్చిస్తుంది. సంప్రదింపులు జరుపుతున్నారు. న్యాయ నిపుణులు సైతం సుప్రీంకోర్టు చెప్పిన 50 శాతం రిజర్వేషన్లు దాట డానికి వీలులేదని, కేంద్రం పార్లమెంట్లో చట్టం చేస్తే తప్ప సుప్రీంకోర్టు తీర్పును ఉల్లంఘించడానికి లేదని స్పష్టం చేస్తున్నారు.
ఒకవేళ తెలంగాణ ప్రభుత్వం రాజకీయపరంగా బీసీలకు రిజర్వేషన్ల కోసం జీవో జారీ చేసినా సుప్రీం ఆదేశాలను ఉల్లంఘించారని వెంటనే ఏవరైనా కోర్టుకు వెళితే ఆ జీవోను రద్దు చేసే అస్కారం ఉంటుందని గుర్తు చేస్తున్నారు. దీంతో ఏం చేయాలనే దానిపై అధికారులు, మరోవైపు అధికార పార్టీ నాయకులు, ముఖ్యులు చర్చలు జరుపుతున్నారు. మల్లగుల్లాలు పడుతున్నారు. ఎలా చేయాలని, ఏం చేయాలనే దానిపై తర్జన భర్జన పడుతున్నారు. అడ్వకేట్ జనరల్ అభిప్రాయాన్ని ప్రభుత్వం తీసుకున్నట్లుగా సమాచారం. రాష్ట్రం ప్రభుత్వం ముందు ఉన్న ప్రతిపాదనల్లో 42 శాతంపై జీవో జారీ చేసి ముందుకు వెళ్లాలని, లేకుంటే ప్రధాని అపాయింట్మెంట్ తీసుకొని అఖిలపక్షాన్ని కలిపించి.. ఇక ఏం చేసేది లేదని, రాజకీయంగా బీసీలకు సీట్లు ఇవ్వాలనే ఒక నిర్ణయం తీసుకోవాలని సూచనలు వచ్చినట్లుగా సమాచారం. జీవో జారీ చేస్తే దానికి గవర్నర్ ఆమోదిస్తారా? అనే సందేహాలను పలువురు వ్యక్తం చేస్తున్నారు. గవర్నర్ దగ్గరి నుంచే కేంద్రానికి వెళ్లిన అంశంపై ఆయన జీవోకు సంతకం చేస్తారా? అనే అనుమానాన్ని వ్యక్తం చేస్తున్నారు. మొత్తంగా పార్లమెంట్ చట్టం చేస్తే తప్ప బీసీలకు 42 శాతం రిజర్వేషన్ సాధ్యం కాదని సీనియర్ న్యాయనిపుణులు చెబుతున్నారు. ప్రభుత్వమే ధైర్యం ఈ విషయాన్ని ప్రజలకు వివరిస్తే సరిపోతుందని వారు సలహా ఇచ్చినట్లు సమాచారం. అయితే, ఎన్నికలు ఆలస్యం కావడం ద్వారా రాజకీయ నాయకులు ఇక్కట్లు పాలవుతున్నారు. ఇప్పుడు, అప్పుడు అంటూ ఎన్నికలపై ప్రచారం జరగడంతో గ్రామ, మండల స్థాయి నాయకుల ఖర్చులు తడిసిమోపెడు అవుతున్నాయని, ఎన్ని రోజులు ఇలా ఖర్చులను భరించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వమే ఏదో ఒక నిర్ణయం తీసుకుంటే ప్రజలు, బీసీ వర్గాల నుంచి కొంత మద్దతు వచ్చే అవకాశం ఉందని చెబుతున్నారు. వాస్తవాలు తెలిసినందున అంగీకరించే అవకాశం ఉందని అంటున్నారు. గత సంవత్సరం ఫిబ్రవరిలో సర్పంచ్లు, ఆ తరువాత జూన్లో జెడ్పీ చైర్మన్లు, ఎంపీపీ,జెడ్పీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ఈఏడాది జనవరిలో మున్సిపాలిటీల పాలకవర్గాల గడువు ముగిసింది. ఇలారాష్ట్రంలో గ్రామీణ,పట్టణ ప్రాంత స్థానిక సంస్థల గడువు ముగిసింది.వీటికి ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం సుప్రీం కోర్టు సూచించిన విధంగా ట్రిపుల్ టెస్ట్‌నిర్వహించింది. స్థానిక సంస్థలకు పాలకవర్గాలు లేకపోవడంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు నిలిచిపోయాయి. కేంద్ర ఆర్థిక సంఘం నుంచి ప్రతియేటా గ్రామీణ స్థానిక సంస్థలకు రూ.1500కోట్ల వరకు నిధులు విడుదల చేస్తుంది. వీటి విడుదలతో కొంత వరకు గ్రామాల్లో కనీస అవసరాలకు నిధులు సరిపోయేవి. కానీ, పాలకవర్గాలు లేకపోవడంతో నిధుల విడుదలను ఆపేశారు. ఎన్నికలు నిర్వహిస్తేనే నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేస్తున్నారు. అదే సమయంలో గ్రామాల్లో అత్యవసర పనులకు తప్ప రెగ్యులర్ వర్క్‌కు నిధులు మంజూరు, ఖర్చు చేయాలంటూ పాలకవర్గాల ఆమోదం తప్పనిసరి. ఒకవేళ రాష్ట్రం నిధులు విడుదల చేసినా పాలకవర్గంఆమోదంతోనే పనులు చేపట్టాల్సి ఉంటుంది. దీంతో గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిలిచిపోయాయి. స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగుతున్నాయి.మరో వైపు పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచ్‌ల బిల్లులు చెల్లించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఇప్పటికే మాజీ సర్పంచ్‌ల జేఏసీ, సర్పంచ్‌ల ఫోరం నాయకులు ఇప్పటికే ప్రభుత్వానికి అనేక మార్లు విజ్ఞప్తి చేసిన సంగతి తెలిసిందే. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లిస్తేనే తాము సహకరిస్తామని లేక పోతే లేదని ఇప్పటికే వారు ప్రభుత్వానికి స్పష్టమైన సంకేతాలు ఇచ్చారు. ఒక వైపు బీసీ రిజర్వేన్ల పంచాయితీ మరో వైపు పెండింగ్ బిల్లుల పంచాయితీ వంటి సమస్యలు ఉండటంతో ఇప్పట్లో ఎన్నికలు సాధ్యమయ్యే అవకాశం కనిపించడం లేదని అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

# డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలు

>> రూపాయలను రైతుల ఖాతాల్లో జమ చేశామన్నారు. రైతాంగ సంక్షేమం కోసం 29లక్షల పంపుసెట్ల బిల్లులను రాష్ట్ర ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గృహ యజమానికి 51లక్షల మంది లబ్ధిదారులకు 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేస్తున్నామన్నారు. ఈ నెల 12 నుండి రాష్ట్రవ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాలను పంపిణీ చేసి వడ్డీలేని రుణాలతో కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రజాప్రభుత్వ లక్ష్యం అన్నారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం ఒక్క సంవత్సరంలోనే 70వేల కోట్ల ప్రజా ప్రభుత్వం ఖర్చుచేసిందన్నారు. లక్ష కోట్లు ఖర్చుపెట్టి కాళేశ్వరం కట్టి పది ఎకరాలకు కూడా నీళ్లు ఇవ్వలేదని వాస్తవాలు బయటకు వస్తున్నాయని బిఆర్ఎస్ నేతలు అవాకులు, చెవాకులు పేలుతున్నారన్నారు. మొన్న పార్లమెంట్ ఎన్నికల్లో గుండుసున్నా వచ్చిందని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి డిపాజిట్ కూడా దక్కదని అన్నారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..**

రాష్ట్రంలో ప్రజలందరు కష్టపడి ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని మంత్రి అన్నారు. అప్పుల రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తలతాకట్టు పెట్టి ఇచ్చిన హామిలన్నింటిని అమలు చేస్తుందన్నారు. గత ప్రభుత్వం ప్రారంభించిన పథకాలను రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూ నూతన సంక్షేమ పథకాలను ప్రారంభించారన్నారు. ఈ 18నెలల్లో పేదవారికి ఎలాంటి ఇబ్బంది కలుగకుండా ఇచ్చిన హామిలన్నింటిని దశల వారిగా నెరవేరుస్తున్నామన్నారు. ఆడబిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్నారు. గత ప్రభుత్వంలో 17వేల కోట్ల రైతులకు రుణమాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన సంవత్సరంలోనే 21లక్షల కోట్లు రుణమాఫీ చేశామన్నారు. వరి వేస్తే ఉరి గతి పడుతుందని అన్న బిఆర్ఎస్ నాయకుల మాటలకు భిన్నంగా రైతులను రాజు చేసే దిశగా వరికి మద్ధతు ధరతో పాటు సన్న ధాన్యానికి రూ.500బోనస్ ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రాష్ట్రంలో మొదటి విడుతగా నాలుగున్నర లక్షల ఇళ్లను మంజూరి చేశామన్నారు. మహబూబాబాద్ జిల్లాలో 4వేలకు పైగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామన్నారు. గత పాలకులకు సాధ్యం కాని రేషన్ కార్డులను కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చి చూపించిందని అన్నారు.

**-ఎమ్మెల్యే భూక్య మురళినాయక్..**

ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని సోమ్లతండాలో 33/11కెవి సబ్‌స్టేషన్ మంజూరి చేసినందున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మహబూబాబాద్ వెనుకబడిన జిల్లా అని ఇందిరమ్మ ఇళ్లు కావాలని అడుగగా వెంటనే స్పందించి మరో వెయ్యి ఇల్లు మంజూరు చేయించిన ఘనత పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిదని కొనియాడారు. బేతోలు నుండి మల్యాల మీదుగా సోమ్లతండా వరకు రూ.20కోట్లతో రోడ్డు సాంక్షన్ చేసిందన మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలోని ఐదు ఆలయాలకు సుమారు 5కోట్ల నిధులు కేటాయించిన మంత్రి కొండ సురేఖకు ధన్యవాదాలు తెలిపారు. రూ.50కోట్లతో జిల్లాలో రోడ్లు మంజూరు చేసిన మంత్రి కోమటిరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పర్వతగిరి నుండి అమనగల్ వరకు రోడ్డు మంజూరు చేస్తే ఇక్కడి ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. తులారం ప్రాజెక్టును 2ఫిట్ల మేర పెంచితే మహబూబాబాద్ నియోజకవర్గానికి, జిల్లాకేంద్రానికి నీటిని నిల్వ చేసుకోవచ్చన్నారు. ఈ నీటితో 2వేల ఎకరాల ఆయకట్టు పంటసాగుకు అనుకూలంగా ఉంటుందన్నారు. మహబూబాబాద్ జిల్లా ఏర్పడిన తర్వాత రద్దీ విపరీతంగా పెరిగిపోయిందని రవాణాకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని జిల్లా కేంద్రం చుట్టూ ఔటర్‌రింగ్‌రోడ్డు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ బెల్లయ్యనాయక్, ఎంపి పోరిక బలరాంనాయక్, ఎమ్మెల్యేలు కోరం కనకయ్య, నాగరాజు, జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పి సుధీర్‌రాంనాథ్‌కేకన్, అధనపు కలెక్టర్ లెనిన్ వత్సల్‌టొప్పొ, డిసిసి జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, గుగులోతు వెంకట్‌నాయక్, డిఎఫ్‌వో విశాల్, ఆయా శాఖల జిల్లా అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మంగళవారం న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నడ్డాతో భేటీ అయిన సిఎం రేవంత్

## పారిశ్రామిక పార్కులకు నిధులివ్వండి

>> ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంగళవారం కలిశారు. వానా కాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్‌-జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నులకు గానూ కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే సరఫరా చేశారని కేంద్ర మంత్రి దృష్టికి సీఎం తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడం.. సాగు పనులు జోరుగా సాగుతున్నందున యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే చేశారని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలని సీఎం కోరారు. యూరియా సరఫరాకు సంబంధించి రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదని... వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ఎంపీలు డాక్టర్ మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు పాల్గొన్నారు.

## భద్రాచలం ఇఒపై కబ్జాకోర్ల దాడి

>> చికిత్సఅందిస్తున్నారు. జరిగిన సంఘటనను గురించి తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కిమ్స్ వైద్యశాలకు చేరుకుని కార్యనిర్వహణాధికారి రమాదేవిని పరామర్శించి వైద్యులతో ఈఓ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సంఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకునేటట్లు ఉన్నతాధికారులతో మాట్లాడుతానని తెలియజేశారు. దేవుడి భూముల్ని కాపాడటానికి చిత్తశుద్ధితో పనిచేస్తున్న మహిళా అధికారి పట్ల ఇలాంటి అనాగరిక పవర్తన పట్ల భక్తజనమంతా ముక్తకంఠంతో నిరసన వ్యక్తం చేస్తున్నది.ఆంధ్రప్రదేశ్ లోని ఎటపాక మండలం పురుషోత్తపట్నంలో ఈ సంఘటన జరిగిందని ఇందాకే చెప్పుకున్నాం. రాష్ట్రవిభజనకు ముందు ఈ ప్రాంతం ఖమ్మం జిల్లాలో ఉండేది. తదనంతరం ఇది ఎపిలో కలిసింది. ఈ గ్రామ పరిధిలో శ్రీసీతారామచంద్రమూర్తి ఆలయానికి చెందిన 889.50 ఎకరాల భూమి ఉన్నది. కాగా ఇందులో చాలాకాలంగా అనేకమంది దురాక్రమణలకు పాల్పడి అక్రమంగా నిర్మాణాలు సయితం సాగించడం మితిమీరిపోగా.,రాష్ట్రీయ వానర సేన రిట్‌పిటిషన్(పిల్) నెంబర్: 169/2022 (రిట్‌పిటిషన్ 4533/2022కూడా) తో తెలంగాణా హైకోర్టుముందు ఈ సమస్యను పెట్టి, తక్షణం దురాక్రమణల తొలగింపు కోరుతూ, రాష్ట్ర ప్రభుత్వ కీలక శాఖలను పార్టీలుగా చేర్చడం జరిగింది. ప్రధాన న్యాయమూర్తి గౌరవ జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా ధర్మాసనం దీనిపై 27.11.2022 తేదీన తీర్పు చెప్పింది. ఈతేదీనుంచి కేవలం రెండు మాసాల్లో ఆక్రమణలను తొలగించి దేవుడి భూముల్ని కాపాడాలని ఆదేశించారు. అయినా స్వార్థపరుల ఆగడాలు ఆగడం లేదు. దురాక్రమణలు తగ్గకపోగా పెచ్చుమీరిపోయాయి. రాష్ట్ర విభజనలో ఈ ప్రాంతం ఎపిలోకి వెళ్ళిపోవడంతో.,అక్కడి పోలీస్ ఇతర యంత్రాంగం భద్రాచల రామాలయ ఈఓ రమాదేవి కృషికి కలిసిరావడంలేదనే విమర్శలున్నాయి. ఈరోజున అదే జరిగింది. రామాలయానికి చెందిన భూముల్లో కొందరు అక్రమంగా శాశ్వత కట్టడాలు సాగిస్తున్న విషయాన్ని తెలుసుకుని తన సిబ్బందితో ఆమె సంఘటనా స్థలానికి వెళ్ళి ప్రతిఘటించగా, మహిళ అని కూడా చూడకుండా ఇలా దాడికి తెగబడ్డారు. తెలంగాణా నుంచి మా రాష్ట్రానికి ఎలా వస్తారంటూ తెంపరితనాన్ని ప్రదర్శిస్తున్నా అక్కడి పోలీస్ పట్టించుకోవడంలేదనే ఆవేదన వ్యక్తమవుతున్నది. ఈ సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా ప్రకంపనలు రేపింది. రాష్ట్ర దేవాదయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇలాటి సంఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. అదే సమయంలో వేములవాడ రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయ ఉద్యోగుల సంఘం ఈ సంఘటనపై తీవ్ర నిరసన వ్యక్తం చేసింది. రాష్ట్రాలేవైనా అందరికీ భగవంతుడొక్కడే అయినప్పుడు ఆ రాష్ట్ర అధికార యంత్రాంగం కూడా ఆలయ భూముల పరిరక్షణకు సహకరించాలని, ఇలాంటి దురాగతాలను తాము సహించమని హెచ్చరించారు. ఆలయ అధ్యక్షులు కూరగాయల శ్రీనివాస్, ఎఈఓలు పర్యవేక్షకులు, ఇంజనీరింగ్ సిబ్బంది, వేదపండితులు సంయుక్తంగా దీనిపై ఖండన ఇచ్చారు. అదేవిధంగా యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ఉద్యోగుల సంఘం కూడా స్పందించింది. ప్రధాన దేవాలయ జెఎసి చైర్మెన్ రమేష్‌బాబు, ఎఈఓలు పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది ఇతర మినిస్టీరియల్ స్టాఫ్ ఈ సంఘటన పట్ల విస్మయాన్ని వ్యక్తపరిచారు. బాధ్యులపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఆంధ్రా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## బెజిల్ అత్యున్నత పురస్కారం

>> డిసిల్వా సత్కరించారు. భారత్‌బ్రెజిల్‌లమధ్య ఉన్న ద్వైపాక్షిక సంబంధాలను మరింత పటిష్టపరిచేందుకు ప్రధానిమోడీ చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారంప్రధానంచేసింది. అంతేకాకుండా భారత్‌బ్రెజిల్ సహకారం అంతర్జాతీయ వేదికలపై మరింత శక్తివంతం అయ్యేవిధంగా మోడీ కృషిచేసారని బ్రెజిల్ అధ్యక్షుడు లులా డిసిల్వా అన్నారు. తనకు లభించిన ఈపురస్కారంపై ప్రధానిమోడీ మాట్లాడుతూ బ్రెజిల్‌ప్రభుత్వం తమ దేశ అత్యున్నత పురస్కారాన్ని ప్రధానంచేసిందని, 140 కోట్లమంది భారతీయుల తరపున ఈ పురస్కారాన్ని స్వీకరిస్తున్నట్లుప్రధాని అన్నారు. బ్రెజిల్ అధ్యక్షుడు, బ్రెజిల్ ప్రభుత్వం, బ్రెజిల్‌దేశ ప్రజలకు ఈసందర్భంగా ఆయన కృతజ్ఞతలు తెలిపారు. 2014లో బాధ్యతలు స్వీకరించిన తర్వాత ప్రధానిమోడీకి బ్రెజిల్ పురస్కారం 26వది కావడం గమనార్హం. బ్రెజిల్‌లో ఈపురస్కారాన్ని 1822లో ఆనాటి చక్రవర్తి పెడ్రో-1 ఏర్పాటుచేసారు. నేషనల్ ఆర్డర్ ఆఫ్‌ది సదరన్‌క్రాస్‌పేరిట బ్రెజిల్‌లో అత్యున్నత పురస్కారంగా ఇప్పటికీ ప్రముఖులకు అందచేస్తుంటారు. బ్రెజిల్‌కు ఇతర విదేశీ ప్రముఖులు ఒనరించిన విశిష్టసేవలకు గుర్తింపుగా ఇస్తుంటారు. గ్రాండ్‌కాలర్ బ్రెజిల్‌లో అత్యున్నతస్థాయి పురస్కారం. గతంలో అమెరికా అధ్యక్షుడు డ్వైట్ డి ఈషెన్‌హోవర్, క్వీన్ ఎలిజబెత్-2, పోప్‌జాన్‌పాల్-2, మాజీ ఫ్రెంచ్ అధ్యక్షుడు ఛార్లెస్ డి గాల్లే, అర్జంటీనా అధ్యక్షుడు జువాన్ పెరాన్, వెనిజులా మాజీ అధ్యక్షుడు హుగోచావెజ్, స్పానిష్ మాజీ రాజు జువాన్ కార్లోస్-1, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్‌పుతిన్ వంటివారికి బ్రెజిల్ ప్రభుత్వం ఈ గ్రాండ్ ఆనర్‌ను ప్రధానంచేసింది.

## మన నీళ్లు 'నైట్రేట్' మయం!

>> తెలంగాణలో 27.48 శాతం, ఆంధ్ర ప్రదేశ్‌లో 23.5 శాతం, మధ్య ప్రదేశ్‌లో 22.58 శాతం నమూనాల్లో నైట్రేట్ అధికంగా కనిపించింది. ఉత్తరప్రదేశ్, కేరళ, జార్ఖండ్, బీహార్ రాష్ట్రాల్లో నైట్రేట్ స్థాయి తక్కువగా ఉంది. సురక్షితత పరిమితి పరిధిలో ఉన్న రాష్ట్రాలు అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, గోవా, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్ ఉన్నాయి. కాగా తెలంగాణలో వ్యవసాయ పంటల సాగులో రసాయనిక ఎరువుల వాడకం ఏటా భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. పైర్లు పచ్చగా, ఏపుగా పెరిగి అధిక దిగుబడులు సాధించాలన్న ఉద్దేశ్యంతో రైతులు అధిక శాతం విష రసాయనాలను విచ్చలవిడిగా వాడుతున్నారు. దీంతో పంట పొలాల్లో భాస్వరం నిల్వలు భారీగా పేరుకుపోయినట్లు అధికారులు గుర్తించారు. తెలంగాణలో ప్రతీ ఏటా వానాకాలం, యాసంగి వ్యవసాయ సీజన్లలో ఒక్క యూరియానే 20 లక్షల టన్నులకు పైగా వినియోగిస్తున్నారని అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి.
దేశంలో పంజాబ్ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో రసాయనిక ఎరువులు, క్రిమి సంహారిక పురుగు మందుల వినియోగం అధికంగా ఉంది. కొన్ని జిల్లాల్లో భాస్వరం, నత్రజని, పొటాష్ ఎక్కువగా ఉన్నా మళ్లీ రసాయనిక ఎరువులు వినియోగిస్తున్నారు. ఏడేళ్ల కాలంలో తెలంగాణలో ఏకంగా 38 శాతం డై అమ్మోనియం ఫాస్ఫేట్ వినియోగం పెరిగింది. ప్రధాన వాణిజ్య పంట పత్తితో సహా పసుపు, వేరుశెనగ తదితర పంటలు, కూరగాయలు, పండ్ల తోటలు అధికంగా సాగు చేసే ప్రాంతాల్లో భూసార పరీక్షలు నిర్వహిస్తే అందులో అవసరానికి మించి భాస్వరం ఉన్నట్లు తేలింది. అయినా రాష్ట్రంలో వానాకాలం, యాసంగి సీజన్లలో ప్రతీ ఏటా 5 లక్షల టన్నులకు పైగా డై అమ్మోనియం ఫాస్ఫేట్‌ను పొలాల్లో చల్లుతున్నారు.

## సిబిఐ జప్తు చేసిన ఆస్తుల కోసం
# గాలి జనార్దన్ రెడ్డి పిటిషన్

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** ఓబుళాపురం గనుల కేసులో సిబిఐ కోర్టులో దోషిగా తేలి తెలంగాణ హైకోర్టులో ఊరట పొందిన కర్నాటక బిజెపి ఎంఎల్ఎ గాలి జనార్దన్ రెడ్డి మరోసారి హైకోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో సిబిఐ జప్తు చేసిన తన ఆస్తులను వెంటనే విడుదల చేసే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని ఆయన హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారణకు స్వీకరించిన హైకోర్టు దీనిపై వివరణ ఇవ్వాలని సిబిఐని కోరింది. ఈ కేసు విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## ట్రాఫిక్ చలాన్ పేరిట విశ్రాంత ఆర్మీ అధికారికి టోకరా
# రూ.1.20 లక్షలు కాజేసిన సైబర్ నేరగాడు

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** సైబర్ నేరగాళ్లు బరి తెగించారు. అవకాశం వున్న ప్రతిచోట, ఎవరినీ వదలడం లేదు. హైదరాబాద్‌లో ఓ విశ్రాంత మిలట రీ అధికారిని సైబర్ నేరగాడు పెండింగ్ ట్రాఫిక్ చలాన్ పేరిట మాయమాటలు చెప్పి ఆయన ఖాతా నుంచి లక్షా 20 వేల రూపాయల 409 రూపాయలను కా జేశాడు. వివరాలు ఇలావున్నాయి. హైదరాబాద్‌కు చెందిన 50 ఏళ్ల విశ్రాంత మిలటరీ అధికారికి ఈ నెల ఆరవ తేదీన వాట్సాప్‌కు ఓ సందేశం వచ్చింది. మీ కారు ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించింది. ఇందుకుగాను వెయ్యి రూపాయల చలాన్ పెండింగ్‌లో వుంది. వెంటనే దీనిని చెల్లించాలని అందులో వుంది, నగదు చెల్లింపు కోసం ఏపికె ఫైల్ పేరిట ఒక యాప్ పంపు తున్నాము, దీని ద్వారా చెల్లింపులు చేయాలని సదరు అధికారికి సమాచారం వచ్చింది. ఈ యాప్ ట్రా ఫిక్ పోలీసులు పంపి వుంటారని నమ్మిన సదరు విశ్రాంత మిలటరీ అధికారి దీనిని తన ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసిన కొద్ది క్షణాలలోనే ఆయనకు చెందిన ఎస్‌బిఐ క్రె డిట్ కార్డు నుంచి రెండు విడతలుగా లక్షా 20 వేల 409 రూపాయలు గుర్తు తెలియని వ్యక్తులు విత్ డ్రా చేసినట్లు సమాచారం వచ్చింది. దీంతో తాను మోసపోయానని గ్రహించిన సదరు అధికారి దీనిపై వెంటనే సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు మేరకు సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు.

## అస్థికలతో అంతరిక్షంలోకి స్పేస్‌గుళిక
# ప్రయోగం విఫలం, పసిఫిక్ సముద్రంలో కూలిన స్పేస్ క్యాప్సూల్

**టెక్సాస్, జులై 8:** 166 మంది మృతదేహాలనుంచి సేకరించిన అస్తికలతో అంతరిక్షంలోకి వెళ్లిన ఓ స్పేస్ క్యాప్సూల్ కూలిపోయి పసిఫిక్ సముద్రంలో పడిపోయింది. భూమి చుట్టు రెండు సార్లు విజయవంతంగా కక్ష్యలో చక్కర్లు కొట్టిన ఆ క్యాప్సూల్ ఆ తర్వాత క్రాష్ అయ్యింది. జర్మనీ స్టార్టప్ కంపెనీ ద ఎక్స్‌ప్లోరేషన్ కంపెనీ జూన్ 23వ తేదీన ఎన్‌వైఎక్స్ అనే క్యాప్సూల్‌ను నింగిలోకి పంపింది. మిషన్ పాజిబుల్ అనే ప్రోగ్రామ్‌లో భాగంగా దాన్ని ప్రయోగించింది. ఆ క్యాప్సూల్‌లో 166 మందికి చెందిన అస్తికలు ఉన్నాయి. టెక్సాస్‌కు చెందిన సెలిస్‌టిస్ అనే కంపెనీ మనుషుల అస్తికలను భూకక్ష్యలోకి పంపే ప్రాజెక్టు చేపట్టింది. ప్రయోగంపై టెక్సాస్ కంపెనీ స్టేట్మెంట్ రిలీజ్ చేసింది. విజయవంతంగా పేలోడ్‌లను కక్ష్యలోకి పంపామని, లాంచర్‌తో వేరైన తర్వాత భూకక్ష్యలోకి రీఎంట్రీ ఇచ్చిందని, ఆ తర్వాత పరిస్థితులు చేజారినట్లు కంపెనీ తన ప్రకటనలో పేర్కొన్నది. తిరుగు ప్రయాణ సమయంలో సంకేతాలు తెగిపోయినట్లు చెప్పింది. ఈ సమస్యకు కారణం ఏంటో తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపింది. వాండెన్‌బర్గ్ స్పేస్ బేస్ నుంచి ఫాల్కన్9 రాకెట్ ద్వారా నింగిలోకి క్యాప్సూల్‌ను పంపారు. క్యాప్సూల్‌లో ఉన్న పేలోడ్‌లో అస్తికలతో పాటు 166 మందికి చెందిన డీఎన్‌ఏలు ఉన్నాయి. ల్యాండింగ్ సమయంలో ఆ క్యాప్సూల్‌లోని పారాషూట్లు విఫలమైనట్లు తెలుస్తోంది. దీంతో జూన్ 24వ తేదీన క్యాప్సూల్ పసిఫిక్ సముద్రంలో కూలింది. ద ఎక్స్‌ప్లోరేషన్ కంపెనీ కస్టమర్లకు చెందిన సుమారు 300 కేజీల పేలోడ్‌ను క్యాప్సూల్‌లో పంపింది. లింక్డిన్‌లో ఆ కంపెనీ స్టేట్మెంట్ రిలీజ్ చేసింది. పాక్షికంగా తమ ప్రయోగం సఫలమైనట్లు పేర్కొన్నది. సెలిస్‌టిస్ కంపెనీకి చెందిన పేలోడ్ కార్గో పేలిపోవడం ఇది రెండోసారి. 2023లో నాసా ఆట్రోనాట్ ఫిలిప్ కే చాప్మన్ అస్తికలు తీసుకెళ్తున్న వేళ రాకెట్ పేలిన విషయం తెలిసిందే. అస్తికలు కోల్పోయిన కుటుంబసభ్యులుకు సెలిస్‌టిస్ కంపెనీ కూడా సంతాపం ప్రకటించింది.

# పాక్ అధ్యక్షుడికి పదవీగండం
## తిరుగుబాటుకు సైనికచీఫ్ సైలెంట్ వ్యూహం



**కరాచి,జులై 18:** పాక్‌అధ్యక్షుడు ఆసిఫ్ ఆలీ జర్దారీకి పదవీ గండం ముప్పు పొంచి ఉంది. ఆదేశ సైనికచీఫ్ ఆసిమ్‌మునీర్ నుంచే ఆయనకు ముప్పు ఉందని, ఆయన్ను తొలగించి మళ్లీ మిలిటరీ అధీనంలోకి తీసుకోవాలన్న లక్ష్యంతో మునీర్ పావులు కదుపుతున్నట్లు పాక్ పత్రికలు, ఆంగ్లమీడియా కోడైకూస్తోంది. సైలెంట్ సైనిక తిరుగుబాటుతో పాక్ సంక్షోభంలోకి వెళ్తుందనే ఊహాగానాలు మళ్లీ తెరపైకి వచ్చాయి. గతేడాది మార్చిలో రెండోసారి అధ్యక్ష పదవిని చేపట్టిన జర్దారీ, రాజ్యాంగ అధికా రాలను చురుకుగా వినియోగించడాన్ని సైనిక వర్గాలు జీర్ణించుకోలేకపోతున్నాయన్న ప్రచారం వ్యాప్తిలోకి వచ్చింది. ముఖ్యంగా సీనియర్ నియామకాలు, విదేశాంగ విధానం, కీలక పోస్టింగుల విషయంలో జర్దారీ సైనిక సూచనలను పట్టించుకోకుండా ముందుకెళ్తుండటం మునీర్‌తో విభేదాలు మరింత బలపడ్డాయి. పాకిస్థాన్ అధ్యక్షుడు అసిఫ్ అలీ జర్దారీ కుమారుడు బిలావల్ భుట్టో ఇటీవల భారత్‌కు హాఫీజ్ సయీద్, మసూద్ అజర్ వంటి ఉగ్రవాదులను అప్పగించాలనే వ్యాఖ్యలు పాక్ జిహాదీ వర్గాలను ఆగ్రహానికి గురిచేశాయి. ఇది కూడా సైనిక వర్గాల్లో అసంతృప్తిని పెంచినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సైనిక తిరుగుబాటుకు మునీర్ సిద్ధమయ్యారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. గతంలోనూ పాక్‌లో సైన్యం అధికారాన్ని హస్తగతాన్ని చేసుకున్న సందర్భాలు ఉన్నాయి. ఇప్పటి వరకూ మూడుసార్లు 1958, 1977, 1999 సంవత్సరాల్లో ప్రజా ప్రభుత్వాలపై సైన్యం తిరుగుబాటు చేసింది. 1999లో జనరల్ పర్వేజ్ ముషరఫ్ ప్రధానమంత్రి నవాజ్ షరీఫ్‌ను తొలగించారు. అంతకు ముందు 1977లో జనరల్ జియా ఉల్ హక్ ప్రధానమంత్రి జుల్ఫికర్ భుట్టో ప్రభుత్వాన్ని కూల్చారు. 'భద్రతా సమస్యలు', 'అవినీతి', లేదా 'రాజకీయ అనిశ్చితి' అనే వంకతో సైన్యం అధికారాన్ని హస్తగతం చేసుకుం టోంది. ఇక, 2022లో సైన్యాధిపతిగా నియమితుడైన మునీర్‌కు గూఢచారి సంస్థ , సైన్యం ఇంటెలిజెన్స్‌లో అనుభవం ఉంది. ఆయనను అత్యంత కర్కోటకుడిగా పరిగణిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో పాక్ ఆర్మీ చీఫ్ మునీర్ భేటీ అయ్యినప్పటికీ, ఆయన విదేశీ సంబంధాలను ప్రధానంగా ఆర్మీ ఆధిపత్యానికి అనుగుణంగా మలుచుకుంట్లు అంచనా. మునీర్‌కు 'ఫీల్డ్ మార్షల్' హోదాను కట్టబెట్టడం ఆయనకు దాదాపు నిర్వివాదాధికారాన్ని కల్పించే సూచనగా భావిస్తున్నారు.పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ సహ అధ్యక్షుడైన అసిఫ్ జర్దారీ సంకీర్ణ ప్రభుత్వం ఒప్పందంలో భాగంగా రెండోసారి అధ్యక్షుడయ్యారు. తాను చట్టబద్ధంగా అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నానని స్పష్టం చేస్తూ సైనిక ఒత్తిళ్లకు తలొగ్గకుండా కొన్ని ఆదేశాలను అడ్డుకుంటున్నారు.

# హైదరాబాద్‌లో వరుస బాంబు బెదిరింపులు
## జింఖాన క్లబ్, సిటీ సివిల్ కోర్టులో నాలుగు గంటలకు పైగా సోదాలు




మంగళవారం సిటీసివిల్‌కోర్టు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** హైదరాబాద్‌లో మంగళవారం వరుస బాంబు బెదిరింపులు ఓవైపు పోలీసులను ఉరుకులు, పరుగులు పెట్టించగా మరోవైపు ఆయా ప్రాంతాల ప్రజలను హడలెత్తించాయి. సికింద్రాబాద్‌లోని జింఖాన క్లబ్, పాత బస్తీలోని సిటీ సివిల్ కోర్టులో బాంబులు అమర్చినట్లు అన్నా వర్సిటీ పూర్వ విద్యార్థుల పేరిట తెల్లవారుజామున మూడున్నర గంటలకు సిటీ సివిల్ కోర్టు న్యాయమూర్తితో పాటు, జింఖాన క్లబ్ నిర్వాహకులకు మెయిల్ వచ్చింది. దీనిపై వెంటనే స్పందించిన పోలీసు యంత్రాంగం ఆయా ప్రాంతాల పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేసింది. మొదట సిటీ సివిల్ కోర్టులో ఆ తరువాత జి ంఖాన క్లబ్‌లో వరుసగా బాంబులు పేలతాయని మెయిల్‌లో వుండడంతో పోలీసు అధికారులు జాగిలాలతో పాటు పేలుడు పదార్థాలను నిర్వీర్యం చేసే బృందంతో రంగంలో దిగారు. హైదరాబాద్‌లో గతంలో వరుస బాంబు పేలుళ్లు జరిగివున్న నేపథ్యంలో బాంబు బెదిరింపులను పోలీసు అధికారులు తీవ్రంగానే పరిగణించారు. ఈ సందర్బంగా ముందు జాగ్రత్త చర్యగా జింఖాన క్లబ్‌తోపాటు సిటీ సివిల్ కోర్టులో ఎవరినీ అనుమతించలేదు. పాతబస్తీలోని సిటీ సివిల్ కోర్టును కొన్ని గంటల పాటు మూసివేశారు. న్యాయవాదులతో పాటు కక్షిదారులను బయటకు పంపారు. ఆఖరుకు న్యాయమూర్తులు కూడా న్యాయస్థానాల నుంచి కొన్ని గంటల పాటు దూరంగా వున్నారు. జింఖాన క్లబ్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. రెండు ప్రాంతాలలో నాలుగు గంటలకు పైగా పోలీసులు ముమ్మరంగా తనిఖీలు చేశాక ఎక్కడా ఎలాంటి బాంబులు లేవని నిర్ధారణకు వచ్చారు. మెయిల్ పంపిన వ్యక్తి తమిళనాడులో ఒక మీడియా గురించి కొన్ని ప్రస్తావనలు చేశాడు. ఆ రాష్ట్రంలో కొన్ని వర్గాలకు అన్యాయం జరిగిందని అందులో వుంది. అయితే బాంబు బెదిరింపులకు పాల్పడ్డ వ్యక్తి కావాలని, పోలీసులను ఉరుకులు, పరుగులు పెట్టించడానికి ప్రజలను భయభ్రాంతులకు గురిచేయడానికి ఇలా చేసి వుంటారని పోలీసులు భావిస్తున్నారు. మెయిల్ పంపిన వ్యక్తి కోసం కోసం గాలిస్తున్నారు. దీనిపై కేసు నమోదు చేసి విచారణ చేబట్టారు.

# 14 దేశాలపై ట్రంప్ 25నుంచి 40% సుంకాలు
## డీల్‌కు అంగీకరించకపోతే మరిన్ని సుంకాలంటూ ట్రంప్ వార్నింగ్

**వాషింగ్టన్, జూలై 8:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి వాణిజ్య యుద్ధానికి దిగారు. అమెరికా ఉత్పత్తుల దిగుమతులకు అడ్డంకులు తొలగించాలని పలు దేశాలను డిమాండ్ చేశారు. అమెరికాలో తయారీని పెంచాలని కూడా తేల్చి చెప్పారు. ఈ డీల్‌కు అంగీకరించకపోతే భారీ సుంకాలు తప్పవంటూ 14 దేశాలకు లేఖలు రాశారు. ఆయా దేశాల నుంచి అమెరికా దిగుమతి చేసుకునే ఉత్పత్తులపై 25 శాతం నుంచి 40 శాతం వరకూ సుంకాలను విధిస్తామని వార్నింగ్ ఇచ్చారు. తమ వాణిజ్య డిమాండ్స్‌కు అంగీకరించని దేశాలపై ఆగస్టు 1 నుంచి సుంకాల వడ్డన ఉంటుందని తేల్చి చెప్పారు. తన లేఖల్లో డెడ్‌లైన్ గురించి ప్రస్తావించినప్పటికీ ఈ విషయంలో మరిన్ని చర్చలకు సుముఖంగానే ఉన్నామని ట్రంప్ పేర్కొన్నారు. ఆగస్టు 1 డెడ్‌లైన్ కచ్చితమైనదేమీ కాదని వెల్లడించారు. చర్చలకు వీలు కల్పించేలా ఈ గడువును మరింత పొడిగించేందుకు కూడా రెడీ అని అన్నారు. అమెరికా ఉత్పత్తులపై ఆంక్షలు తొలగించే దేశాలపై సుంకాలు మరింతగా తగ్గించే అవకాశం కూడా ఉందని అన్నారు. యూఎస్ కేవలం న్యాయమైన, సమతౌల్యమైన వాణిజ్యాన్ని మాత్రమే కోరుకుంటోందని చెప్పిన ట్రంప్.. తన అభీష్టానికి ఎదురెళితే మాత్రం మరింత సుంకాల వడ్డన తప్పదని కూడా హెచ్చరించారు. ట్రంప్ లేఖలు అందుకున్న దేశాలు లావోస్, మియాన్మార్ 40 శాతం థాయ్‌లాండ్, కాంబోడియా 36 శాతం, బంగ్లాదేశ్, సెర్బియా 35 శాతం, ఇండోనేషియా 32 శాతం,దక్షిణాఫ్రికా, బోస్నియా అండ్ హెర్జ్‌గోవినా 30శాతం, జపాన్, దక్షిణ కొరియా, మలేషియా, కజఖస్థాన్, ట్యునీషియా25 శాతం, ఈ దేశాల్లో అనేకం ఎగుమతులపై అధికంగా ఆధార పడ్డాయి. గతంలో ఈ దేశాలపై సుంకాలు కేవలం 10 శాతంగా ఉండేది. ఇక ట్రంప్ లేఖపై జపాన్ విచారం వ్యక్తం చేసింది. ఈ విషయంలో చర్చలు జరుపుతామని వెల్లడించింది. భారీ సుంకాల ప్రమాదం తప్పించేందుకు చర్చలు కొనసాగిస్తామని దక్షిణ కొరియా, మలేషియా కూడా వెల్లడించాయి. ఇదిలా ఉంటే యూకే, వియత్నాంతో అమెరికాకు డీల్ కుదిరిందని డొనాల్డ్ ట్రంప్ ఇప్పటికే ప్రకటించారు. భారత్‌తో కూడా డీల్ దాదాపుగా ఖరారైనట్టేనని అన్నారు.



# అనుమతి లేకుండా అంటార్కిటికాలో ల్యాండింగ్
## యుఎస్ పైలట్ ఈథన్‌గువ్‌ను అదుపులోకి తీసుకున్న చిలీ అధికారులు

**వాషింగ్టన్, జులై 8:** అమెరికాకు చెందిన 19 ఏళ్ల పైలట్ ఎటువంటి అనుమతి లేకుండా ఏడు ఖండాలు చుట్టేయడానికి ప్రయత్నించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. యుఎస్‌కు చెందిన 19 ఏళ్ల పైలట్ ఈథన్‌గువ్ ఒంటరిగా ప్రపంచదేశాలను చుట్టేయాలనే ఆలోచనతో తన విమాన ప్రయాణ మార్గాన్ని మార్చుకుని ఎలాంటి అనుమతి లేకుండా అంటార్కిటాలో దిగే ప్రయత్నం చేశాడు. అయితే అప్పటికే అతడు పలు జాతీయ, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘించినట్లు గుర్తించిన చిలీ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించిన వివరాల ప్రకారం అమెరికాకు చెందిన ఈథన్ గువ్ అనే పైలట్ ఏడు ఖండాలను చుట్టివేయాలనే ఆలోచనతో అధికారులకు ఎటువంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా తన విమాన ప్రయాణ ప్రణాళికలను మార్చివేశాడు. పలు జాతీయ, అంతర్జాతీయ నిబంధనలను ఉల్లంఘిస్తూ చివరికి అంటార్కిటికాలోని ఓ ప్రాంతంలో ల్యాండ్ అయ్యాడు. దీంతో వెంటనే అప్రమత్తమైన చిలీ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏరోనాటిక్స్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. చిలీ జనరల్ డైరెక్టరేట్ ఆఫ్ సివిల్ ఏరోనాటిక్స్ అధికారులు అతడిని అదుపులోకి తీసుకున్నారు.విమానంలో ఇప్పటికే అతడు ఆరు ఖండాల మీదుగా 140 రోజులు ప్రయాణించినట్లు పేర్కొన్నారు. అతడివల్ల అంటార్కిటికా, మగల్లన్స్ ప్రాంతాలలో వాయు రవాణా భద్రతకు అంతరాయం కలిగినట్లు అధికారులు తెలిపారు. పైలట్ తన ప్రయాణానికి సంబంధించిన సరైన ఆధారాలను చూపడంలో విఫలమయ్యారని అధికారులు పేర్కొన్నారు. పుంటా అరీనాస్ నగరం మీదుగా ప్రయాణించబోతున్నట్లు చూపే తప్పుడు ప్రణాళికను అతడు సమర్పించినట్లు తెలిపారు. అంతర్జాతీయ గగనతల సరిహద్దు నిబంధనలను ఉల్లంఘించినందుకుగాను అతడికి జైలుశిక్ష విధించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అయితే సదరు పైలట్ ఒంటరిగా ఏడు ఖండాలకు ప్రయాణించి విరాళాలను సేకరించి వాటిని కేన్సర్ బాధితులకు ఇవ్వాలనేఆలోచనతో ఈప్రయాణం మొదలుపెట్టారని అతడి తరఫు లాయర్ పేర్కొన్నారు.




# హైడ్రా అన్ని రాష్ట్రాలకూ అవసరం
## హైదరాబాద్ చెరువులను సందర్శించిన కర్ణాటక ఇంజినీర్ల బృందం



మంగళవారం చిత్రాలతో కూడిన ఫొటో ఫ్రేంను రంగనాథ్‌కు అందిస్తున్న కర్ణాటక ఇంజినీర్ల బృందం

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** నగరంలో హైడ్రా పనితీరును బెంగళూరు లేక్స్ డిపార్ట్మెంట్ ఇంజినీర్ల బృందం మంగళవారం పరిశీలించింది. చెరువుల పరిరక్షణ,పునరుద్ధరణ, అభివృద్ధిని క్షేత్ర స్థాయిలో వీక్షి ంచింది. పాతబస్తీలో బమృక్‌ద్దౌలా చెరువుతో పాటు అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుం టను సందర్శించింది. చెరువుల పునరుద్ధరణ, అభివృద్ధి పనులు చేపట్టక ముందు, తాజా పరిస్థి తులను గమనించింది. చెరువుల్లో ఆక్రమణలను తొలగించిన తీరును తెలుసుకుంది. నీటి జాడ లేని చెరువులను అభివృద్ధి చేసిన తీరును అభి నందించి వరదల నివారణకు చెరువుల ప్రాధా న్యత ఎంతో ఉందని వివరించింది. చెరువులను అనుసంధానం చేసే నాలాలను కూడా పరిరక్షి ం చాల్సిన అవసరం ఎంతో ఉందని అభిప్రాయ పడింది. ముఖ్యంగా అంబర్పేటలో ముల్లపొ దలతో, పిచ్చి మొక్కలతో పూర్తిగా కప్పేసిన చెరువును పునరుద్ధరించిన తీరు ఆసక్తిగా ఉందని ఇంజినీర్లు అన్నారు. ఆక్రమ ణలను తొలగిం చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురయ్యాయో వాకబు చేశారు. బతుకమ్మ కుంట అని పేరు ఎం దుకు వచ్చింది. మరి ఆచెరువు ఎలా పూడ్చివేశారు ఇలా అనేక విష యాలను తెలుసుకున్నారు. క్షేత్ర స్థాయిలో చెరువు పునరుద్ధరణ, అభివృద్ధిని చూసి ముచ్చట పడ్డారు. పాతబస్తీలోని బమృక్నుద్దౌలా చెరువు గొప్పతనాన్ని తెలుసుకున్నారు. వనమూలికల మెక్కలు, చెట్ల కొమ్మలు వేసిన ఈ చెరువు దిగువున ఊట బావి నీటిని నిజాం నవాబులు తాగునీటిగా వినియోగించిన చరిత్రను తెలుసుకుని ముచ్చట పడ్డారు. ఇలాంటి చరిత్ర ఉన్న చెరువులను పునరుద్ధరించిన హైడ్రాకు అభినందనలు తెలిపారు.చెరువుల సందర్శన అనంతరం కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన చీఫ్ ఇంజినీర్ హరిదాసు, ఎగ్జిక్యూ టివ్ ఇంజినీర్లు నిత్య, భూప్రద, మహదేవ్‌లతో పాటు ఆ రాష్ట్ర ప్రతినిధులు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్‌తె బేటీ అయ్యారు. నగరంలో పూర్తిగా కనుమరుగై, కాలుష్యం బారిన పడిన చెరువులను అభివృద్ధి చేస్తున్న తీరు బాగుంద న్నారు. చెరువులు, నాలాలు, పార్కుల ఆక్రమణ లతోపాటు ప్రభుత్వ భూములు, ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను పరిరక్షించడం కత్తిమీద సాములాం టిదని, అనతి కాలంలోనే చెరువుల ఎఫ్టీఎల్, బఫర్ అంటే ఏంటో ప్రజలు తెలుసు కునేలా చేశారంటూ ప్రశంసించారు. హైడ్రా వంటి సంస్థ అన్ని రాష్ట్రాలకూ అవసరమని అన్నారు. బెంగళూరులో చెరువుల పరిరక్షణకు తీసుకుం టున్న చర్యలను వివరించారు. 2006 నుంచి చెరువుల హద్దులను నిర్ధారించి ఫెన్సింగ్ వేయడం ద్వారా కబ్జా కాకుండా చూస్తున్నామన్నారు. కాలువలు కబ్జాకు గురి అవ్వడంతోనే వరదలు వస్తున్నాయని త్వరలోనే ఈ సమస్యకు కర్ణాటక ప్రభుత్వం పరిష్కారంచూపడానికి చర్యలుతీసు కుంటోం దన్నారు. బెంగళూరులో చెరువులను హైడ్రా కమిషనర్ సందర్శించినప్పటి చిత్రాలతో కూడిన ఫొటో ఫ్రేంను రంగనాథ్‌కు అందించారు.

# తెలంగాణలో పెరిగిన తలసరి వ్యయం

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** తెలంగాణలో ఏడాది కాలంలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పెరిగిందని కేంద్రం వెల్లడించింది. పట్టణాల్లో తలసరి సగటు వినియోగ వ్యయంలో తెలంగాణ అగ్రస్థానంలో ఉండగా, గ్రామీణంలో కేరళ తలసరి ఆదాయంలో (రూ.6,611) అగ్రస్థానంలో ఉన్నట్లు వెల్లడించింది. తెలంగాణలో తలసరి నెలవారీ వినియోగ వ్యయం పట్టణాల్లో రూ.820, గ్రామాల్లో రూ.633లకు పెరిగిందని పేర్కొంది. దీంతో తలసరి నెలవారీ ఖర్చు గ్రామాల్లో రూ.5,435కి, పట్టణాల్లో రూ.8,978కి చేరినట్లు తెలిపింది. దేశవ్యాప్తంగా చూస్తే గ్రామీణ ప్రాంతాల్లో వ్యయం చూసుకుంటే రూ.4,122 ఉండగా, పట్టణాల్లో రూ.6,199గా ఉంది. ఆదాయ వర్గాల వారీగా చూస్తే తెలంగాణలో గరిష్ఠంగా నెలకు రూ.12,619 ఖర్చు అవుతుంది. ఇక తెలంగాణలో విద్యపై గ్రామీణ ప్రాంతాల్లో నెలకు తలసరి రూ.183, పట్టణాల్లో రూ.713.89 ఖర్చు చేస్తున్నారు. పట్టణాల్లో చదువుల కోసం తెలంగాణలోనే అత్యధిక వ్యయం అవుతోందని నివేదిక తెలిపింది. అలాగే పట్టణాల్లో అద్దెకు 10 శాతం ఖర్చు చేస్తున్నారు. గ్రామాల్లో వైద్యం కోసం నెలకు రూ.376 ఖర్చు చేయగా, పట్టణాల్లో నెలకు రూ.426 చొప్పున వ్యయం అవుతుందని సర్వే పేర్కొంది. సామాజిక వర్గాల వారీగా చూస్తే మాత్రం ఈ వ్యయంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల వ్యయం తక్కువగా ఉంది.

# యూరియా కొరత లేకుండా చూడాలి
## రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు నర్సారెడ్డి

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో యూరియా కొరత లేకుండా తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు ఐక్యవేదిక అధ్యక్షుడు ఎస్ నర్సా రెడ్డి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనందున రైతుల అవసరాలకు అనుగుణంగా సరిపడా యూరియాను కేటాయించాలని మంగళవారం ఒకప్రకటనలో కోరారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రాష్ట్రానికి ఐదు లక్షల మెట్రిక్ టన్నుల కోటా నిర్దేశించినప్పటికీ అందులో ఇప్పటివరకు 3.06లక్షల టన్నుల యూరియా మాత్రమే సరఫరా అయిందన్నారు. అరకొర సరఫరా కారణంగా రాష్ట్రంలో దాదాపుగా 1.94 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కొరత ఏర్పడిందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రానికి ఎరువుల కేటాయింపు విషయంలో కేంద్ర ప్రభుత్వం వివక్ష చూపుతోందని విమర్శించారు.

# ఇప్పటి వరకూ 50 లక్షల ఎకరాల్లో పంటల సాగు

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ప్రస్తుత వానాకాలం సీజనులో దాదాపు 50 లక్షల ఎకరాల వరకు పంటలు సాగు అయ్యాయి. ఆదిలాబాద్, సంగారెడ్డి, నిజామాబాద్, నారాయణపేట్, నల్గొండ, వికారాబాద్, కొత్తగూడెం, ఖమ్మం, ఆసిఫాబాద్ జిల్లాల్లో పంటల సాగు జోరందుకుంది. ఈ వానాకాలం సీజన్లో అత్యధికంగా సాగయ్యే పంటల్లో 35 లక్షల ఎకరాలలో సాగై పత్తి అగ్రస్థానంలో ఉంది. అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లాలో పత్తి సాగు 4 లక్షల ఎకరాలు దాటేసింది. ఇక పత్తి తర్వాత కంది పంట 3 లక్షల ఎకరాల వరకు సాగైంది. వికారాబాద్ జిల్లాలో అత్యధికంగా 75 వేల ఎకరాల్లో ఈ పంట వేశారు. ఇక సోయా పంటల సాగు రాష్ట్వ్యాప్తంగా ఇంతవరకూ 2.63 లక్షల ఎకరాల్లో సాగైంది. నిర్మల్ జిల్లాలో అత్యధికంగా ఈ పంట సాగు లక్ష ఎకరాలకు చేరువైంది. మొక్కజొన్న పంటకు సంబంధించి తెలంగాణలో 2.50లక్షల ఎకరాల్లో సాగు కాగా, అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 55 వేల ఎకరాల్లో సాగైంది.

# రాజశేఖర్‌పై సిబిఐ కేసు

**హైదరాబాద్, జులై 7, ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే సూపరింటెండెంట్ రాజశేఖర్‌పై సిబిఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఆదాయానికి మించి ఆస్తులు కలిగిన వున్నందుకు అవినీతి చట్టం కింద ఆయనపై సిబిఐ అధికారులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో భార్య నవనీతను కూడా నిందితురాలిగా చేర్చారు. సికింద్రాబాద్‌లోని దక్షిణ మధ్య రైల్వేసంచాలన్ భవన్‌లో రాజశేఖర్ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నారు. రాజశేఖర్ దంప తులు ఐటి రిటర్న్‌లు దాఖలు చేయడం లేదని సిబిఐ గుర్తించింది. ఈ కేసునుహైదరాబాద్ సిబిఐ విభాగం విచారిస్తోంది.

**PUBLIC NOTICE**

It is hereby informed to all the General Public that we the **"M/s. VASAVI INFRACON LLP"** being developed the **Residential High Rise Apartment** project in land admeasuring Ac.21-11 Gts. equivalent to 1,02,971 Sq.Yds (or) 86,096.87 Sq. Mts. in Sy. No. 126/Part and 137/Part under the name of **"VASAVI URBAN"** situated at Bachupally Village and Mandal, Nizampet Municipal Corporation, Medchal-Malkajgiri District, Telangana State, and the project has been approved by HMDA, dated: **03-08-2020**, vide permit **No.024274/MED/R1/U6/HMDA/01062019**, and registered the project under the provisions of the Act with the **Telangana Real Estate Regulatory Authority** at HYDERABAD, TELANGANA on **30-10-2020** under registration **No.P02200002275**.

However, due to "force majeure event as defined under section 6 of the RERA Act 2016, the completion of the project has been impacted.

In order to complete the project as per the orders of RERA & in view of Covid 19 pandemic" we have applied for an extension of the project completion date and the application is currently under review by the RERA authority.

Hence this public notice is being issued as per the requirements of the Real Estate (Regulation and Development) Act 2016, and the rules and regulations framed thereunder.

**By Management of**
**M/s. Vasavi Infracon LLP**

సాంస్కృతిక మంత్రిత్వశాఖ
భారత ప్రభుత్వం

**టెండరు ప్రకటన**

పనియొక్క పరిధిలో ప్రత్యేకంగా సూచించబడిన ఇతర కర్తవ్యాలతో సహా వినియోగ - స్నేహపూరిత డిజిటల్ పదిలంగా వుండే చోట మరియు వెబ్-కమ్-మొబైల్ అప్లికేషన్‌తో డిజిటల్ డేటా స్టోరేజ్ నిమిత్తం సమగ్ర సొల్యూషన్ కొరకు RFP.

సాంస్కృతిక మంత్రిత్వశాఖ అధికారయుత వెబ్‌సైట్ **indiaculture.gov.in** మరియు సెంట్రల్ పబ్లిక్ ప్రొక్యూర్‌మెంట్ పోర్టల్: **eprocure.gov.in/eprocure/app** నుండి టెండర్ డాక్యుమెంట్‌లు డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును.

బిడ్ దాఖలు కొరకు చివరి తేదీ: 28వ జులై 2025

**cbc 09101/11/0009/2526**

**Standard Chartered Bank**

**Form No.3**
**(See Regulation-15 (1) (a) /16(3)**
**BEFORE DEBTS RECOVERY TRIBUNAL II. HYDERABAD**
**FIRST FLOOR, TRIVENI COMPLEX, ABIDS, HYDERABAD-500001**
**Case No. OA 952/2023**

Summons under sub-section (4) of section 19 of the Act, read with sub-rule (2A) of rule 5 of the Debt Recovery Tribunal (Procedure) Rules, 1993

**STANDARD CHARTERED BANK**
VS
**SUSHILA DEVI TAPARIA AND ANOTHER**

To,
1. Ms. Sushila Devi Taparia, Prop. Balaji Paper House, Flat No.204.H.No.3-4-373, Near Old Basanth Talkies, Lingampally, Kachiguda, Hyderabad - 500027
2. Mr. Shreenivas Taparia, Flat No.204. H.No.3-4-373, Near Old Basanth Talkies, Lingamapally, Kachiguda, Hyderabad - 500027.

Whereas, O.A. No.952 of 2022 was listed before Hon'ble Presiding officer on 25-08-2025

Whereas, this Hon'ble Tribunal is pleased to issue summons. notice on the said application under section 19(4) of the Act, (OA) filed against you for recovery of debts of Rs.28,95,517.73 (Rupees Twenty Eight Lakhs Ninety Five thousand Five Hundred Seventeen and Paise Seventy Three only).

In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under:

(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted.
(ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application.
(iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the applications for attachment of properties.
(iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest is created and/or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal.
(v) You shall be liable to account for the sale proceeds realised by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank of financial institutions holding security interest over such assets.

You area also directed to file the written statement with a copy thereof furnished to the applicant and to appear before on 25-08-2025 at 10.30 A.M failing which the application shall be heard and decided in your absence.

Given under my hand and the seal of this Tribunal on this the 30th day of June 2025.

Signature of the Officer Authorised to issue summons.

# టెక్సాస్‌లో ప్రకృతి ప్రళయం: 100 మందికిపైగా మృతి, 84 మృతదేహాల రికవరీ

**టెక్సాస్, జూలై 8:** అమెరికా రాష్ట్రమైన టెక్సాస్‌లో వరదలు ముంచెత్తాయి. గత వారం రోజుల నుంచి కుండపోత వర్షాల కారణంగా ఏర్పడిన వరదల్లో ఇప్పటివరకు 100 మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. వీరిలో 28 మంది పిల్లలు ఉన్నారు. ప్రాణ నష్టం మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెపుతున్నారు. ఈ వరదల్లో కెర్ కౌంటీ అత్యంత ఎక్కువ దెబ్బతిన్నది. కెర్ కౌంటీలో ఇప్పటి వరకు 84 మృతదేహాలు వెలికితీయగా, గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపడుతున్నారు. వరదల కారణంగా గాయపడిన వారిని రక్షించేందుకు పోలీసులు, ఆర్మీ, ఫైర్ రెస్క్యూ టీమ్‌లు తీవ్రంగా శ్రమిస్తున్నాయి. గత కొన్ని దశాబ్దాల్లో అమెరికాలో జరిగిన అతి తీవ్రమైన ప్రకృతి విపత్తులలో ఇది ఒకటి. వాతావరణ హెచ్చరికల పట్ల అవగాహన లోపంతో పాటు పలు కారణంగా భారీగా ప్రాణ నష్టాన్ని చవిచూడాల్సి వచ్చింది. ప్రస్తుతం టెక్సాస్‌లో వేసవి కావడంతో చాలామంది విద్యార్థులు, యువకులు గ్వాడలూపే నది తీరంలోని శిబిరాల్లో సేదతీరుతున్నారు. ఈ క్రమంలో వరదలు ఊహించని రీతిలో ముంచెత్తాయి. వరద నీరు హఠాత్తుగా పడి టెంట్లు, కాటేజీలు, క్యాబిన్లను కొట్టుకుపోయింది. చాలామంది నిద్రలోనే వాహనాలతో పాటు కొట్టుకుపోయారు. కొందరు చెట్లకు పట్టుకొని తమ ప్రాణాలు రక్షించుకున్నారు. వరద విపత్తు తర్వాత తీరంలో కొట్టుకొచ్చిన విరిగిపోయిన చెట్లు, పడకలు, గృహోపకరణాలు, వాలీబాల్‌లు, ఇతర వస్తువులతో పేరుకుపోయాయి. టెక్సాస్ రాష్ట్రంలోని కెర్ కౌంటీతో పాటు ట్రావిస్, బర్నెట్, టామ్ గ్రీన్, విలియమ్సన్ కౌంటీలను వరదలు ముంచెత్తాయి. ఈ ప్రాంతాల్లో 19 మంది మరణించారు. డల్లాస్‌కు చెందిన 8 ఏళ్ల అక్కా చెల్లెళ్లు ప్రాణాలు కోల్పోయారు. ఓ మాజీ ఫుట్‌బాల్ కోచ్, అతని భార్య కూడా నదీ తీరంలోని ఇంట్లో ఉన్న సమయంలో మృతి చెందారు. వారి ఇద్దరు కుమార్తెలు గల్లంతయ్యారు. ఈ వరదలపై కెర్విల్ నగర మేనేజర్ డాల్టన్ రైస్ స్పందించారు. ఈ ప్రాంతాల్లో సెల్‌ఫోన్ కనెక్షన్ బలహీనంగా ఉండటంతో చాలా క్యాంప్‌లకు సమాచారం చేరలేదు. గాలింపు పూర్తయ్యాక, ఈ వ్యవహారంపై సమగ్రంగా విచారణ చేస్తాం అని తెలిపారు. అయితే, వాతావరణ హెచ్చరికలు చూసి కొన్ని క్యాంప్‌లు ముందే ఎత్తు ప్రాంతాలకు తరలించారు.



వార్త


ప్రతి మనిషి ఎంత గొప్పవాడైనప్పటికీ, అతని మెదడుకున్న శక్తిలో శతకోటి భాగం కూడా తన జీవిత కాలంలో ఉపయోగించుకోలేడనేది యథార్థం.

-ఎన్. డుబినిన్

## వారసుడెవరు?

కుటుంబ వ్యవస్థలో ఔరసపుత్రుడే వారసుడిగా మనగలుగుతాడు. సామాజిక వ్యవస్థలోమాత్రం ఒకరి ఆశయాలు ఆకాంక్షలను ముందుకు తీసుకెళ్లగలిగినవాడే వారసుడు కాగలుగుతాడు. అలాంటి అంశాలలో సరైన వారసుడిని ఎంపికచేయడంలో నిబద్ధత కలిగినవారు దొరకడం దుర్లభం. తొంభైయేళ్లు నిండిన దలైలామా మరో 30,40 ఏళ్ల ప్రజాసేవలో ఉండాలని ఆకాంక్షిస్తున్నా వారసునికోసం అన్వేషణ తప్పలేదు. టిబెట్ బౌద్ధమత గురు దలైలామా ఇప్పటికే వారసుడి ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ప్రకటించారు. బుద్ధుడి బోధనల వ్యాప్తికి విశేషకృషి చేస్తున్న ఆయన 15వ దలైలామా ఎంపిక గురించి ప్రస్తావించగానే భారత్, చైనాల మధ్య ఈ ఎంపిక ప్రక్రియ తమదంటే తమదన్నట్లుగా వాదించుకుంటున్నారు. కరుణ, జాలి కలిగిన సుహృదయంతో జీవించగలిగితే మనశ్శాంతిని పొందగలమని మనసా, వాచా, కర్మణా, ఆయన విశ్వసిస్తారు. టిబెటన్ బౌద్ధానికి దలైలామాయే గురువు. హిమాలయ పరిసర ప్రాంతాల్లో టిబెటన్ బౌద్ధం బాగావ్యాపించి ఉంది. స్థానిక సంస్కృతీ, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలను ఆకళింపు చేసుకోవడం ద్వారా టిబెటన్ బౌద్ధం రూపుదిద్దుకొంది. బుద్ధుడు బోధించిన తత్వాలను విస్తృత ప్రాతిపదిక మీద జనబాహుళ్యానికి దగ్గర చేయడమే లక్ష్యంగా పర్వతసానువుల్లో దలైలామా నేతృత్వంలో బౌద్ధమత వ్యాప్తి జరుగుతోంది. టిబెట్‌ను పాలించిన ఎంతో శక్తివంతమైన మంగోళులు సైతం దలైలామా పీఠాధిపత్యాన్ని గౌరవించేవారు. ప్రస్తుత దలైలామా ఎంపిక సమయంలో అప్పటి చైనా ప్రభుత్వం తగినంత ప్రాధాన్యత నివ్వలేదు. టిబెట్ తమ ఆధిపత్యం నుంచిఎక్కడ జారిపోతుందోనని ఆనాటి చైనా పాలకులు దలైలామాను ఇబ్బందుల పాలు చేసినా జంకలేదు. గొంకు లేకుండా నిబ్బరంగా నిలబడ్డారు. 1959లో దలైలామా ఎంపికను చైనాలో కమ్యూనిస్టు ప్రభుత్వం చిక్కుల పాల్జేసింది. సాధారణంగానైతే ప్రతిపాదిత పేర్లను ఓ బంగారు పాత్రలో వేసి లాటరీ తీయడంద్వారా ఎన్నుకోవడం ఆనవాయితీ. తమ అనుమతి పర్యవేక్షణ లేకుండా పీఠాధిపతిని ఎన్నుకోరాదని చైనా లింకుపెట్టింది. లేకుంటే తొలగించే అధికారాన్ని చేజిక్కించుకుంది. ప్రస్తుత దలైలామా విషయంలో అభద్రతా భావం ఏర్పడిన చైనా ప్రభుత్వం 66ఏళ్ల క్రితం ఆయనను అపహరించాలని వ్యూహం పన్నగా టిబెట్‌లో తిరుగుబాటు జరిగింది. ఎంతోమంది టిబెటన్లు ఊచకోతకు గురయ్యారు. అదే సమయంలో టిబెటన్లు దలైలామాను మిలటరీ సైనికుడిలా మారు వేషంలో భారత్‌కు పంపేశారు. చాలామంది టిబెటన్లకు భారత్ ఆశ్రయమిచ్చింది. టిబెట్ విషయంలో దలైలామా చైనాకు కొరకరాని కొయ్యగా మారాడు. భారత్‌లో టిబెట్ శరణార్థులకు ప్రత్యేక పునరావాస కేంద్రాలున్నాయి. వాటికి పలు సౌకర్యాలు కోవాలని భారత ఎంపీలు ఫోరమ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తోంది. దలైలామా 90వ పుట్టిన రోజు వేడుకల సందర్భంగా వారసుని ఎంపికలో ఆయన అంతరార్థం బయటపడింది. పుట్టిన రోజు వేడుకలు తనకిష్టం లేదని, పలు సమూహాలకు కరుణ, పరోపకారాన్ని గురించి సందేశాలు చేరతాయన్న ఆలోచనలను అభినందించారు. బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో ఉన్న భారత ప్రధాని నరేంద్రమోడీ దలైలామాను అభినందిస్తూ 1.4బిలియన్ల భారతీయుల తరపున శుభాకాంక్షలు తెలిపారు. ఇదే సమయంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో కూడా పుట్టిన రోజు శుభాకాంక్షలు అందచేశారు. ఇవే చైనాకు కంటక ప్రాయమయ్యాయి. సరిగ్గా దలైలామా వారసుడి ఎంపిక సమయంలో టిబెటన్ బౌద్ధానికి ఆ బౌద్ధపీఠానికి అందుతున్న ప్రశంసల వెల్లువ నేపథ్యంలో టిబెట్ మీద తమ పట్టు కోల్పోతామన్న ఆందోళన చైనాలో బయలుదేరింది. ఇలా వారసుడి ఎంపికలో భారత్, చైనాలమధ్య వ్యాఖ్యలు, వ్యాఖ్యానాల యుద్ధం మొదలైంది. ఆది నుంచీ దలైలామా టిబెట్‌కు సమాంతర ప్రభుత్వాన్ని నడుపుతున్నారని చైనా ఆరోపణ. ఇలా అనుకున్నప్పుడు దలైలామా గుర్తింపు రద్దు చేయచ్చుననే నిబంధన తన వద్దనే ఉంచుకున్న చైనా ప్రభుత్వం అలాంటి ప్రయత్నాలేమీ చేయడం లేదు. కానీ అడుగడుగునా దలైలామాకు ఆటంకాలు ఏర్పరచడమే పనిగాపెట్టుకుంది. దలైలామా వారసుడిని బీజింగ్ ఆమోదించిన పద్ధతుల ప్రకారమే ఎంపిక జరగాలని, టిబెట్ సంబంధిత విషయాల్లో భారత్ జాగ్రత్తగా వ్యవహరించాలని ఇటీవల చైనా విదేశాంగ శాఖహెచ్చరించింది. టిబెటన్ బౌద్ధమతంలో లివింగ్ బుద్ధాపునర్జన్మ 700ఏళ్లకు పైగా కొనసాగుతున్న ఒక చారిత్రిక, సంప్రదాయమని దానిని కొనసాగించే విషయమై నిర్ణయాధికారం దలైలామాకు లేదని భారత్‌లో చైనా రాయబారి జు ఫెయిహాంగ్ వివరించారు. కాగా చైనా చట్టాలు, మతపరమైన ఆచార వ్యవహారాల ప్రకారమే పునర్జన్మ ప్రక్రియ జరుగుతుందని కూడా వారి వాదనలో భాగం. చైనా ఆస్థిత్వ రీత్యా వారి వాదన వారిది. మత విశ్వాసాలు, నమ్మకాలకు సంబంధించిన విషయాల్లో జోక్యం చేసుకునేందుకు భారత ప్రభుత్వం సిద్ధంగా లేదు. పైగా పునర్జన్మ పూర్తిగా మతపరమైన అంశమైనందున ఇతరుల జోక్యం సరికాదంది. మరోపక్క చైనా వ్యాఖ్యలను టిబెట్ ప్రవాస ప్రభుత్వం ఖండిస్తూ టిబెట్ల గుర్తింపును మటుమాయం చేసేందుకు చైనా సాంస్కృతిక మారణహోమానికి పాల్పడుతోందని ప్రవాస ప్రభుత్వ అధ్యక్షుడు పెన్పా త్సెరింగ్ ఆరోపించారు. పుట్టిన రోజు నాటి ప్రసంగంలో దలైలామా సవివరంగా కొన్ని అంశాలను స్పష్టం చేశారు. భారత్‌లో ప్రవాస జీవితం గడుపుతున్నప్పటికీ, తాను స్థాపించిన భారత్ ఆధారిత 'గాడెన్ ఫోడ్రాంగ్ ట్రస్ట్' మాత్రమే తన వారసుడిని ఎంపిక చేయగలదని తేల్చిచెప్పారు.

ప్రపంచాన్ని అర్థం చేసుకోవాలనే కోరిక, దాన్ని మార్చాలనే ఆకాంక్ష మానవ ప్రగతికి ప్రధాన ప్రేరకాలు.



బెర్ట్రండ్ రస్సెల్

బంగారంలోని ప్రతి కణానికి విలువ ఉన్నట్లే జీవితంలోని ప్రతిక్షణానికి విలువ ఉంది.



జార్జి ఎలియట్

# ప్రజావాక్కు



### నత్తనడకన సాగుతున్న రోడ్డు పనులు

హైదరాబాద్ ఘట్కేసర్ నుండి నాగారం వెళ్లే పది కిలోమీటర్లదూరం ఉన్న రోడ్డుపనులు నత్తనడకన సాగడంతో వాహనదారులు అనేక ఇబ్బందులు పడుతూ వున్నారు. గుత్తేదారుపనిప్రారంభించి ఏడాదిగడిచి నెమ్మదిగా పనులు చేస్తుండంతో ఈ రహదారి గుండా వెళ్లే వారు దుమ్ము ధూళితో అవస్థలుపడుతూ వున్నారు. నిత్యం రోడ్డు ప్రమాదాలు జరిగి వాహనదారులు మృత్యు వాత పడుతూ వున్నారు. వంద ఫీట్స్ వెడల్పుతో రోడ్ ఘట్కేసర్ నుండి యమన్ పేట రాంపల్లి ఎక్స్ రోడ్ సత్యనారాయణ కాలనీ ఆర్‌ఎల్ నగర్‌మీదుగా నాగారం వెళుతుంది. వివిధ ప్రాంతాలలో ఉద్యోగాలు చేసి వారు కార్మికులు వివిధ పనుల నిమిత్తం వెళ్లే వారు ఆలస్యంగా పోతున్నారు. తక్షణమే సంబంధిత అధికారులు ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్డు మరమ్మతు పనుల లో వేగం పెంచాలి.

- కామిడి సతీష్ రెడ్డి, భూపాల్ పల్లి జిల్లా

### ఇతర డిపార్ట్మెంట్ జోక్యం తగదు

జులై పదో తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని స్కూళ్ళలో జరుగబోవు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కొరకు లీప్‌యాప్‌లో విట్నెస్ రిజిస్ట్రేషన్ అన్నిస్కూల్స్‌లో చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. విట్నెస్‌గా విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు కాకుండా వేరే ఏదో ఒక డిపార్ట్ మెంట్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని రిజిస్ట్రేషన్ చెయ్యాలని చెబుతున్నారు. ఈవిట్నెస్‌గా ఉన్న వ్యక్తి సమావేశం రోజున 30 సెకండ్ల వీడియో4 ఫోటోలను అప్లోడ్ చెయ్యాల్సి ఉంటుంది. స్కూళ్లలో జరిగే తల్లిదండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలలో స్కూళ్ళలో వేరే డిపార్ట్మెంట్ వారి జోక్యం తగదు. దీనికి స్కూళ్లలోని టీచర్లనే వాడాలి. దీన్ని పూర్తిగా ప్రభుత్వం విరమించుకోవాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

### ఆదాయ మార్గాలను సృష్టించాలి

ఇటీవల కాలంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు విపరీతంగా ఖర్చు చేస్తున్నాయి. ఇది దీర్ఘకాలంలో ఆర్థిక అస్థిరతకు దారితీస్తుంది. వీలైనంత త్వరగా ప్రభుత్వాలు సంక్షేమ పథకాలకు కోత విధించి ఆదాయ మార్గాలను సృష్టించాలి. ఉచిత పథకాలను ఎత్తివేసి ఆదాయ మార్గాలను సృష్టించి ఉపాధి అవకాశాలు కల్పించాలి .

- టి.ముత్యం, సిద్దిపేట జిల్లా

### ఫీజు రిఫండ్ పథకం

ప్రైవేటు విద్యాసంస్థలు ఒకపద్ధతిలేకుండా ఇష్టారాజ్యంగా ముందుచూపు లేకుండా ఫీజులు పెంచుతున్నందున మధ్య తరగతి, పేద కుటుంబాలపై భారంగా మారింది. ఒక్కో విద్యార్థి వార్షిక ఫీజు లక్షల్లో వుండగా అడ్మిషన్ ఫీ, ల్యాబ్ ఫీ, యాక్టివిటీచార్జ్, ట్రాన్స్‌పోర్ట్ ఫీవంటి అదనపు ఖర్చులు తల్లిదండ్రుల ఆర్థిక స్థిరత్వాన్ని కుప్పకూలుస్తున్నాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వం ఐదుదశలలో చర్యలు చేపట్టాలి. ఫీజు నియంత్రణ సంఘాన్ని జిల్లాల స్థాయికి విస్తరించి, ప్రతి స్కూల్ తమ ఫీజు నిర్మాణాన్ని సంవత్సరముందే ఆన్‌లైన్‌లో ఉంచే విధానాన్ని తప్పనిసరి చేయాలి. అనుమతి లేకుండా 10శాతం కంటే ఎక్కువ పెంచిన విద్యాసంస్థలపై లైసెన్సు రద్దు వరకు చర్యలు పాటించాలి. పేద విద్యార్థు లకు ఫీజు రీఫండ్ పథకం విస్తరించి, డిబిటి పద్ధతిలో ప్రత్యక్షంగా ఖాతాల్లోజమచేయాలి. పారదర్శకత కోసం మొబైల్‌యాప్ తల్లిదండ్రులు ఫీజుల వివరాలు, ఫిర్యాదులు ఒకే ప్లాట్‌ఫాంలో నమోదు చేసేలా రూపొందించాలి.

-సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

### రిటైర్డ్ ఉద్యోగులకు ఆరోగ్య భిక్ష పెట్టండి

పవిత్ర గోదావరి నదీ పరివాహక ప్రాంతంలో ఉద్భవించినది సింగరేణిబొగ్గుగనుల సిరులతల్లి గోదావరి. తెలంగాణకు సాగు, త్రాగు, పరిశ్రమలకు ఇతరత్రా ఉపయోగపడుతున్న విధంగా సింగరేణి కూడా అదేవిధంగా బృహత్తర విస్తృత స్థాయిలో నిధులు అందించి దాదాపు ప్రతి ఒక్క రంగానికి నిధులు సమకురుస్తూ రాష్ట్ర సర్వతో ముఖాభివృద్ధికి తోడ్పడుతున్నది. ప్రతి సంవత్సరం గణనీయమైన లాభాలుగడుస్తున్నది. కానీ బొగ్గును ఉత్పత్తి చేసి లాభాలు గడించుటకు సర్వశక్తులు ధార పోసిన రిటైర్డ్ ఉద్యోగుల పట్ల సింగరేణి తల్లి కనికరం చూపడం లేదు. వైద్యసౌకర్యాలు అందక ఆచేతన స్థితిలో బతుకుతున్నారు.

- దండంరాజు రాంచందర్ రావు, హైదరాబాద్

### నిరుపేదలకు పథకాల ఫలాలు అందాలి

ఐర్లాండ్ రాజ్యాంగం నుండి గ్రహించిన ఆదేశికములకు చాలా ప్రాశస్త్యంఉంది. బహుశా రాజ్యం తనపరిపాలన ఎలా కొనసాగించాలి అనేది అందులోఉంటుంది. కానీ రాజ్యం ఆవైపుగా ప్రయత్నం చేస్తుందా, ఆ దిశగా పోతోందా అన్నదే అసలు ప్రశ్న. నిరుపేదలకు ప్రభుత్వ ఫలాలు అందాలి అని ప్రభుత్వం పథకాలు నిర్దేశన చేస్తుంది. కానీ అమలులో ఆవైపుగా ప్రయాణం చేస్తున్నామ అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న.

-భారత అవినాష్, జనగామ

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# రైతుకు భరోసా కాగితాల్లోనేనా?

**రాష్ట్ర రెవెన్యూ శాఖలు, భూనమోదిత శాఖలు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో రైతుల ఖతా వివరాలు, సాగు స్థితి వంటి సమాచారం కేంద్రానికి అందేలా వ్యవస్థను రూపొందించాలి. అలాగే గ్రామీణ స్థాయిలో పథకం వివరాలపై అవగాహన కల్పించి, అర్హత కలిగిన ప్రతి రైతుకు లబ్ధి చేకూరేలా చూడాలి. ఇన్ని విషయాలపై కేంద్రం తక్షణ నిర్ణయం తీసుకుని పథకాన్ని సమర్థవంతంగా రూపురేఖలు మార్చాలి. మార్గదర్శకాల్లో మార్పులు చేయడం, పథకం లబ్ధిని పెంచడం ద్వారానే నిజమైన రైతు సంక్షేమం సాధ్యమవుతుంది. రైతు ఓటువేస్తాడు -కానీ అంత కంటే ముందు పంట వేస్తాడు. ఆపంట నిలదొక్కుకుంటేనే దేశ ఆహార భద్రత నిలబడుతుంది. అలాంటి రైతుకు తక్షణ భరోసా కల్పించడమే ప్రభుత్వం కర్తవ్యంగా తీసుకోవాలి. ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం గతంలో రైతుల కోసం అనేక సంకల్పాలు చేసింది. ఇప్పుడు ఆ సంకల్పాన్ని నిజంగా కార్యరూపంలోకి తేవాలంటే, పీఎం కిసాన్ పథకాన్ని నూతనంగా ఆవిష్కరించాలి. లక్షలాది మంది రైతులను నిబంధనల పేరుతో పక్కన పెట్టకుండా, వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని పెంచుతూ ముందుకు తీసుకెళ్లాలి.**

అప్పన్న గొనప

దేశంలోని రైతుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం 2019లో ప్రవేశపెట్టిన ప్రధాని కిసాన్ సమ్మాన్ నిధి (పీఎం కిసాన్) పథకం, ప్రారంభంలో ఎంతో ఆశాజనకంగా కనిపించింది. అర్హత కలిగిన రైతు కుటుంబానికి ఏటా రూ.6,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేసే విధంగా రూపొందిన ఈ పథకం, రైతులకు సీజనల్ ఖర్చులకు కొంత ఉపశమనం కలిగించేలా రూపొందించబడింది. పథకం తొలి నిబంధనల ప్రకారం, 2019 ఫిబ్రవరి 1 నాటికి ఎవరి పేరున భూమి ఉందో వారే ఈ పథకానికి అర్హులు. అయితే, తర్వాత భూమిని కొనుగోలు చేసినవారు, గిఫ్ట్ డీడ్, పార్టీషన్ లేదా వారసత్వంగా భూమి పొందిన రైతులు పథకానికి అనర్హులుగా ప్రకటించబడ్డారు. ఈ మార్గదర్శకాలు 2020 మార్చి 29న కేంద్రం జారీ చేసి, ఐదేళ్లపాటు అమల్లో ఉంటాయని ప్రకటించింది. ఇది వేలాది మంది చిన్న, సన్నకారు రైతులకు న్యాయం జరగకుండా అడ్డుపడుతోంది. ఈ 'కట్‌ఆఫ్' నిబంధన వాస్తవిక పరిస్థితులకు పూర్తిగా విరుద్ధం. రైతు జీవితంలో భూమి కొనడం, అమ్మడం, పంచుకోవడం సహజం. వాటిని ఆధారంగా తీసుకుని, నేడు సాగు చేస్తున్న రైతును మద్దతుకు అనర్హుడిగా ప్రకటించడం అన్యాయం. 2019 తర్వాత భూమిని సొంతం చేసుకున్న రైతు కూడా అదే విధంగా సాగు చేస్తుంటే, అతనిని ఎందుకు పథకం బయట ఉంచాలి? ఇకనైనా కేంద్ర ప్రభుత్వం ఈ విషయాన్ని పునః సమీక్షించి, మార్గదర్శకాలను రైతు ప్రయోజనాలకు అనుగుణంగా సవరించాలి. ప్రస్తుతం ఎవరి పేరు మీద భూమి ఉందో, ఎవరు నెరిసి సాగు చేస్తున్నారు అనే అంశాల ఆధారంగా అర్హతను నిర్ధారించాలి. ప్రస్తుతం కొనసాగుతున్న నిబంధనల వల్ల వేలాది మంది చిన్న రైతులు కేంద్రం ఇచ్చే సహాయాన్ని కోల్పోతున్నారు. ఇది కేవలం నిబంధనల సమస్య కాదు - రైతుల జీవితాల్లో నేరుగా ప్రభావం చూపే మానవీయ సమస్య. ఇక ఇదే తరుణంలో మరొక కీలక అంశం - ఈ పథకం ద్వారా ఇచ్చే ఆర్థిక సహాయం మొత్తాన్ని పెంచాల్సిన అవసరం. 2019లో పథకం ప్రారంభమైనప్పుడు, సంవత్సరానికి రూ.6,000 ఇవ్వడం రైతులకు కొంత ఉపశమనం కలిగించేది. కానీ ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. వ్యవసాయ ఉత్పత్తి వ్యయం రెండింతలైంది. ఎరువుల ధరలు పెరిగాయి, విత్తనాలు ఖరీదయ్యాయి, కూలీలకి మజ్దూరులు ఇవ్వాల్సిన ఖర్చుపెరిగింది.



వాతావరణ మార్పుల ప్రభావంతో పంటలకు నష్టాలు కూడా ఎక్కువయ్యాయి. ఇలాంటి సమయంలో ఒక రైతు కుటుంబానికి ఏడాదికి కేవలం రూ.6,000 ఇవ్వడం ద్వారా ఎలాంటి ఉపశమనం కలుగుతుంది? నెలకు 500 రూపాయలు మాత్రమే వస్తున్నాయంటే, అది సాగు అవసరాలే కాదు, నిత్యవసరాల కోసం కూడా సరిపోదు. కనీసం ఈ పథకం ద్వారా అందే మొత్తాన్ని రూ.10,000కి పెంచాలని కేంద్రం పునరాలోచించాలి. అంటే మూడు విడతల్లో రూ. 3,333 చొప్పున ఇవ్వడం ద్వారా రైతుకు కొంత మెరుగైన భద్రత కలిగించవచ్చు. ఈ మొత్తాన్ని పెంచడం వల్ల ప్రభుత్వంపై కొంత భారం పడవచ్చు. కానీ దీన్ని వ్యయంగా కాక, పెట్టుబడిగా చూడాలి. రైతు చేతిలో డబ్బు ఉంటేనే ఆయన ఖర్చులు చేస్తారు. ఖర్చులు చేస్తేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కదులుతుంది. అది కేవలం రైతులే కాదు, కూలీలకు, వ్యవసాయ ఉపకరణాల విక్రేతలకు, చిన్న వ్యాపారులకు లబ్ధి చేకూర్చుతుంది. అంటే ఈ చర్య దేశ ఆర్థిక వ్యవస్థకే లాభకరమైనదిగా మారుతుంది. ఇప్పటి పరిస్థితుల్లో రైతుల స్థితిగతులు గణనీయంగా మారాయి. పాత గణాంకాల ఆధారంగా తీసుకున్న నిర్ణయాలను ఇక కొనసాగించడంసరికాదు. భూమి యాజమాన్యం ఆధారంగా అర్హతను నిర్ణయించడమే కాదు -వారి ప్రస్తుత పరిస్థితిని పరిగణలోకి తీసుకుని, రైతు నిజంగా సాగుచేస్తున్నాడా, అసలైన లబ్ధిదారుడా అనే దానిని గుర్తించాలి. ఆధార్, భూమి నమోదు, బ్యాంక్ లింకింగ్ వంటి ఆధారాల ద్వారా ఈ ప్రక్రియను మరింత సులభంగా చేయొచ్చు. ఇక రాష్ట్ర ప్రభుత్వాల పాత్ర కూడా ఇందులో ముఖ్యమైనది. రాష్ట్ర రెవెన్యూశాఖలు, భూనమోదితశాఖలు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయంతో రైతుల ఖతా వివరాలు, సాగు స్థితి వంటి సమాచారం కేంద్రానికి అందేలా వ్యవస్థను రూ పొందించాలి. అలాగే గ్రామీణ స్థాయిలో పథకం వివరాలపై అవగాహన కల్పించి, అర్హతకలిగిన ప్రతి రైతుకు లబ్ధి చేకూ రేలా చూడాలి. ఇన్ని విషయాలపై కేంద్రం తక్షణ నిర్ణయం తీసుకుని పథకాన్ని సమర్థవంతంగా రూపురేఖలు మార్చాలి. మార్గదర్శకాల్లో మార్పులు చేయడం, పథకం లబ్ధినిపెంచడం ద్వారానే నిజమైన రైతు సంక్షేమం సాధ్యమవుతుంది. రైతు ఓటువేస్తాడు -కానీ అంత కంటే ముందు పంట వేస్తాడు. ఆపంట నిలదొక్కుకుంటేనే దేశ ఆహారభద్రతనిలబడుతుంది. అలాంటి రైతుకు తక్షణ భరోసా కల్పించడమే ప్రభుత్వం కర్తవ్యంగా తీసుకోవాలి. ప్రధాని మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం గతంలో రైతుల కోసం అనేక సంకల్పాలు చేసింది. ఇప్పుడు ఆ సంకల్పాన్ని నిజంగా కార్యరూపంలోకి తేవాలంటే, పీఎం కిసాన్ పథకాన్ని నూతనంగా ఆవిష్కరించాలి. లక్షలాది మంది రైతులను నిబంధనల పేరుతో పక్కన పెట్టకుండా, వారికి ఆర్థిక ప్రోత్సాహాన్ని పెంచుతూ ముందుకు తీసుకెళ్లాలి. ●

# 'మండలి'లో చేరికకు ఎన్ని మెట్లెక్కాలి?

కనుమ ఎల్లారెడ్డి

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ చేరిక ఊరిస్తోంది. భారత్ ప్రధాని మోడీ ఏ దేశ పర్యటనకు వెళ్ళినా భారత్‌కు భద్రతా మండలిలో శాశ్వత సభ్య స్థానం ఉండాల్సిందే అని ఆయా దేశాలు నొక్కి చెప్పడం గమనార్హం. మోడీ ఇటీవల బ్రిక్స్ సమావేశానికి వెళ్ళినప్పుడు ఐక్యరాజ్య సమితిలో భారత్‌కు శాశ్వత సభ్యస్థానం ప్రస్తావించారు. శాశ్వత స్థానం భారత్ పొందిన కొన్ని రాజకీయ కారణాల వల్ల కొన్ని దేశాలు అడ్డుపడుతున్నాయి అనేది నగ్న సత్యం. ముఖ్యంగా చైనా, పాక్ దేశాలకు భారత్ భద్రతా మండలిలో చేరడం సుతరాము ఇష్టం లేదు. పాక్, చైనా రాజకీయాల వలన భారత్ చేరిక ఉండటం లేదు. ఒక దశలో అమెరికా కూడా భారత్ చేరికపై అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. ఆసియా ఖండంలో భారత్ చేరితే చైనా 'ప్రభ' తగ్గుముఖం పట్టడం ఖాయం. ముందు పాక్ ఎట్టి పరిస్థితిలోను ఒప్పుకోదు. పాక్ భద్రత మండలిలో శాశ్వత సభ్య దేశం కాకున్నా భారత్ చేరికను చైనాతో లేక అమెరికాతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంది. భారత్‌ను ధైర్యంగా ఎదుర్కొనే సాహసం చేయక శిఖరాగ్ర సమావేశాలలో భారత్‌ను దోషిగా చూపెట్టి తను లాభపడాలని చూసి భంగపడినా తన వైఖరి మార్చుకోవడం లేదు. భారత్ ప్రధాని సందర్శించిన పలు దేశాలలో భద్రతా మండలిలో భారత్‌కు మా మద్దతు ఉంటుంది అని చెప్పినా ప్రయోజనం శూన్యం. రష్యా, ఫ్రాన్స్ దేశాలు భారత్‌కు మద్దతు తెలిపినా చైనా వీటో చేస్తుంది. అమెరికా బ్రిటన్ దేశాలు చైనా ఆ పని చేస్తుందని తెలిసి మోనంగా ఉంటాయి. రాజకీయం అంటే అదే. విశ్వంలో భారత్‌కు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో పాక్, చైనా తప్పితే దాదాపు ప్రతి దేశం భద్రతా మండలిలో స్థానం ఉండాల్సిందే అని చెప్పినా ఆ దిశలో చర్యలు లేవు. ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో అమెరికా పెత్తనం ఉంది. ఎందుకంటే సమితికి భారీ నిధులు ఒక్క అమెరికా నుంచే అందుతున్నాయి. ఆరవ శాశ్వత సభ్య దేశం చేరాలంటే ముందు ఆయా దేశాల కున్న 'వీటో' పవర్ రద్దు చేయాలి. 'వీటో' పవర్ ఎట్టి పరిస్థితులలోనూ రద్దు కాదు. ఎన్నో సంస్కరణలతో అమెరికాను నడిపిస్తున్న డోనాల్డ్ ట్రంప్ భద్రతా మండలిలో ఆరవ దేశంగా భారత్‌ను చేర్చుకోవాలి. ఏ తీర్మానంచేయకనే



అమెరికా, భారత్‌ను ఆహ్వానించాలి. భారత్‌తో పాటు జర్మనీ, దక్షిణ ఆఫ్రికా, బ్రెజిల్ మొదలగు దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. ఒకవేళ భారత్ చేరకుండా మిగతా దేశాలు చేరితే మాత్రం భద్రతా మండలికి అంత హంగు ఉండదు. భారత్ చేరితేనే సమితికి కళ. భారత్ అతి త్వరలో భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరాలి. యుద్ధాలకు ఒక దేశానికి ఒకదేశం మద్దతు ఎలా ఇస్తున్నాయో అలాగే భారత్ సభ్యదేశంగా చేరడానికి కూడా అన్ని దేశాలు మద్దతు ఇవ్వాలి. ప్రస్తుత కాలంలో జరుగుతున్న వివిధ దేశాల యుద్ధాలు ప్రతి దేశంపై ప్రభావం చూపుతున్నాయి. రష్యా, ఉక్రెన్ యుద్ధం రోజు రోజుకు ఉధృతం అవుతోంది. ఈ యుద్ధం ఇలాగే దీర్ఘకాలం కొనసాగినా ఆశ్చర్యపోనవసరం లేదు. శాంతికి కృషి చేయాలనే ఆలోచన ఏ దేశానికి లేదు. మొన్నటికి మొన్న రష్యా దాదాపు 400పైనే డ్రోన్‌ల దాడి చేసింది. ఇది రష్యా చరిత్రలోనే అతి పెద్దదాడి. ఇంతకు మునుపు ఎప్పుడు రష్యా అలా చేసింది లేదు. ఉక్రెయిన్ కూడా కొన్నింటిని కూల్చేశామని చెబుతోంది. జరిగిన నష్టం రెండు దేశాలకు అపారం. నిజానికి అక్కడి పౌరులు బిక్కుబిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. శాంతికి అడుగు పడకపోవడం శోచనీయం. ఇదిఇలా ఉంటే యుద్ధాన్ని మరో కోణంలోకి రష్యా తీసుకుపోవడం భయభ్రాంతులను చేస్తోంది. అదేమిటంటే తాజాగా రష్యాకు ఉత్తర కొరియా పూర్తిగా మద్దతు ఇస్తోంది. రష్యాకు సహకారాన్ని ఇస్తోంది. ఉక్రెన్ చెప్పినట్లు రష్యా, ఉత్తర కొరియా సైన్యాన్ని వినియోగిస్తోం దని భోగట్టా. ఉత్తర కొరియా సేనలు రష్యాకు అండగా నిలబడటం చూస్తే యుద్ధం ఇప్పట్లో ముగిసేలా లేదు. 30వేల మంది ఉత్తర కొరియా సేనలు రష్యా సైన్యంలో చేరితే మాత్రం ఉక్రెయిన్ కొత్త చిక్కులను ఎదుర్కోవాల్సి వస్తుంది. శాంతిని కాంక్షించాలని టర్కీ ప్రయత్నం విఫలమైంది. ఇప్పుడు ఏ దేశం కూడా రష్యా, ఉక్రెన్ యుద్ధం ఆపటానికి ముందుకు రావడంలేదు. కారణంరెండు దేశాల నేతలకు శాంతి అనే మాటగిట్టడం లేదేమో అనిపిస్తోంది. లేకపోతే యుద్ధం పురిట్లోనే ఆగిపోయి ఉండేది. యుద్ధాన్ని ఆపుతానన్న ట్రంప్ కూడా ఏమిచేయలేని స్థితి. రష్యాకు, ట్రంప్ గట్టిగా చెప్పలేదు. కారణంరష్యా, అమెరికా దేశాలు భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశాలు. చెప్పినా రష్యా ఏమేరకు వింటుందో లేదో అనే అనుమానం. ఉక్రెయిన్‌కు మాత్రం అమెరికా తగిన సహాయం చేస్తోంది. అది కొన్ని షరతులకు లోబడి. యుద్ధం ఆగిపోవాలంటే ఉక్రెయిన్‌ను ట్రంప్ గట్టిగా హెచ్చరిస్తే ఆగిపోతుంది. మరి ఎందుకు ట్రంప్ ఉక్రెయిన్ ను వారించలేదో అర్థం కాలేదు. రష్యా మాత్రం తన పని తాను చేస్తోంది. భీకర దాడులతో ఉక్రెయిను బెంబేలు ఎత్తి స్తోంది. ఇలా ఈ రెండు దేశాల పోరులో నలిగి పోయేది మాత్రం ప్రజలే. ●

# రహదారి భద్రతా విభాగాలు గణాంకాల సేకరణకే పరిమితం!



మేకిరి దామోదర్

మన దేశంలోని రాష్ట్రాల్లో రోడ్డు రవాణా మార్గాలైన జాతీయ, రాష్ట్ర, జిల్లా రహదారులన్నీ చాలా వరకు అభివృద్ధి చెందాయి. ప్రజలను, వస్తువులను గమ్యస్థానాలకు (ప్రయాణాలు)చేరవేయడంలో వేగం, కాలం, దూరాలు తగ్గినాయి. ఇలా సౌకర్యాలు పెరగడంతో వీటిపై ప్రయాణించే అన్నిరకాల వాహనాలు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ (నియంత్రణ) సూచనలు పాటించకపోవడంతో మద్యపానం తాగడం, మితిమీరిన వేగం వల్ల ఆక్సిడెంట్ల రోడ్డు ప్రమాదాలు నానాటికీ పెరుగుతున్నాయి. ఇలా గత ఏడాది రోజుకు సరాసరిన 71 రోడ్డు ప్రమాదాలు, 19 మరణాలు జరిగినాయి. రాష్ట్ర రవాణా శాఖలెక్కల ప్రకారమే 2015 నుంచి 2024 వరకు చనిపోయిన వారి సంఖ్య 71,052. రోడ్డు ఎక్కితే క్షేమంగా ఇంటికి తిరిగి వస్తామో, రామో తెలియని పరిస్థితికి ఈ గణాంకాలే నిదర్శనం. నానాటికీ సమస్య తీవ్రమౌతుంది తప్ప చక్కదిద్దే చొరవ కనిపించడం లేదు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలు నివారణకు ప్రత్యేకంగా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన దశాబ్దకాలంగా సహకారం కాకపోవడం అందుకు దర్పణం పడుతుంది. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన తక్షణ చర్యలపై ఆరునెలలకోసారి సంబంధిత శాఖలతో సమన్వయ సమావేశం నిర్వహించాల్సి ఉన్నా, కొన్నేళ్లుగా నిర్వహించడం లేదు. గత ఏడాది (2023 డిసెంబర్ నుంచి 2024 డిసెంబర్ వరకు) రాష్ట్రంలో 25,934 రోడ్డు ప్రమాదాలు జరగగా, 7,281 మంది మరణించారు. జాతీయ ఉపరితల రవాణా శాఖ గణాంకాల ప్రకారం జాతీయ రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో తెలంగాణ 8వ స్థానంలో, మరణాల్లో 9వ,స్థానంలో ఉంది. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల తీవ్రత ఏస్థాయిలో ఉందో తెలిపే గణాంకాలివి. 2002లో ప్రత్యేకంగా రహదారి భద్రత విభాగాన్ని ఏర్పాటు చేసింది. సాధారణ పరిపాలన శాఖ (జీఏడి)ఆధ్వర్యంలో ఏర్పాటైన ఈ విభాగం అప్పటి నుంచి ఉత్సవ విగ్రహంగానే మిగిలింది. తర్వాత కాలంలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో మరో ప్రత్యేక రహదారి భద్రత విభాగం ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఎప్పటికప్పుడు రోడ్డు ప్రమాదాలు, మరణాలు, క్షతగాత్రులు ఎందరో లెక్కల సేకరిస్తుంటారు తప్ప, నియంత్రణకు అవసరమైన చర్యలు అందుకు అవసరమైన వసతులు మాత్రం సమకూర్చడం లేదు. రాష్ట్ర పరిధిలో రోడ్డు ప్రమాదాలు గణనీయంగా తగ్గించే లక్ష్యంతో అన్ని జాతీయ, రాష్ట్ర రహదారుల వెంట ప్రతి 50 కిలోమీటర్ల ఒక పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ప్రతిపాదించారు. ప్రతి ఠానాకు ఓ వాహనం, ఒక ఎస్సై, నలుగురు హెడ్ కానిస్టేబుళ్లు, 12 మంది కానిస్టేబుళ్లు, 8 మంది హోంగార్డులు ఉండాలని ప్రతిపాదించారు. సిబ్బందికి బ్రీత్ ఎనలైజర్లు, వేగాన్ని యంత్రించే స్పీడ్‌గన్లు అందించి, హైవేలపై నిరంతరం తనిఖీలు నిర్వహించడం ద్వారాప్రమాదాలను నియంత్రించాలని నిర్ణయానికి వచ్చారు. ఎక్కడైనా



ప్రమాదం జరిగినప్పుడు గంటలోపే (గోల్డెన్ అవర్) అక్కడికి చేరుకొని చికిత్స అందించడం ద్వారా బాధితుల ప్రాణాలు కాపాడేందుకు ప్రణాళిక రూపొందించారు. ఖర్చులను అంచనా వేశారు. ఈ ప్రతిపాదన ఇప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ప్రతి ఆరు నెలలకోసారి పోలీసు, రవాణా, రోడ్డు భవనాలు, ఆరోగ్యశాఖలతో ఉన్నతస్థాయి సమీక్షనిర్వహించి, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై చర్చించాలి. మూడేళ్లుగా ఈ సమావేశం కూడా నిర్వహించకపోవడం గమనార్హం. రాష్ట్రంలో ప్రమాదాలు, మరణాలు పెరగడానికి ఈ నిర్లిప్తత ప్రధాన కారణమని విమర్శలున్నాయి. దీనికి తోడు జీవితకాల ముగిసినా వాహనాలు రోడ్లపై (ఫిట్నెస్ లేనివి)పరుగులు పెడుతున్నాయి. మన రాష్ట్రంలో కాలం చెల్లిన వాహనాల సంఖ్య భారీగా పెరుగుతోంది. రిజిస్ట్రేషన్ జరిగిన ఏడాది బట్టి చూస్తే మొత్తం 42.78 లక్షల వాహనాలకు జీవితకాలం ముగిసినా రోడ్లపై నడిపిస్తూ ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారు. వీటిలో మూడో వంతు బైకులు కాగా, మిగతావి కార్లు, బస్సులు, సరకు రవాణా వాహనాలు ఉన్నాయి. డ్రైవింగ్ చేసేవారు ఎంత జాగ్రత్తగా ఉన్నా, బండికి ఫిట్నెస్ లేకపోతే ప్రమాదాలకు ఆస్కారం అధికం. అంతేకాదు వీటితో కాలుష్యమూ ఎక్కువే, కండిషన్ లేని సరుకు రవాణా వాహనాల్ని డ్రైవర్ అతివేగంగా నడిపే క్రమంలో అధిక ప్రమాదాలు జరుగుచున్నాయి. మరణాలు సంభవిస్తున్నాయి. నిబంధనలు, తనిఖీల్లో ఉదాసీనత. రాష్ట్రంలో కాలం చెల్లిన వ్యక్తిగత వాహనాలు 38,97,695 ఉన్నాయి. రిజిస్ట్రేషన్ తేదీ నుంచి 15 ఏళ్లు దాటిన వాటికాలం చెల్లినవిగా పరిగణిస్తారు. బండి ఫిట్నెస్ పరీక్షల్లో పాసై గ్రీన్ టాక్స్ కడితే మరో ఐదేళ్లు నడిపేందుకు అనుమతిస్తారు. రవాణా వాహనాలు 4,16,961 ఉండగా ఇవి ఎనిమిదేళ్లే ఫిట్‌గా ఉంటాయి. అందుకే ప్రైవేట్ యాజమాన్యాలు బస్సుల అద్దె ఒప్పందాన్ని ఆర్టీసీ ఎనిమిదేళ్లకే పరిమితం చేస్తోంది. ఎనిమిదేళ్లు నిండిన రవాణా వాహనాల్లో అనుమతి తీసుకుని పన్ను కట్టినవి 36,054 మాత్రమే ఉన్నాయి. 42,78,602 కాలం చెల్లిన వాహనాలు ఇలాంటి అనుమతులు లేకుండా రోడ్లపై తిరుగుతున్నా రవాణా శాఖ ఎలాంటి తనిఖీలు చర్యలు చేపడుతున్న దాఖలాలు కనిపించట్లేదు. రహదారి భద్రతను మెరుగుపరచడం, కాలుష్య నియంత్రణకు వాహనాల్ని స్క్రాప్ చేయడానికి ప్రభుత్వ పాలసీ తెచ్చినా ఇంకా ఫలితాలు రావట్లేదు. బడులు, కళాశాలలు ప్రారంభమైన కొన్నాళ్ళు రవాణా శాఖ అధికారులు హడావుడి చేసి ఆ తర్వాత తనిఖీలు ఆపేస్తారు. దేశంలో రహదారి ప్రమాదాలు అధికంగా జరిగే టాప్10 రాష్ట్రాలలో తెలంగాణ ఉంది. ఏది ఏమైనా రోడ్లపై ఫిట్నెస్ లేని వాహనాలు రహదారుల వెంట పరుగులు తీయడంతో ప్రమాదాలు పెరుగుతున్నాయి. ఆధునిక రవాణా వసతులతో ట్రాఫిక్ పెరిగి కంట్రోల్ తప్పుతుంది. వాహనదారు (డ్రైవరు)లు ప్రయాణికులుట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు భద్రత నియమాలు తూ.చ తప్పక పాటిస్తేనే ప్రయాణాలు క్షేమంగా గమ్యానికి చేరుతాయి. రెప్పపాటు నిర్లక్ష్యం వల్ల ఘోర యాక్సిడెంట్లతో ప్రమాదాలు, ప్రాణ నష్టాలకు దారితీస్తున్నాయి. జాతీయ, రాష్ట్ర, జిల్లా అన్నిరకాల రోడ్ల నాణ్యత ప్రమాణాలు ఎప్పటికప్పుడు గుర్తించాలి. దెబ్బతిన్నచోట రోడ్డు నిర్మాణాలు చేపడితే, యాక్సిడెంట్లు తగ్గుతాయి. అలాగే వివిధ రకాల రహదారుల వెంట బ్రాండ్ షాపులు తొలగించాలని కోర్టు హెచ్చరికలను ప్రభుత్వాలు అమలు చేయాలి. వాహనదారులు, ప్రయాణికులు రోడ్డు పన్ను చెల్లిస్తున్నందున నాణ్యమైన ప్రయాణాలకు బాధ్యతతో కూడిన హామీ అమలు ప్రభుత్వాలపైనే ఉంది. ఏది ఏమైనా వాహన యజమానులు, డ్రైవర్లు, ప్రయాణదారులు, ప్రభుత్వాలు ఉమ్మడి బాధ్యతతో రోడ్డు ప్రమాదాలు తగ్గించుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. ●

# ఉత్తరాదిని ముంచేస్తున్న భారీ వర్షాలు





## యుపి, గుజరాత్, బెంగాల్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, కాశ్మీర్‌లో స్తంభించిన జనజీవనం

## విరిగిపడుతున్న కొండచరియలు, జననష్టం

## ఉత్తరప్రదేశ్‌లో నీటమునిగిన ప్రయాగ్‌రాజ్, వారణాసి ఘాట్‌లు

**అమ్మదాబాద్, జూలై 8:** దేశవ్యాప్తంగా రుతు పవనాల కారణంగా ఉత్తరాది రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. ముఖ్యంగా ఉత్తర్‌ప్రదేశ్, బంగాల్, గుజరాత్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, జమ్ముకశ్మీర్ రాష్ట్రాల్లో ఎడతెరపిలేని వర్షాలు కారణంగా జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. రోడ్లన్నీ నదులుగా మారాయి. కొన్ని చోట్ల కొండచరియలు విరిగిపడుతున్నాయి. అంతే కాకుండా గంగా నదీ నీటిమట్టం క్రమంగా పెరగడం వల్ల పరివాహక ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇదిలా ఉండగా మరో నాలుగు రోజులు పాటు విస్తారమైన వానలు ఉండే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, వారణాసిలోని ఘాట్‌లు నీట మునిగిపోయాయి. వందలాది మంది భక్తులను ఆకర్షించే గంగాహారతి నిర్వహణ వేదిక వరకు నీరు చేరుకుంది. ఫలితంగా గంగా హారతి స్థలిని మారుస్తారనే ప్రచారంతో స్థానికుల్లో ఆందోళన నెలకొంది. ఇంకో రెండు అడుగుల మేర నీటి మట్టం పెరిగితే గంగా హారతి ఇచ్చే ప్రాంతం పూర్తిగా కనుమరుగు అవుతుందని స్థానికులు చెప్పారు. అయోధ్యలో కూడా సరయూనది నీటిమట్టం క్రమంగా పెరుగుతోంది. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండటంతో నీటిమట్టం ప్రమాదకర స్థాయిని దాటింది. గంగా, సరయూ నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. భక్తులు పుణ్య స్నానాలు ఆచరించే ఘాట్‌ల వద్ద అదనపు బృందాలతో పాటు రెస్క్యూ సిబ్బందిని మోహరించారు. స్నానం ఆచరించేందుకు భక్తులు నది లోపలికి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. తాము సూచించిన నిర్దిష్ట ప్రాంతాల్లో మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని భక్తులకు సూచించారు. బోటులో ఎనిమిది మంది మించి ప్రయాణం చేయవద్దని హెచ్చరించారు. రుతు పవనాల కారణంగా రాజస్థాన్‌లో జులై 10వ తేదీ నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిస్తాయని,12వ తేదీ నుంచి మరింత పెరిగే అవకాశం ఉందని సూచించింది. అసోం, మధ్య ప్రదేశ్, మహారాష్ట్రాల్లో ప్రవహిస్తున్న నదులు ప్రమాదకర స్థాయి మించి ప్రవహిస్తున్నాయి. దీంతో ఆయా రాష్ట్రాలో వరదలు ముంచేత్తున్నాయి. జమ్ముకశ్మీర్‌లో కూడా భారీ వర్షాలు కురుస్తున్నాయి. మరోవైపు ఉత్తరాఖండ్‌లోని పలు జిల్లాలో భారీవర్షాలు కురుస్తున్నాయి. నదులు, వాగులు పొంగిపోతున్నాయి. కొన్ని ప్రాంతాల్లో కొండచరియలువిరిగిపడ్డాయి. రోడ్లు, ఇళ్లు నీట మునిగాయి. ఇదిలా ఉండగా ఉత్తరకాశి జిల్లాలో 3.2 తీవ్రతో మంగళవారం మధ్యాహ్నం భూకంపం సంభవించింది. దీంతో ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు పరుగులు తీశారు. గుజరాత్‌లో ఇప్పటివరకు 413.52 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 46 శాతం ఎక్కువఅని అధికారులు పేర్కొంటున్నారు. అధిక వర్షపాతం కారణంగా గుజరాత్‌లోని డ్యామ్‌ల్లో నీటమట్టం పెరిగిపోయింది. జూన్ 11వ తేదీ వరకు మత్స్యకారులను సముద్రంలోకి పోవద్దని వాతావర్ణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది.

మంగళవారం తెల్లవారుజాము నుంచే కోల్‌కతా సహా బెంగాల్‌లోని పలు రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. రోడ్లు, ఇళ్లు నీట మునిగాయి. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ క్రమంలోనే దక్షిణ బెంగాల్‌లోని ఐదు జిల్లాలకు వాతావరణ శాఖ అరెంజ్ అలర్ట్ జారీ చేసింది. మోస్తరు నుంచి ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఇళ్లలో నుంచి ఎవరూ బయటకు రావొద్దని సూచించింది.




# ఎయిరిండియా ప్రమాదంపై ప్రాథమిక నివేదిక సమర్పణ

## విమానయానశాఖకు అందించిన దర్యాప్తు బ్యూరో

**న్యూఢిల్లీ,జూలై 8:** దేశవ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని నింపిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై దర్యాప్తులో కీలక ముందడుగు పడింది. ఈ ఘోర దుర్ఘటనకు సంబంధించిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు సమర్పించింది. గుజరాత్ మాజీ సిఎం విజయ్ రూపానీ సహా 241 మందిని బలిగొన్న ఈ ప్రమాదంపై దర్యాప్తు బృందం తన ప్రాథమిక అంచనాలను ఈ నివేదికలో పొందుపరిచింది. గత నెల జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విమానాశ్రయం నుంచి లండన్‌కు బయలుదేరిన ఈ విమానం, టేకాఫ్ అయిన కేవలం 32 సెకన్లకే కుప్పకూలింది. ఈ దుర్ఘటనలో విమానంలోని ఇద్దరు పైలట్లు, 10 మంది సిబ్బంది, ప్రయాణికులు సహా 241 మంది సజీవ దహనమయ్యారు. అదృష్టవశాత్తు సీటు నంబర్ 11ఏలో కూర్చున్న ఒక్క ప్రయాణికుడు మాత్రమే ప్రాణాలతో బయట పడ్డాడు. ప్రమాదానికిగల కారణాలను ఛేదించేందుకు అధికారులు ముమ్మర దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ప్రమాద స్థలంలో లభ్యమైన కాక్‌పిట్ వాయిస్ రికార్డర్ (సీవీఆర్), ఫ్లైట్ డేటా రికార్డర్ (ఎఫ్‌డీఆర్)లను విశ్లేషిస్తున్నారు. ముఖ్యంగా విమానం టేకాఫ్ అయ్యే కీలక సమయంలో పైలట్లు ప్రమాదవశాత్తు ఫ్యూయల్ స్విచ్‌లను ఆఫ్ చేశారా? అనే కోణంలో దర్యాప్తు బృందాలు దృష్టి సారించాయి.

బ్లాక్ బాక్స్‌ల డేటాను, విమాన శకలాల్లో లభించిన ఫ్యూయల్ స్విచ్‌ల భాగాలను పోల్చి చూస్తున్నారు. అదే సమయంలో రెండు ఇంజిన్లు ఒకేసారి ఫెయిల్ అయ్యాయా? అనే కోణంలో కూడా విచారణ జరుగుతోంది. విమానం 400 అడుగుల కంటే తక్కువ ఎత్తులో ఉన్నప్పుడు రెండు ఇంజిన్లు ఆగిపోతే ఎలా స్పందించాలనే దానిపై పైలట్లకు శిక్షణ ఉండదని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దర్యాప్తు అధికారులు సమర్పించిన నివేదిక కీలకంగా మారింది. ఈ వారంలోనే ఈ నివేదికను ప్రజలకు విడుదల చేయనున్నట్లు, దాని ద్వారా ప్రమాద కారణాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ ఉన్నతాధికారులు తెలిపారు.

## పెళ్లిరోజు గిఫ్ట్‌గా మొబైల్ ఇస్తే
# పోలీసులు వచ్చి తలుపుతట్టారు!




**కోల్‌కత్తా, జూలై 8:** పెళ్లిరోజు కానుకగా తన భార్యకు ఒక గిఫ్ట్ ఇవ్వాలనుకున్న ఒక న్యాయవాది ఓ మొబైల్ షాపులో రూ.49 వేల విలువ చేసే మొబైల్ ఫోన్ కొన్నాడు. ఇంటికి తీసుకెళ్లి భార్య చేతిలో పెట్టాడు. ఆమె సంతోషంతో పొంగిపోయింది. ప్రేమతో భర్త తెచ్చిన మొబైల్‌ను ఆన్ చేసింది. అంతే కొన్ని నిమిషాల్లో పోలీసులు వచ్చి ఆ ఇంటి తలుపుతట్టారు. దాంతో ఆ దంపతులు షాకయ్యారు. పెళ్లిరోజు రాత్రి వారికి పీడకలగా మిగిలిపోయింది. కోల్‌కతాకు చెందిన ఓ న్యాయవాది పెళ్లిరోజు కానుకగా తన భార్యకు ఖరీదైన మొబైల్ ఫోన్ కొనిచ్చాడు. రూ.49 వేలు పెట్టి భర్త కొనిచ్చిన ఆ ఫోన్‌ను భార్య ఆన్ చేయగానే పోలీసులు రంగ ప్రవేశం చేశారు. గుజరాత్ రాష్ట్రం రాజ్‌కోట్‌కు చెందిన పోలీసులు ఆ ఇంటి తలుపుతట్టారు. తలుపు తీసిన దంపతులు పోలీసులను చూసి షాకయ్యారు. ఆ ఫోన్‌తో సైబర్ నేరాలకు పాల్పడ్డారని పోలీసులు గద్దించడంతో భయంతో వణికిపోయారు.

తాము ఇవాళే మొబైల్ షాపు నుంచి ఈ మొబైల్ కొనుగోలు చేశామని, తాము ఏ నేరం చేయలేదని చెప్పారు. రాజ్‌కోట్ పోలీసుల సూచన మేరకు ఆ దంపతులు రాత్రికిరాత్రే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు మొబైల్ షాపుపై రైడ్ చేశారు. ఆ షాపులో డాక్యుమెంట్స్ అన్నీ సక్రమంగానే ఉండటంతో మొబైల్స్ డిస్ట్రిబ్యూటర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా పెళ్లిరోజు నాడు సంతోషంగా గడుపుదా మనుకున్న ఆ లాయర్ దంపతులకు మొబైల్ గిఫ్ట్ ఓ పీడకలను మిగిల్చింది. రాత్రంతా వారు పోలీస్‌స్టేషన్‌ల చుట్టూ తిరగాల్సి వచ్చింది. ఏ నేరం చేయకపోయినా తమ జీవితంలో ఓ ముఖ్యమైన రాత్రిన వారు అవస్థలు పడాల్సి వచ్చింది.

# స్కూల్ బస్సును ఢీకొన్న రైలు

## ముగ్గురు మృతి, మరో ఆరుగురికి తీవ్ర గాయాలు



**కడలూరు(తమిళనాడు),జూలై 8:** తమిళనాడులోని కడలూరులో పట్టాలు దాటుతున్న స్కూల్ వ్యాన్‌ను ఓ ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు విద్యార్థులు మృతిచెందగా, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. అయితే దీనిపై స్కూల్ వ్యాన్ వెళ్లడానికి మూసిన గేటు తెరవడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా తేలింది. దీంతో ఆ గేట్‌కీపర్‌ను విధులు నుంచి తొలగించినట్లు రైల్వే శాఖ తెలిపింది. రైలు వచ్చినప్పుడు రైల్వే గేటు తెరిచే ఉందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరోవైపు తమిళనాడు సిఎం స్పందిస్తూ ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. మంగళవారం ఉదయం 7:45 గంటల ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగింది. రైల్వే ట్రాక్‌ను దాటుతున్న స్కూల్ వ్యాన్‌ను వేగంగా వస్తున్న 56813 ప్యాసింజర్ రైలు ఢీకొట్టింది. దీంతో వ్యాను చాలా దూరంలోకి ఎగిరిపడింది. ప్రమాదం ధాటికి స్కూల్ వ్యాన్ నుజ్జునుజ్జు అయ్యింది. ఈ వ్యానులోని ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందగా, మరికొంతమంది గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటమే ఘటనాస్థలికి వెళ్లి క్షతగ్రాతులను ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన విద్యార్థులు ఓ ప్రైవేటు పాఠశాలలో చదువుతున్నారు. ఆరో తరగతి చదువుతున్న నిమిలేష్ (12), 11వ తరగతి చదువుతున్న సరుమతి (16), చెజియన్ (15)గా గుర్తించారు. ఈ ప్రమాదంలో విశ్వేష్ (16), వ్యాన్‌డ్రైవర్ శంకర్ (47) తీవ్రంగా గాయపడి కడలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

అయితే ఈ ప్రమాదం గేటు కీపర్ నిర్లక్ష్యం వల్లే జరిగిందని ప్రాథమిక విచారణలో తేలిం దని రైల్వే శాఖ తెలిపింది. గేటు కీపర్ భద్రతా నియమాలను ఉల్లంఘించి నందుకు తక్షణమే విధుల నుంచి సస్పెండ్ చేసినట్లు రైల్వే శాఖ పేర్కొంది. ఈ ప్రమాదంపై దక్షిణ మధ్య రైల్వే శాఖ విచారం వ్యక్తం చేసింది. గాయపడిన వారికి అవసరమైతే మెరుగైన వైద్య చికిత్స కోసం పుదుచ్చేరికి తరలిస్తామని తెలిపింది. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షలు, తీవ్రంగా గాయపడిన వారికి రూ.2.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.50 వేలు చొప్పున పరిహారం అందిస్తామని ప్రకటించింది. మరోవైపు తమిళనాడు సిఎం స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతులు కుటుంబాలకు సానుభూతిని తెలియజేశారు. క్షతగ్రాతులకు నాణ్యమైన చికిత్సను అందించాలని అధికారులను ఆదేశించారు.

# రాముడు, శివుడు మావాళ్లే!


## వాళ్లిద్దరూ నేపాల్‌లోనే పుట్టారు: ప్రధాని కెపిశర్మ ఓలి



**ఖాట్మండు,జూలై 8:** నేపాల్ ప్రధానమంత్రి కెపి శర్మ ఓలీ మరోసారి శ్రీరాముడి జన్మస్థలంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. శ్రీరామచంద్రుడు భారతదేశంలోని అయోధ్యలో కాకుండా, తమ దేశమైన నేపాల్‌లోనే జన్మించారని ఆయన పునరుద్ఘాటించారు. ఖాట్మండులో జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఈ వాదనను వినిపించారు. తాను సొంతంగా ఈ మాటలు చెప్పడం లేదని, వాల్మీకి రాసిన అసలైన రామాయణం ఆధారంగానే ఈ విషయం చెబుతున్నానని కెపి ఓలీ స్పష్టం చేశారు. రాముడు పుట్టిన నిజమైన ప్రదేశం నేపాల్‌లోనే ఉందని, ఈ నిజాన్ని ప్రచారం చేయడానికి ప్రజలు ఏ మాత్రం వెనుకాడొద్దని ఆయన పిలుపునిచ్చారు. గతంలో 2020లో కూడా ఓలీ ఇదే తరహా వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమ దేశంలోని చిత్వాన్ జిల్లా థోరి ప్రాంతమే అసలైన అయోధ్య అని, అక్కడే రాముడు జన్మించారని అప్పట్లో పేర్కొన్నారు. కేవలం రాముడే కాకుండా, శివుడు, విశ్వామిత్రుడు కూడా తమ దేశంలోనే జన్మించారని ఓలీ తాజాగా తెలిపారు. ఇతిహాసాల్లో పేర్కొన్న పలు ప్రదేశాలు ప్రస్తుతం నేపాల్‌లోని సున్‌సారి జిల్లాలో ఉన్నాయని ఆయన అన్నారు. ఈక్రమంలో నేపాల్ విదేశాంగశాఖ ప్రకటన విడుదలచేస్తూ ఎవరి మనోభావాలు దెబ్బతీసేందుకు ప్రధాని ఈ వ్యాఖ్యలుచేయలేదని, రాముడి జన్మస్థలంపై అనేక అభిప్రాయాలున్నాయని, రామాయణంపై విస్తృతమైన సాంస్కృతిక, భౌగోళిక అధ్యయనం జరపాల్సిన అవసరం ఉందని మాత్రమే చెప్పారని స్పష్టంచేసింది.

# ప్రైవేటు విడియోతో బెదిరించి రూ.3 కోట్లు దోపిడి..

## సూసైడ్‌నోట్‌రాసి సిఎ ఆత్మహత్య



**ముంబై, జులై 8:** ఒక యువ చార్టర్డ్ అకౌంటెంట్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత కొన్ని నెలలుగా వస్తున్న వేధింపులు భరించలేక చివరికి బలవన్మరణానికి ఒడిగట్టాడు. ఇంకా రూ.మూడుకోట్లకు పైగా చెల్లించమని బ్లాక్ మెయిల్ చేస్తూ వేధిస్తుండటంతో చివరికి విషం తాగి ఇవాళ తనువు చాలించాడు. చనిపోతూ మూడు పేజీల సూసైడ్‌నోట్ రాసిన బాధితుడు తన ఆత్మహత్యకు ఆ ఇద్దరే కారణమని తన లేఖలో పేర్కొన్నాడు. ఒక పేజీలో తన తల్లికి, మరొక పేజీలో తన సహోద్యోగులకు తాను ఆత్మహత్య చేసుకోడానికి దారి తీసిన కారణాలను వివరించాడు. ముంబైలో చార్టర్డ్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్న రాజ్ లీలా మోర్ అనే 32 ఏళ్ల యువకుడి ప్రైవేట్ వీడియోను లీక్ చేస్తామని కొన్ని నెలలుగా రాహుల్ పర్వానీ, సబా ఖురేషి అనే మహిళ ఇద్దరు బెదిరింపులకు గురిచేస్తున్నారని తన సూసైడ్‌నోట్‌లో రాజ్ పేర్కొన్నాడు. గత 18 నెలల్లో వీరిద్దరు తననుండి కోట్లాది డబ్బును దోచుకున్నారని నోట్‌లో రాశాడు. స్టాక్ మార్కెట్‌లో రాజ్ మోర్ భారీ పెట్టుబడులు పెట్టడం, చార్టర్డ్ అకౌంటెంట్‌గా అతని అధిక జీతం ఉన్న ఉద్యోగం గురించి నిందితులకు తెలుసని పోలీసులు అంటున్నారు. ఈ క్రమంలో మోర్‌ను అతని కంపెనీ ఖాతా నుండి భారీ మొత్తంలో డబ్బును వారి వ్యక్తిగత ఖాతాలకు బదిలీ చేయమని నిందితులు బలవంతం చేశారని చెప్పారు. ఇక, రాజ్ ఆత్మహత్యకు పాల్పడ్డ గది నుండి అధికారులు మూడు పేజీల సూసైడ్ నోట్‌ను స్వాధీనం చేసుకున్నారు. అందులో ఒకటి అతని తల్లికి రాశాడు. రెండవ పేజీలో, రాజ్ తన సహోద్యోగులకు రాశాడు. దీపా లఖానీ ఈరోజు నాకు క్షమాపణ చెప్పడానికి మాటలు లేవు, ఎందుకంటే నేను మీ నమ్మకాన్ని వమ్ము చేసాను. కానీ నన్నునమ్మండి, ఇది చివరిసారి. మీ నమ్మకాన్ని వమ్ము చేయాలనే ఉద్దేశ్యం నాకు లేదు. నేను ఏమోసం చేసినా, నేనే చేసాను; ఎవరికీ ఏమీతెలియదు. నేను స్టేట్‌మెంట్ (ఖాతాను)ను మార్చలేదు. శ్వేత, జయప్రకాష్‌లకు ఏమి జరుగుతుందో పూర్తిగా తెలియదు. దయచేసి వారిపై ఎటువంటి చర్య తీసుకోకండి అని ఆయన రాశారు. మూడవ పేజీలో మోర్ తన మరణానికి రాహుల్, సబాను కారణమని పేర్కొన్నాడు. నేను, రాజ్ మోర్. ఈ రోజు ఆత్మహత్య చేసుకుంటున్నాను. నా ఆత్మహత్యకు రాహుల్ పర్వానీదే బాధ్యత. అతను నన్ను మోసగించి నెలల తరబడి నన్ను బ్లాక్ మెయిల్‌చేశాడు. నా మరణానికి రాహుల్ పర్వానీ, ఇంకా సబా ఖురేషి బాధ్యులని రాజ్ తన సూసైడ్ నోట్‌లో రాశాడు. దీంతో పోలీసులు ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేశారు.

# బీహార్‌లో మహిళలకు 35% రిజర్వేషన్లు

## ఎన్నికల ముందు బీహార్ సిఎం వరాలు

**పాట్నా, జూలై 8:** త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న తరుణంలో మహిళా సాధికారత, ఉద్యోగాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ సంకేతాలిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మహిళలకు రిజర్వేషన్ ప్రకటించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు నేరుగా జరిగే అన్ని రిక్రూట్‌మెంట్లలో బీహార్ స్థానికత కలిగిన మహిళలకు 35 శాతం రిజర్వేషన్ కల్పించనున్నట్టు మంగళవారంనాడు ప్రకటించారు. రాష్ట్ర క్యాబినెట్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఎంపిక చేసిన ప్రభుత్వ సర్వీసులలో బీహార్‌లోని మహిళలకు ఇప్పటికే రిజర్వేషన్ ఉండగా, తాజా నిర్ణయం ప్రకారం అన్ని ప్రభుత్వ శాఖలు, రిక్రూట్‌మెంట్ స్థాయిలలో శాశ్వత నివాసిత మహిళలకు 35 శాతం కోటా వర్తిస్తుంది. బీహార్ యూత్ కమిషన్ ఏర్పాటుకు కూడా రాష్ట్ర ప్రభుత్వం తాజాగా నిర్ణయం తీసుకుంది. ఉద్యోగావకాశాలు పెంచడం, వొకేషనల్ ట్రైనింగ్, రాష్ట్రంలోని యువతకు సపోర్ట్‌గా నిలబడే లక్ష్యంతో ఈ యూత్ కమిషన్ ఏర్పాటు కానుంది. యువతకు సంబంధించిన విధానాలు, అభివృద్ధి పథకాల్లో అడ్వైజరీగా కమిషన్ వ్యవహరిస్తుందని నితీష్ కుమార్ తెలిపారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాలు, ముఖ్యంగా ప్రైవేటు రంగంలో జాబ్ ప్లేస్‌మెంట్‌ను మెరుగుపరచేందుకు వివిధ శాఖలతో కమిషన్ సమన్వయం చేస్తుందని చెప్పారు.

ఈ కమిషనల్‌లో ఒక చైర్మన్, ఇద్దరు వైస్ చైర్మన్లు, ఏడుగురు సభ్యులు 45 ఏళ్లలోపు వారు ఉంటారు. ఇక ఇప్పటికే రాష్ట్రంలోని మహిళలకు సామాజిక పెన్షన్‌ను నితీశ్ ప్రభుత్వం పెంచిన విషయం తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆ రాష్ట్రంలోని ఎన్డీఏ కూటమి సర్కారు పెన్షన్‌ల పెంపు నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం రూ.400గా ఉన్న పెన్షన్‌ను ఇప్పుడు రూ.1100 లకు పెంచారు. పెరిగిన పెన్షన్ జూలై నెలనుంచే అమలులోకి వచ్చింది. అర్హులందరి బ్యాంకు ఖాతాల్లో జూలై 10న పెన్షన్ డబ్బులు పడుతాయని తాను హామీ ఇస్తున్నానని గత నెల సీఎం ప్రకటించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో మహిళలకు పెద్ద పీట వేస్తూ.. ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రకటించారు.

# మీరూ చంద్రునిపై నడవొచ్చు..



### మీలో చాలామంది వ్యోమగాములు కావచ్చు..
### నేను వచ్చాక మార్గనిర్దేశనం చేస్తా: విద్యార్థులతో శభాంశు శుక్లా చిట్‌చాట్

**న్యూఢిల్లీ, జూలై 8:** ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి భారత వ్యోమగామి శుభాంశు శుక్లా విద్యార్థులతో మాట్లాడారు. భవిష్యత్తులో వ్యోమగాములు కావొచ్చని, చంద్రుడిపైనా నడుస్తారని విద్యార్థులకు చెప్పారు. హ్యామ్ రేడియో సాయంతో మాట్లాడిన ఆయన విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. నేను త్వరలోనే తిరిగి వచ్చి మీకు మార్గనిర్దేశం చేస్తాను. మీలో చాలా మంది వ్యోమగాములు కావొచ్చు. కష్టపడి పని చేయండి. మిమ్మల్ని మీరు నమ్మండి. మీరు చంద్రుడిపైనా నడవచ్చని శుభాంశు శుక్లా చెప్పారు.

హ్యామ్ రేడియో సాయంతో 10 నిమిషాల పాటు మాట్లాడిన ఆయన ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్‌లో అనుభవాలను పంచుకున్నారు. వ్యోమగామిగా శిక్షణ, అంతరిక్షంలో ఆరోగ్యంగా ఉండడం లాంటి విషయాలను వివరించారు. మైక్రో గ్రావిటీ వల్ల మానవ శరీరంలో అనేక మార్పులు వస్తాయని శుక్లా చెప్పారు. అందుకోసమే అంతరిక్షంలో ఆరోగ్యంగా ఉండేందుకు తప్పనిసరిగా వ్యాయామం చేయాలని తెలిపారు. మేము అంతరిక్షంలో సూర్యుడిని అనుసరించం. ప్రతి 90 నిమిషాలకు మేము భూమి చుట్టూ తిరుగుతాం. ఫలితంగా 16 సార్లు సూర్యోదయం, సూర్యాస్తమాలను చూస్తాం. మనం భూమిపై గ్రావిటీతో పెరుగుతాం. కానీ అంతరిక్షంలో గురుత్వాకర్షణ ఉండదు. ఫలితంగా శరీరంలో అనేక మార్పులు వస్తుంటాయి. వీటిని స్వీకరించేందుకు మన శరీరానికి కొంత సమయం పడుతుంది. నాకు కూడా మొదట్లో కాస్త అస్వస్థతగా అనిపించింది. కొన్ని మందులు వేసుకుని వాటిని అలవాటు చేసుకున్నాను. ఈ మైక్రో గ్రావిటీ వల్ల కండరాలు, ఎముకలపై తీవ్ర ప్రభావం పడుతుంది. అందుకే ప్రతి రోజు ట్రేడ్ మిల్స్, సైకిల్స్, వ్యాయామం చేయాలి. మిషన్ కోసం, భూమిపైకి తిరిగి వచ్చేందుకు ఎల్లప్పుడూ ఫిట్‌గా ఉండాలి. ఈ మిషన్‌లో శారీరకంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండాలి. రోబోటిక్స్, ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ సైతం మా మిషన్‌లో అంతర్భాగం. కొన్ని పనులను మేము రోబోటిక్ సాయం చేస్తాం. దీంతో పని సురక్షితంగా పూర్తి అవుతుదని శుభాంశు శుక్లా చెప్పారు. 12 రోజులుగా అంతరిక్షంలో ఉంటున్న శుక్లా, మేఘాలయా, అసోంకు చెందిన విద్యార్థులతో మాట్లాడారు.

కొంత మంది విద్యార్థులకు షిల్లాంగ్‌లోని నార్త్ ఈస్ట్ స్పేస్ అప్లికేషన్ సెంటర్ నుంచి వ్యోమగామి శుభాంశు శుక్లాతో మాట్లాడే అరుదైన అవకాశాన్ని కల్పించగా, దాదాపు 20 ప్రశ్నలను శుక్లాను అడిగారు.ఆర్మీ పబ్లిక్ స్కూల్ షిల్లాంగ్, ఆల్ఫా హైయర్ సెంకడరీ స్కూల్ నాన్గ్‌ప్, ఆర్య విద్యాపీఠ్ హైస్కూల్ గువాహటి, క్రైస్ట్ సీనియర్ సెంకడరీ స్కూల్ ఉమియమ్, పీఎం శ్రీ కేంద్రీయ విద్యాలయం బరపణి, ఆర్మీ పబ్లిక్ స్కూల్ ఉమ్‌రోయ్, బీకే బజోరియా స్కూల్ షిల్లాంగ్‌కు చెందిన విద్యార్థులు వ్యోమగామి శుక్లాతో మాట్లాడారు. ఇంతకుముందు కూడా అనేక పాఠశాలలకు చెందిన విద్యార్థులతో శుక్లా మాట్లాడారు. అంతరిక్షంపై విద్యార్థుల్లో ఉన్న సందేహాలను నివృత్తి చేశారు.

# 67 మందిని రక్షించిన జాగిలం

## హిమాచల్ వరదల్లో వెలుగుచూసిన ఉదంతం

**సిమ్లా,జూలై 8:** హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు సృష్టిస్తున్న విలయం మధ్య, ఓ మూగ జీవి 67మంది ప్రాణాలను కాపాడింది. పెంపుడు కుక్క అరవడంతో పెను ప్రమాదం నుంచి 20 కుటుంబాలు సురక్షితంగా బయటపడ్డాయి. కళ్ల ముందే తమ ఇళ్లు మట్టిలో కలిసిపోయినా, ప్రాణాలతో బయటపడ్డామని గ్రామస్థులు ఊరట చెందుతున్నారు. మండిజిల్లా ధర్మపూర్ ప్రాంతంలోని సియాతి గ్రామంలో జూన్ 30 అర్ధరాత్రి ఈ ఘటన చోటుచేసుకుంది. భారీ వర్షం కురుస్తుండగా, నరేంద్ర అనే గ్రామస్థుడి ఇంట్లో నిద్రిస్తున్న కుక్క అర్ధరాత్రి సమయంలో గట్టిగా అరవడం, ఊళలు వేయడం ప్రారంభించింది. దాని అరుపులకు నాకు మెలకువ వచ్చింది. వెళ్లి చూడగా ఇంటి గోడకు పెద్ద పగులు కనిపించి, నీరు లోపలికి రావడం మొదలైంది. వెంటనే కుక్కతో పాటు కిందకు పరిగెత్తి, నా కుటుంబ సభ్యులను, ఆ తర్వాత గ్రామస్తులందరినీ నిద్రలేపి సురక్షిత ప్రాంతానికి వెళ్లమని చెప్పానని నరేంద్ర వివరించారు. వారు గ్రామాన్ని వీడిన కొద్దిసేపటికే కొండచరియలు విరిగిపడి పదుల సంఖ్యలో ఇళ్లు నేలమట్టమయ్యాయి. గ్రామం మొత్తం శిథిలాల కింద కూరుకుపోయింది. ప్రాణాలతో బయటపడిన వారంతా ప్రస్తుతం సమీపంలోని నైనా దేవి ఆలయంలో ఆశ్రయం పొందుతున్నారు. ఈ ఘటనతో చాలామంది రక్తపోటు, మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారు. ప్రభుత్వం వారికి రూ. 10,000 తక్షణ సాయం అందించింది. జూన్ 20న రుతుపవనాలు ప్రవేశించినప్పటి నుంచి హిమాచల్ ప్రదేశ్‌లో వర్ష సంబంధిత ఘటనల వల్ల 50 మంది, రోడ్డు ప్రమాదాల్లో 28 మంది సహా మొత్తం 78 మంది మరణించినట్లు రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 16 కొండచరియలు విరిగిపడటం, 19 మేఘ విస్ఫోటాలు, 23 ఆకస్మిక వరదలు సంభవించాయి. అత్యధిక మరణాలు మండి జిల్లాలోనే నమోదయ్యాయి.

# ఇఓలపై దాడి చేస్తే ఊరుకోం

## రమాదేవిపై దాడిని ఖండించిన మంత్రి సురేఖ

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** ఎండోమెంట్ భూములను కబ్జా చేస్తే పీడీ యాక్టు పెడతామని మంత్రి సురేఖ పేర్కొన్నారు. భద్రాచలం రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబ్జాకి గురవుతుండగా అడ్డుకున్న ఇఓ రమాదేవిపై దాడి చేయడం సహేతుకంకాదని మంత్రి ఖండించారు. ఈ విషయంలో ఏపీ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక చొరవ తీసుకొని సమస్యను పరిష్కారించాలని మంత్రి అభ్యర్థించారు. భద్రాచలం శ్రీసీతారామ చంద్రస్వామికి పురుషోత్తపట్నంలో భూములున్న విషయం విదితమే. ఆ భూమిలో అనుమతి లేకుండా భవననిర్మాణ పనులు చేపడుతుండటంతో భద్రాచలం టెంపుల్ సిబ్బంది దాన్ని అడ్డుకునే క్రమంలో ఆ గ్రామస్థులతో తరచూ ఘర్షణ జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో భద్రాద్రిరాముడికి సుమారు 1,300 ఎకరాల భూమి ఉండగా అందులో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నంలోనే గరిష్ఠంగా 889.5 ఎకరాలు ఉంది. పురుషోత్తపట్నంలోని భూమి ఎక్కువ భాగం ఆక్రమణకు గురైంది.కోర్టు తీర్పు ప్రకారం ఈ భూమిపై దేవస్థానానికి హక్కులు లభించాయి. వీటిని పురుషోత్తపట్నంవాసులు పరిగణనలోకి తీసుకోవటం లేదు. పురుషోత్త పట్నంలోకి ప్రవేశించే మార్గంలో పిల్లర్లతో నిర్మాణ పనులు చేపడుతున్నారనే సమాచారం అందుకున్న ఆలయ సిబ్బంది అక్కడికి చేరుకుని అనుమతి లేకుండా ఇళ్ల నిర్మాణం చేయవద్దని,ఇది పూర్తిగా రాముడి భూమిఅని వివరించారు.కోర్టు తీర్పులతో దేవుడి పేరిట పట్టాదారు పాసు పుస్తకాలు ఉన్నాయని వెల్లడించారు. అయితే, ఇఓ అభ్యంతరాలు వినకుండా స్థానికులు దాడి చేయడంతో ఆమె స్పృహ కోల్పోయిన పరిస్థితి నెలకొంది.

## ఎంపిడబ్ల్యూ వర్కర్ల వేతనం రూ.150 కోట్లు విడుదల

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** తెలంగాణ లోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల(ఎంపిడబ్ల్యూ)కు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త తెలిపింది. 3నెలల(ఏప్రిల్,మే,జూన్)గా ఎదురు చూస్తున్న జీతాలను విడుదల చేస్తూ రూ.150 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులను గ్రామ పంచాయతీల ఖాతాల్లో జమ చేయనుండటంతో, 53వేలమందికి పైగా ఊరట లభించనుంది. సకాలంలో జీతాలు అందక ఇబ్బందులు పడిన కార్మికులకు ఈ నిర్ణయం ఉపశమనం కలిగిస్తుంది. ఒండు లేదు మూడు రోజుల్లో వారి అకౌంట్లో మూడు నెలల జీతం జమ కానుంది.

## వైఎస్ఆర్ పేరు మీద అభ్యుదయ రైతు అవార్డులు

### ఆయన అంటే గుర్తుకు వచ్చేది వ్యవసాయం,ప్రాజెక్టులే: డిప్యూటి సిఎం భట్టి



**హైదరాబాద్ (పంజగుట్ట), జూలై 8 ప్రభాతవార్త:** దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గుర్తుగా అభ్యుదయ రైతులకు అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచన చేస్తుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా పంజగుట్ట, బంజారాహిల్స్ లో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమం టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా భట్టి మాట్లాడుతూ వైఎస్ఆర్ పేరుమీద ఒక ఫౌండేషన్ ఏర్పాటు చేసి వచ్చే వర్ధంతి కల్లా ఒక కార్యక్రమాన్ని రూపకల్పన చేసి వ్యవసాయరంగంలో నిష్ణాతులైనవారిని,వ్యవసాయంపై రీసెర్చ్ చేస్తున్న వారిని ఈ ప్రాంత అభివృద్ధికి వ్యవసాయరంగానికి దోహదపడుతున్న వారిని గుర్తించి వైఎస్ఆర్ పేరుమీద అవార్డులు ఇవ్వనున్నాని ఆయన తెలిపారు. వైఎస్ఆర్ అంటే గుర్తుకు వచ్చేది వ్యవసాయం ప్రాజెక్టులేనని ఆయన గుర్తు చేశారు. వైఎస్ఆర్ లేనిలోటు రెండు తెలుగు రాష్ట్రాలకు తీరని లోటని ఆయన వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమాలలో పీసీసీ చీఫ్ మహేష్ కుమార్‌గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్, పాండిచ్చేరి మాజీ ముఖ్యమంత్రి నారాయణ స్వామి, మాజీ రాజ్యసభసభ్యులు కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# జిఓ నెం.49ను రద్దు చేయాలి

## గవర్నర్‌ను కలిసిన సోయం బాపూరావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో టైగర్ కన్జర్వేషన్ పేరిట జారీచేసిన జీవో నెం.49 ఆదివాసీ హక్కులకు విఘాతం కలిగిస్తుందని, ఈ జీవో అమలు అయితే ఆదివాసీ గిరిజనుల మునుగడ ప్రశ్నార్థకంగా మారనుందని మాజీ ఎంపీ, ఆదివాసీ సంఘాల ఉద్యమ నేత సోయం బాపూరావు అన్నారు. మంగళవారం మధ్యాహ్నం తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను ఆదివాసీ సంఘాల నేతలు రాజ్‌భవన్‌లో కలిసి ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.49ను రద్దు చేయాలని వినతిపత్రాన్ని అందజేశారు. కొమురం భీం జిల్లాలోని ఆసిఫాబాద్, కాగజ్ నగర్ డివిజన్లను ఏకపక్షంగా టైగర్ కన్జర్వేషన్‌లో కలపడం వల్ల అటవీ భూములను నమ్ముకొని బతికే గిరిజనుల హక్కులకు భంగం వాటిల్లుతుందని సోయం బాపూరావు గవర్నర్ దృష్టికి తెచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పోడు భూముల సమస్యలను సానుకూలంగా పరిష్కరించేందుకు ముందుకు వస్తున్న క్రమంలో జీవో నెం.49 జారీ చేయడం తగదని సూచించారు.

ఇప్పటికే ఈ జిల్లాలో ఆ జీవోను రద్దు చేయాలని ఆందోళనలు చేస్తున్నారని, ఏకపక్షంగా జారీ చేసిన జీవో వల్ల ఈ జిల్లాలోని 339 ప్రభావిత గ్రామాల్లో గిరిజన, గిరిజనే తరులు ఆందోళన చెందుతున్నారన్నారు.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డిప్యూటీ టాక్స్ ఆఫీసర్

**గచ్చిబౌలి, జూలై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో లంచాసురులపై ఏసీబీ క్రమం తప్పకుండా దాడులు కొనసాగిస్తూనే ఉంది. తాజాగా మంగళవారం నాంపల్లి గగన్ విహార్‌లో జరిగిన ఆపరేషన్‌లో మాదాపూర్ డిప్యూటీ స్టేట్ టాక్స్ ఆఫీసర్ సుధ లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్‌గా ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఓ కంపెనీకి సంబంధించిన జీఎస్టీ రిజిస్ట్రేషన్ ప్రాసెస్ చేయడంలో సహకరించాలంటే రూ.8,000 లంచం ఇవ్వాల్సిందిగా డిమాండ్ చేసినట్లు సమాచారం. బాధితుడు చేసిన ఫిర్యాదు ఆధారంగా ఏసీబీ అధికారులు వ్యవహరించి, లంచం తీసుకుంటున్న సమయంలోనే అధికారిని పట్టుకుని రిమాండ్‌కు తరలించారు.

లంచాలపై ప్రభుత్వం స్పష్టమైన హెచ్చరికలు ఇచ్చినా, కొంతమంది అధికారుల తీరు మారకపోవడం ఆందోళన కలిగిస్తోంది.



పట్టుబడ్డ సుధ

# ఫీజు బకాయిలు చెల్లించండి

## ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదన విరమించుకోవాలి:ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్, జూలై 8 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం వెంటనే కాలేజీ కోర్సుల్లో బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థుల మూడు సంవత్సరాల ఫీజు బకాయిలు చెల్లించాలని, ట్రస్ట్ బ్యాంక్ ప్రతిపాదన విరమించుకోవాలని రాజ్యసభ సభ్యులు ఆర్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ రాశాడు. విద్యార్థుల ఫీజు రియంబర్స్‌మెంట్ స్కీమ్ ఎత్తివేయాలనే కుట్రపన్నుతున్నారని ఆరోపించారు. ఈ కుట్రలో భాగంగా టెస్ట్ బ్యాంక్ నిధి అనే సరికొత్త ప్రతిపాదన కాలేజీ యజమాన్యాల ద్వారా తెలుస్తుంది. దీన్ని ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదన్నారు. దీనిపై తెగించి పోరాడుతామని,స్కీమును రక్షించుకుంటామని ఆయన సిఎంకు రాసిన లేఖలో పేర్కొన్నారు.



ప్రజావాణీలో చిన్నారెడ్డి,దివ్యలకు ధన్యవాదాలు తెలియజేస్తున్న మైనారిటీ గురుకుల పాఠశాల ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

# రూ.303 కోట్లతో కంటోన్మెంట్ అభివృద్ధి

## మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటల రాజేందర్




మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), జులై 8 ప్రభాతవార్త:** ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు సికింద్రాబాద్ ప్యాట్నీ జె.ఎస్.సుంచి శామీర్‌పేట్ వరకు చేపట్టనున్న ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణంలో కంటోన్మెంట్ బోర్డు, రక్షణశాఖ స్థలాలపై రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వచ్చిన 303 కోట్ల రూపాయలను రక్షణశాఖ నిధికి వెళ్లకుండా కంటోన్మెంట్ బోర్డు ప్రాంతాల అభివృద్ధికి ఖర్చు పెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్ తెలిపారు. మంగళవారం బోర్డు సిఈఓ మధుకర్ నాయక్, నామినేటెడ్ మెంబర్ బానుక నర్మధ మల్లికార్జున్‌లతో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి సంబంధించిన రోడ్ల విస్తరణలో కంటోన్మెంట్ బోర్డు స్థలాలపై వచ్చిన 303 కోట్లను కేంద్ర ప్రభుత్వ నిధులకు వెళ్లకుండా సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డుకే ఖర్చుపెట్టే విధంగా ఆమోదం తెలిపిందన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్,కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిల చొరవతో కేంద్ర ప్రభుత్వ నిధికి వెళ్లకుండా మల్లించడం జరిగిందన్నారు. ఈ నిధులను భూగర్భ డ్రైనేజీ, ఓపెన్ నాలా, పార్కుల సుందరీకరణ వంటి అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక సదుపాయాలు మెరుగుపర్చడానికి నిధులు కేటాయించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ఈ నిధులతో డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్లు నిర్మించడానికి కూడా వెచ్చిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక, కంటోన్మెంట్ బోర్డు సూపరిండెంట్లు ఎం.దేవేందర్, ఏ. మహేందర్, సి.హెచ్.ఉమా శంకర్, బిజెపి నేతలు పిట్ల నాగేశ్, బి.ఎస్.శ్రీనివాస్, నర్సింగ్‌రావ్, కొంతం నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

# సిఎం ప్రజావాణిలో 297 దరఖాస్తులు

**హైదరాబాద్ (బేగంపేట), జులై 8,ప్రభాతవార్త:** మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 297దరఖాస్తులు అందాయి.వీటిలో పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కు సంబంధించి 69దరఖాస్తులు,రెవెన్యూ శాఖకు సంబంధించి 48దరఖాస్తులు,విద్యుత్ శాఖకు సంబంధించి 33దరఖాస్తులు, పౌరసరఫరాల శాఖకు సంబంధించి 07దరఖాస్తులు, ఇందిరమ్మ ఇండ్ల కోసం 45దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 95దరఖాస్తులు అందినట్లు అధికారులు తెలిపారు. సీఎం ప్రజావాణి ఇంచార్జి,రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ ఛైర్మన్ డా.జీ.చిన్నారెడ్డి,స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు దరఖాస్తులు స్వీకరించి ప్రజల సమస్యలు విని సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించారు.మైనారిటీ గురుకుల పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సర్వీస్ సమస్యలు పరిష్కారం కావడంతో వారంతా ప్రజాభవన్‌కు వచ్చి చిన్నారెడ్డి, దివ్యలకు ధన్యవాదాలు తెలియజేసారు.



## ప్రజావాణిని సందర్శించిన మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్ల బృందం

**బేగంపేట జులై 8,ప్రభాతవార్త:** జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణీని మధ్య ప్రదేశ్ రాష్ట్ర డిప్యూటీ కలెక్టర్ల బృందం సందర్శించింది.సీఎం ప్రజావాణీ ప్రవాసీ ప్రజావాణీ పనితీరు చాలా బాగుందని ఇలాంటి విధానాన్ని మధ్యప్రదేశ్ రాష్ట్రంలోనూ అమలు చేసేందుకు తమ రాష్ట్ర ఉన్నత అధికారులకు సిఫార్సు చేస్తామని డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు.ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లు సీఎం ప్రజావాణీ ఇంచార్జి ,రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు డా.జి. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లతో భేటి అయ్యారు.

సీఎం ప్రజావాణీ గురించి వారు డిప్యూటీ కలెక్టర్లకు వివరించారు. సీఎం ప్రజావాణీ సమస్యల పరిష్కార వేదిక అని ఇతర రాష్ట్రాలకు స్ఫూర్తినిచ్చే కార్యక్రమం అని మధ్యప్రదేశ్ డిప్యూటీ కలెక్టర్లు పేర్కొన్నారు.

# ఆషాఢం బోనాలు తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు చిహ్నం: ఎమ్మెల్సీ కోదండరాం

### జీహెచ్ఎంసీ కార్మికుల బోనాల వేడుకలలో పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, డిప్యూటీ మేయర్

**హైదరాబాద్ (ముషీరాబాద్), జూలై 8, ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతి, సాంప్రదాయాలకు చిహ్నం ఆషాడ మాస బోనాలని తెలంగాణ జనసమితి అధ్యక్షులు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. మంగళవారం లోయర్‌ట్యాంక్ బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయం వద్ద జీహెచ్ఎంసీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో బోనాల వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరై కోదండరాం మాట్లాడుతూ జీహెచ్ఎంసీ కార్మికులకు కనీస వేతనాల పెంపుదల, తదితర సమస్యలపై ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడి, పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వీ.హనుమంతరావు మాట్లాడుతూ సోనియాగాంధీ నాయకత్వంలో రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటాడని, కార్మికులకు 26వేల రూపాయల వేతనం చేయటానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి మాట్లాడుతూ జీహెచ్ఎంసీలోని కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు. ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలకు మహిళా కార్మికులు భారీగా తరలి వచ్చి, బోనాలు చెల్లించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జనసమితి నగర అధ్యక్షులు ఎం.నర్సయ్య, నాయకులు మెరుగు శ్రీనివాస్‌యాదవ్, లక్ష్మీ, పల్లె వినయ్, సలీం పాషా, అరుణ్‌కుమార్, రాంచందర్, జైపాల్‌రెడ్డి, సుధాకర్, టి.ఆర్.ఎస్. నాయకులు ఎం.ఎన్. శ్రీనివాస్‌రావు, బాలకృష్ణ, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షులు బాలరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ జహీర్, ప్రధాన కార్యదర్శి జగదీష్, ఉపాధ్యక్షులు యాదగిరి, ఫయాజ్, బి.రాజు, జె.డి.కుమార్, బి.అశోక్ తదితరులు పాల్గొన్నారు.



మంగళవారం జీహెచ్ఎంసీ కార్మికుల బోనాల వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్సీకోదండరాం తదితరులు

## స్థానిక ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం ఇవ్వాలి

### ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు అవకాశం కల్పించాలని ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు దివ్యాంగుల ఫించన్లు పెంచుతామని హామీ ఇచ్చిందని,కానీ అమలు చేయకుండా మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలకు అండగా ఉండాల్సిన ప్రతిపక్షాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని,అందుకే తాము ప్రభుత్వంపై పోరాటానికి సిద్ధమైనట్టు చెప్పారు.ఇందులో భాగంగా అన్ని రాజకీయ పార్టీల అధ్యక్షులను కలిసి మద్దతు కోరుతున్నట్టు తెలిపారు.ఈ క్రమంలోనే బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావును కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. ప్రభుత్వంపై పోరాటంలో భాగంగా ఈ నెల 13 నుండి దివ్యాంగుల మహాగర్జన సన్నాహక సమావేశాలు జిల్లాల్లో నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆగస్టు 13న దివ్యాంగుల మహాగర్జన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని ఎల్‌బిస్టేడియంలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు.

## రాష్ట్రంలో 8జిల్లాల్లో పామాయిల్ ఇండస్ట్రీలు

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** తెలంగాణ లోని ఎనిమిది జిల్లాల్లో పామాయిల్ ఇండస్ట్రీలను ఏర్పాటు చేయాలని ఉద్యాన శాఖ నిర్ణయించింది. ఇందుకు అనుగుణంగా ఈ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అనుకూలమైన జిల్లాల్లో ఆయిల్‌పామ్ సాగుకు ప్రణాళికను రూపొందించింది. అందుకు అనుగుణంగా జిల్లాల వారీగా లక్ష్యాలను నిర్ధారించింది. రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లోను, అత్యల్పంగా ఆసిఫాబాద్ జిల్లాలో ఆయిల్‌పామ్ సాగును చేపట్టాలని లక్ష్యాంగా కలిగి ఉంది. తెలంగాణలో అధికారులు నిర్ధారించిన ఆయిల్ పామ్ సాగు లక్ష్యాలు ఈ విధంగా ఉన్నాయి. ఖమ్మం జిల్లాలో 13 వేల ఎకరాల్లోను, కొత్తగూడెంలో 11 వేల ఎకరాలు, నల్లగొండలో 6,700 ఎకరాలు, మహబూబా బాద్‌ల 5,000 ఎకరాలు, సిద్ధిపేట్‌లో 4,800 ఎకరాలు, సూర్యాపేట్‌లో 4,800 ఎకరాలు, నిర్మల్‌లో 4,200 ఎకరాలు, జగిత్యాలలలో 3,850 ఎకరాలు, వరంగల్‌లో 3,800 ఎకరాలు, భువనగిరిలో 3,500 ఎకరాలు, జనగామ్‌లో 3,400 ఎకరాలు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 3,000 ఎకరాల్లోనూ ఆయిల్‌పామ్‌ను సాగు చేయాలని లక్ష్యాలను నిర్ణయించింది.

## బిజెపి సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్ళాలి

### అధికార ప్రతినిధులకు దిశానిర్దేశం చేసిన రామచందర్‌రావు

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ సిద్ధాంతాలను, కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పార్టీ అధికార ప్రతినిధులదే కీలకపాత్ర అని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు తెలిపారు.మంగళవారం భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయంలో ఆయన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ చేపట్టే కార్యక్రమాలతో పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై బిజెపి పోరాటాలను సమర్థంగా ప్రజల దృష్టికి తీసుకెళ్లాలని ఆయన సూచించారు.తాను కూడా గతంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించానని గుర్తు చేసిన రాంచందర్ రావు తాను కూడా గతంలో బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు నిర్వహించానని గుర్తు చేసిన రాంచందర్ రావు గారు, ఆ అనుభవం తమ భుజాలపై ఉన్న బాధ్యత ప్రాముఖ్యతను మరింత లోతుగా అర్థం చేసుకునేలా చేసిందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా. కాసం వెంకటేశ్వర్లు ,రాష్ట్ర కార్యదర్శి డా. ఎస్. ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధులు పాల్గొన్నారు.

# గురుకులాల టైం టేబుల్ మార్పు చేయాలి

### అన్ని గురుకులాలకు ఒకే టైం టేబుల్ ఉండాలి

### గురుకుల సొసైటీల కార్యదర్శులకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య విజ్ఞప్తి

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలో కొనసాగుతున్న వివిధ గురుకులాలన్నింటికీ ఒకే టైం టేబుల్ ఉండాలని కరీంనగర్-నిజామాబాద్-ఆదిలాబాద్-మెదక్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ మంగవారం బిసి, ఎస్సీ గురుకుల సొసైటీల కార్యదర్శులకు వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని గురుకులాల్లోని టైం టేబుల్‌ను పునఃసమీక్షిస్తూ నూతన టైం టేబుల్‌ను అమలు చేయాలని కరీంనగర్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య మంగళవారం మసాబ్ ట్యాంక్‌లోని దామోదరం సంజీవయ్య సంక్షేమ భవన్‌లో మహాత్మా జ్యోతిబాపూలే వెనుకబడిన గురుకు లాల సెక్రటరీ సైదులు, సాంఘిక సంక్షేమ గురుకులాల సెక్రటరీ అలుగు వర్షిణిని కలిసి విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ గురుకులాల సమయ సారిని గూర్చి గతంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలిసి విజ్ఞప్తి చేసిన సందర్భంలో అన్ని గురుకులాల కార్యదర్శుల పరిశీలనకు పంపించి తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారని.. ఇదే విషయాన్ని ట్రైబ్ చైర్మన్ సైదులు, సోషల్ వెల్ఫేర్ సెక్రెటరీ అలుగు వర్షిని దృష్టికి తీసుకు వెళ్లినట్టు తెలిపారు. వారు సానుకూలంగా స్పందిస్తూ తగిన నిర్ణయం తీసుకుంటామని తెలియజేసినట్టు ఎమ్మెల్సీ చెప్పారు. సాంఘిక సంక్షేమ గురుకులాలలో కామన్ స్టాఫ్ ప్యాట్రన్ అమలు చేయాలని, కామన్ ప్రమోషన్ ఛానెల్ ఉండేలా చూడాలని ప్రాతినిధ్యం చేయగా అందుకు ఎస్సీ గురుకుల సొసైటీ సెక్రటరీ సానుకులంగా స్పందించినట్టు ఎమ్మెల్సీ మల్క కొమురయ్య తెలిపారు.



## తెలంగాణ అసెంబ్లీని సందర్శించిన మేఘాలయ సభ్యుల బృందం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యేల బృందం మంగళవారం తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీని సందర్శించారు. హైదరాబాద్ లోని అసెంబ్లీ కమిటీ హాల్‌లో మేఘాలయ రాష్ట్ర బృందానికి పిఏసి చైర్మన్ ఆర్కేపూడి గాంధీతో కలిసి మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం వారితో సమావేశమై తెలంగాణ,రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల గురించి సభ్యులకు వివరించారు. అసెంబ్లీ నిర్వహించే విధానంతో పాటు, అసెంబ్లీ లో ప్రజా సమస్యల్ని పరిష్కరించడానికి చేసే చట్టాలను రాష్ట్రంలో అమలవుతున్న ప్రజా సంక్షేమ పథకాలను, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి గురించి వారికి మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి వివరించారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం, ప్రత్యేక రాష్ట్రం ఉద్దేశ్యాలను, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఔన్నత్యం గురించి మేఘాలయ అసెంబ్లీ సభ్యుల బృందానికి ఆయన వివరించారు. మహబూబ్ నగర్ నియోజకవర్గంలో "విద్యా నిధి" ఏర్పాటు, మహబూబ్ నగర్ ఫస్ట్ లక్ష్యాలను, నిరుద్యోగ యువతకు ఇచ్చే ఉచిత కోచింగ్, నైపుణ్య శిక్షణ సెంటర్ గురించి కూడా వారికి వివరించారు. ఈ సందర్భంగా మేఘాలయ అసెంబ్లీ సభ్యుల బృందం అసెంబ్లీ సమావేశాల గురించి, ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి గురించి, మహబూబ్ నగర్ విద్యా నిధి గురించి సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మేఘాలయ రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ చార్లెస్ పిన్గ్రోప్, ఎమ్మెల్యేలులహ్మాన్ రింబుల్, రూపా లీ. మార్క్, తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి నర్సింహా చార్యులు తదితరులు పాల్గొన్నారు.

## మీ టికెట్ యాప్‌తో తెలంగాణ పురావస్తు మ్యూజియం పర్యటనలకు కొత్త శకం

### మంత్రి శ్రీధర్ బాబు

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త :** మీ టికెట్ మొబైల్ యాప్ తెలంగాణ రాష్ట్రంలోని అన్ని పురావస్తు మ్యూజియమ్‌లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సందర్శన అనుభవాన్ని మార్చేసిందని ఐటి ,పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఒక ప్రకనలో తెలిపారు. కరీంనగర్‌లోని గాంధీ సెంటెనరీ మ్యూజియం, హైదరాబాద్‌లోని కులీ కుతుబ్ షాహీ సమాధి వంటి కొత్త ఆకర్షణలు యాప్‌లో చేరినట్లు తెలిపారు.ఈ సంవత్సరం జనవరి 8, 2025న ప్రారంభమైన ఈ యాప్ 80,000కి పైగా డౌన్‌లోడ్‌లు,1.7 కోట్లకు పైగా లావాదేవీలు సాధించినట్లు తెలిపారు.ఈ యాప్ నగదు రహిత,క్యూలు లేని టికెటింగ్ అనుభవాన్నిఅందిస్తుందన్నారు.వరంగల్,నల్గొండలోని జిల్లా పురావస్తు మ్యూజియమ్‌లు, జోగులాంబ గద్వాల్‌లోని ఆలంపూర్ సైట్ మ్యూజియం, హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర పురావస్తు మ్యూజియం కూడా యాప్‌లో చేరినట్లు తెలిపారు.యూజర్లు మ్యూజియం వివరాలు, సమయాలు తెలుసుకొని, ముందస్తు టికెట్లు బుక్ చేసుకోవచ్చన్నారు.ఈ యాప్‌తెలంగాణ సంపన్న పురావస్తు వారసత్వాన్ని సులభతరం చేస్తుందని,మరిన్ని ఆకర్షణలు త్వరలో జోడిస్తామన్నారు.ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ) పరిధిలోని సలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, గోల్కొండ కోట, వరంగల్ కోట యాప్‌లో చేరనున్నట్లు తెలిపారు. కాళేశ్వరం,బాసర, యాదాద్రివంటి ఆధ్యాత్మిక సర్క్యూట్‌ల కోసం తెలంగాణ టూరిజం ప్యాకేజీలు కూడా ప్లాన్ చేస్తున్నామన్నారు.మీ టికెట్ సాంస్కృతిక అన్వేషణను మెరుగు పరుస్తుందని,తెలంగాణలో ప్రజా సేవల యాక్సెస్‌ను విస్తరించడమే దీని లక్ష్యమన్నారు.

# మా అనుభవం ముందు కెటిఆర్ జీరో

## ముఖ్యమంత్రి రేవంత్‌తో చర్చించే స్థాయి ఆయనకు లేదు

## పదవి పోగానే కేటీఆర్ అల్లాడిపోతున్నారు: జగ్గారెడ్డి



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. తమ సుదీర్ఘ రాజకీయ అనుభవం ముందు కేటీఆర్ ఒక జీరో అని, ఆయన ఒక చిన్న పిల్లాడిలా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని చర్చకు పిలిచే స్థాయి కేటీఆర్‌కు లేదని అన్నారు.మంగళవారం నాడు గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన జగ్గారెడ్డి, కేటీఆర్ రాజకీయ ప్రస్థానాన్ని ప్రశ్నించారు. "మేమంతా ఎన్నో వ్యయప్రయాసలకోర్చి క్షేత్రస్థాయి నుంచి నాయకులుగా ఎదిగాం. కేటీఆర్ తన తండ్రి సీటిస్తే నేరుగా ఎమ్మెల్యే అయ్యారు. ఆయనెప్పుడైనా సర్పంచ్‌గా గెలిచారా? జడ్పీటీసీగా గెలిచారా? రాజకీయాల్లోని కష్టనష్టాలు, ఒడిదుడుకులు ఆయనకు ఎలా తెలుస్తాయి?" అని జగ్గారెడ్డి నిలదీశారు. కేటీఆర్ నోరు తెరిస్తే అబద్ధాలు చెబుతున్నారని, కాంగ్రెస్ నేతలను "గాడిదలు" అంటూ విమర్శిస్తే సహించేది లేదని హెచ్చరించారు. "మీరు మమ్మల్ని ఒక మాట అంటే మేము పది మాటలు అంటాం. మీరు ముఖ్యమంత్రిని దూషించడం ఆపేస్తే, మేము కూడా ప్రతి విమర్శలు ఆపేస్తాం" అని స్పష్టం చేశారు. 18 నెలలు అధికారం లేకపోయేసరికి కేటీఆర్ గట్టున పడ్డ చేపలా కొట్టుకుంటున్నారని జగ్గారెడ్డి విమర్శించారు. సోదరి కవిత అరెస్టు వ్యవహారంతో ఆయన తీవ్ర ఒత్తిడిలో ఉన్నారని, అందుకే తరచూ విదేశీ పర్యటనలకు వెళుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్‌ను విమర్శించే ముందు కేటీఆర్ బాగా అధ్యయనం చేయాలని సూచించారు. కేటీఆర్ ఈ మధ్య తెలంగాణ లో ఉండటం లేదు నెలకోసారి విదేశాల్లో ఉంటున్నాడు నెలలో పది రోజులు ఇక్కడ... 20 రోజులు విదేశాల్లో ఉంటాడు కాబట్టి రేవంత్ షెడ్యూల్ తెలియదు అని చెప్పారు.. విదేశాల్లో తిరిగే కేటీఆర్‌కి.. రేవంత్ ఏం చేస్తున్నది ఎందుకు తెలుస్తుంది. ఢిల్లీకి ఎందుకు పోతారో అనే ఇంగిత జ్ఞానం లేదా..? కేటీఆర్ అని ప్రశ్నించారు. ఎరువులు.. నిధుల కోసం..నీళ్ల పంచాయతీ కోసం ఢిల్లీ పోయాడు రేవంత్. కేసీఆర్ కుటుంబం ఢిల్లీకి లిక్కర్ దందా కోసం పోయారు అని పేర్కొన్నారు. కాంగ్రెస్ కి పుట్టినిల్లు ఢిల్లీ.. మీ లాగా మాది గల్లి పార్టీ కాదు కదా?కేటీఆర్..నీ స్ట్రోక్ ల లొల్లి మాకెందుకు రుద్దుతున్నావు కేటీఆర్.. కేసీఆర్ కోటా లో డైరెక్ట్ ఎ ఐయిపోయావు, రాజకీయ ఒడిదుడుకులు నీకేం తెలుసు..? అని ప్రశ్నించారు. మేము సతతం నడవడం లేదు.. మీరు తిడితే మేము తిడతం రేవంత్ నీ గోకుడు ఎందుకు తన్నించుకోవడం ఎందుకు..?తిట్ల పురాణం మీదే.. మీరు ఒకటి అంటే మీరు పది అంటున్నాం. అమెరికాలో చదివి.. పదేళ్ల మంత్రి అయినవి చర్చ అసెంబ్లీ లో చేయాలా..? కల్లు కాంపౌండ్ లోకి రా అంటే ఎట్లా ..? అని ప్రశ్నించారు. వెయ్యి కోట్లు... పక్క రాష్ట్రాల ఎన్నికల్లో పంపింది కేసీఆర్ కుటుంబం దాని గురించి మాట్లాడే హక్కు కేటీఆర్ కి లేదు పేర్కొన్నారు. నువ్వు బూతులు మాట్లాడటం బంద్ చెయ్.. రేవంత్ కూడా బంద్ చేస్తారు ఈ విషయంలో మా లైన్ క్లియర్‌గా ఉన్నాం. 18 నెలలు పవర్ లేకుండా పోయే సరికి.. నీళ్లలో చేప ఒడ్డున పడ్డట్టు గిల గిల కొట్టుకుంటున్నాడు. మాజీ డీజీపీ మహేందర్ రెడ్డి నాపై నిఘా ఇంటార్జి పోలీసుల నిఘా లో తేలింది అప్పుడే తప్పు..ఆస్తులు లేవు అని తేల్చారు భూముల పంచాయతీ ఉంది అని అప్పటి కలెక్టర్ రొనాల్డ్ రాస్ ను విచారణ చేయించారు ఎక్కడ దొరక్క... పాస్ పోర్ట్ కేసు పెట్టారు. రేవంత్..నాకన్నా ఆరు నెలల క్రితమే నిన్ను అరెస్ట్ చేస్తారు జగ్గన్న అని చెప్పారు. పాస్ పోర్ట్ కేసులో కేసీఆర్ కుటుంబమే మూలం. కేటీఆర్ సెకండ్ బెంచ్ స్టూడెంట్ కేసీఆర్..రేవంత్ ఫస్ట్ బెంచ్ స్టూడెంట్ లు..కేటీఆర్ సవాల్ విసిరి చర్చకు రా...అంటే రేవంతను నేను ఒప్పిస్తా, కేటీఆర్..హరీష్ లు ఏ క్లబ్ కి రమ్మన్నా.. నేను వస్తా, నువ్వు సెకండ్ బెంచ్ .. నేను సెకండ్ బెంచ్ స్టూడెంట్స్.. మనం మనం చూసుకుందాం అని సవాల్ విసిరారు.



## బ్యూటిఫుల్‌చట్టంతో వీసాఫీజులు మరింత భారం!

**న్యూఢిల్లీ, జూలై 8:** వస్తువుల్లో కొత్త వ్యయనియంత్రణలు, వీసా ఫీజులను పెంచే లక్ష్యంతో అమెరికా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన 'వన్ బిగ్ బ్యూటిఫుల్ బిల్లు' చట్టరూపం దాల్చిన సంగతి తెలిసిందే. దీనిద్వారా వీసా దరఖాస్తుదారులపై అదనపు భారం పడుతున్నట్లు తెలుస్తోంది.ముఖ్యంగా నాన్ ఇమ్మిగ్రెంట్లకు కొత్తగా వీసా ఇంటిగ్రిటీఫీజును డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ తప్పనిసరిచేసింది. అలాగే 2026 నుంచి ఈ మొత్తం మరింతపెంచేలా నిబంధనలు వస్తున్నాయి. ఇమ్మిగ్రేషన్ నస్ట ప్రొగామెనిచేసేకలను చూస్తే నాన్ ఇమ్మిగ్రెంట్ వీసా జారీచేసే సమయంలో వీసా ఇంటిగ్రిటీ ఫీజు కింద 250 డాలర్లు విధిగా చెల్లించాలి. భవిష్యత్తులో ఈరుసుం పెంచే అధికారం డిహెచ్ఎస్‌కు దఖలుపరిచారు. వినియోగదారులధరలసూచీ ఆధారంగా 2026నుంచి ఏటా దీన్ని పెంచుకోవచ్చు. ఎట్టిపరిస్థితుల్లోను ఫీజునురద్దు చేయడం, తగ్గించడం కానీ వీలుపడదు. కొన్ని పరిమితులకు లోబడి డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోమ్‌ల్యాండ్ మినహాయింపు ఇవ్వవచ్చు. వీసాదారుడు నిబంధనలన్నీ పాటించాలి. ఐ-94 గడువుముగిసే ఐదురోజులకంటే ముందు అమెరికాను వీడేవారికి. ఐ-94 గడువుకంటే ముందే చట్టపరంగా కొనసాగింపు శాశ్వత నివాస అనుమతి లభించినవారికి మాత్రమే వీసా ఇంటిగ్రిటీఫీజురీఫండ్ అవకాశం ఉంటుంది. ఈ పెంపువల్ల అమెరికాలో చదువులు,ఉద్యోగంకోసంవచ్చేవారిపై ఎక్కువ భారం పడుతుంది. అంతర్జాతీయ విద్యార్థులు, సాంకేతిక నిపుణులు, టూరిస్టులు హెచ్‌వన్‌బి వీసాపై వచ్చేఉద్యోగులకు భారంపెరుగుతుంది. వీసా ఇంటిగ్రిటీఫీజుతోపాటు ఐ-94 ఇఎస్‌టిఎ,ఇవియుఎస్‌ఫీజులుకూడా పెరుగుతాయి. శరణార్థులుకొత్తగా రెన్యువల్‌కోసం దరఖాస్తుచేసుకుంటే వారిపైనా ఈ వీసారుసుం భారం ఎక్కువవుతుందని అంచనా.

## నూతన క్రిమినల్ చట్టాల అమలు తీరుతెన్నులపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి భేటీ



నూతన క్రిమినల్ చట్టాల అమలుపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ భేటీ అయిన దృశ్యం. చిత్రంలో సీఎస్ సెక్రటరీ రామకృష్ణ రావు, డిజిపి జితేందర్ తదితరులున్నారు.

**హైదరాబాద్, జూలై 8, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా ఏడాది క్రితం అమల్లో వచ్చిన నూతన క్రిమినల్ చట్టాలు తెలంగాణలో ఏ విధంగా అమలవుతున్నాయనే దానిని పరిశీలించేందుకు కేంద్ర హోం శాఖ ప్రత్యేక ప్రతినిధుల బృందం మంగళవారం నాడు హైదరాబాద్‌కు విచ్చేసింది. ఈ సందర్భంగా ఈ బృందం రాష్ట్ర ఉన్నతాధికారులతో భేటీ అయ్యింది. బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్‌లో జరిగిన ఈ భేటీలో కేంద్ర హోం శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ రామకృష్ణ రావు, హోం శాఖ ప్రత్యేక కార్యదర్శి రవి గుప్తా, డిజిపి జితేందర్, సిటీ కొత్వాల్ ఆనంద్ సహా కేంద్ర హోంశాఖ తరపున జాయింట్ సెక్రటరీలు, ఎన్ఎఆర్‌బి, బిపిఆర్ అండ్ బి, ఎన్‌సి విభాగాల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రహోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ రాష్ట్రంలో నూతన క్రిమినల్ చట్టాల అమలుగురించి డిజిపి జితేందర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఐపిసిలో స్థానంలో వచ్చిన కొత్త చట్టాల అమలులో ఎక్కడా ఇబ్బందులు లేకుండాచూడాలని ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ఉన్నతాధికారులను కోరారు. అనంతరం డిజిపి జితేందర్ మాట్లాడుతూ రాష్ట్రంలో నూతన క్రిమినల్ చట్టాల అమలు పక్కాగా జరుగుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఆయన అందించారు. దీంతో పాటు తెలంగాణ పోలీసులు ఇటీవల కాల ంలో సాధించిన విజయాలను డిజిపి కేంద్ర హోం శాఖ ప్రతినిధుల బృందానికి వివరించారు. దీంతో పాటు రాష్ట్ర పోలీసు కేడర్‌కు సంబంధించిన వివరాలు శాంతి భద్రతల నిర్వహణ, ఇటీవల కాలంలో భద్రతకు సంబంధించి పలు అంశాలలో పోలీసు శాఖకు ఎదురైన సవాళ్లను ఎలాఅధిగమించామనే దానిపైనా డిజిపి జితేందర్ వివరించారు.

# నేను స్పందించేత స్థాయి కెటిఆర్‌కు లేదు

## 15లోగా జిల్లా అధ్యక్షుల నియామకం చేస్తాం

## గాంధీభవన్‌లో మీడియాతో మహేశ్‌కుమార్ గౌడ్ చిట్‌చాట్



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** తాను స్పందించేంత స్థాయి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు లేదని టీపిసిసి చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. మంగళవారం తనను కలిసిన విలేఖరులతో ఇష్టాగోష్టిగా ఆయన మాట్లాడుతూ.. నీటి పారుదల ప్రాజెక్టుల అంశంపై బహిరంగంగా చర్చించేందుకు రావాలంటూ కెటిఆర్ సోమాజిగుడా ప్రెస్ క్లబ్‌లో కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసిరి వేచి చూడడం గురించి ప్రశ్నించగా, తాను స్పందించేంత గొప్ప నాయకుడు కెటిఆర్ కాదని అన్నారు. బిఆర్ఎస్ అధినేత, కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నిర్బంధ పాలన చేశారని మహేష్ కుమార్ విమర్శించారు. కెసిఆర్ హయాంలో కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిని ఎండగట్టేందుకు అప్పట్లో తాము ప్రయత్నిస్తే అరెస్టు చేయించారని ఆయన గుర్తు చేశారు. తమ ప్రభుత్వ హయాంలో నిర్బంధ అరెస్టులు లేవని ఆయన అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులను ఈ నెల 15వ తేదీలోగా నియమించేందుకు కృషి చేస్తున్నామని ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. జిల్లా పార్టీ కమిటీలను త్వరితగతిన ఏర్పాటు చేసేందుకే జిల్లా ఇన్‌ఛార్జ్‌లను నియమించినట్లు ఆయన మంగళవారం తనను కలిసిన విలేఖరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ అన్నారు. ఈ నెలాఖరులోగా అన్ని జిల్లాల కమిటీలను పూర్తి స్థాయిలో నియామకం చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. బిసిలకు నలభై రెండు శాతం రిజర్వేషన్లు కల్పించిన తర్వాతే ఎన్నికలకు వెళ్లాలన్నది తమ ఆలోచన అని ఆయన చెప్పారు. దీనిపై న్యాయ నిపుణుల సలహాలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చేసిన వ్యాఖ్యలపై పార్టీ క్రమశిక్షణా కమిటీ విచారణలో ఉంది కాబట్టి తాను ఇప్పుడేమీ మాట్లాడలేనని అన్నారు. తీన్మార్ మల్లన్న కులగణన పత్రాలు తగులబెట్టిన అంశం, అనిరుధ్ రెడ్డి మాట్లాడిన అంశం వేర్వేరు అని ఆయన వివరించారు. కాంగ్రెస్‌లో స్వేచ్ఛ ఎక్కువ కాబట్టి మాట్లాడుతున్నారని, నిరసనలు వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. ఆపరేషన్ ఆకర్ష్ లైవ్‌లో ఉందన్నారు. అసెంబ్లీ సీట్లు పెరుగుతాయని ఆశిస్తున్నామని, దీంతో మహిళల సీట్లూ పెరుగుతాయన ఆయన చెప్పారు. మంత్రి పదవుల అంశం తన పరిధిలో లేదని, రాజకీయాల్లో ఒక్కోసారి జూనియర్లకు ముందుగా అవకాశాలు లభిస్తుంటాయని ఆయన తెలిపారు. సీనియర్లకు తమ పార్టీలో గౌరవం ఉందన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరిగే ఉప ఎన్నికల్లో తమ పార్టీ తప్పకుండా విజయం సాధిస్తుందని ఆయన ధీమాగా చెప్పారు. పది మంది సమర్థులైన అభ్యర్థులు తమకు ఉన్నందున, ఇక ఇతర పార్టీల నుంచి తీసుకోవాల్సిన అవసరం తమకు లేదన్నారు.

# కల్వకుర్తి మోటార్లు ఆన్ చేసి నీళ్లు విడుదల చేయడం బిఆర్ఎస్ విజయం

## బిఆర్ఎస్ నిలదీస్తే గాని కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక రాదా: హరీశ్‌రావు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** ఎట్టకేలకు కల్వకుర్తి మోటార్లు ఆన్ చేసి నీళ్లు విడుదల చేయడం బిఆర్ఎస్ విజయం, కెసిఆర్ విజయం అని మాజీ మంత్రి హరీష్ రావు వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ నిలదీస్తే గాని కాంగ్రెస్ ప్రభుత్వంలో కదలిక రాదా..తాము ప్రశ్నిస్తే తప్ప రైతుల నీటి సమస్యలు గుర్తు రావా..అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రశ్నల వర్షం కురిపించారు. రేవంత్‌రెడ్డి రైతుల నోరు కొడుతున్నారు.. కడుపు కొడుతున్నరు అంటే గాని ఆలోచన రాదా..లక్షలాదిగా రైతులతో తరలి వచ్చి మోటార్లు ఆన్ చేస్తామంటే గాని చలనం ఉండదా..? అని ప్రశ్నించారు. ఎగువ రాష్ట్రాల నుంచి వస్తున్న వరదను ఒడిసిపట్టాల్సింది పోయి, విడిచిపెట్టడం దుర్మార్గం అని మండిపడ్డారు. ఇకనైనా రాజకీయకక్ష సాధింపు చర్యలపై దృష్టి పెట్టడం మానేసి రైతాంగంపై దృష్టి సారించాలని హితవు పలికారు. కల్వకుర్తి వలే, కాళేశ్వరం మోటార్లు ఆన్ చేసి, రిజర్వాయర్లు నింపి పొలాలకు నీళ్లు మళ్లించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు. హరీష్ రావు ఉపాధి హామీ ఎపిఒలకు మూడు నెలలుగా జీతాలు చెల్లించకపోవడం శోచనీయం అని హరీష్‌రావు పేర్కొన్నారు. చేసిన పనికి వేతనాలు రాక ఉపాధి హామీ సిబ్బంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ కుటుంబ పోషణ భారమై సతమతమవుతుంటే ఈ ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరించడం దుర్మార్గం అని ఎక్స్ వేదికగా మండిపడ్డారు.కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యానికి మనోవేదనకు గురై ఉపాధి హామీ ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయే పరిస్థితి రావడం విచారకరం అని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు పారిశుధ్య కార్మికులకు కూడా వేతనాలు రాక గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసిందని అన్నారు. ఎన్నికల సమయంలో హామీలతో ఊదరగొట్టిన కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారు..? ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రభుత్వం తక్షణమే స్పందించి ఉపాధి హామీ ఎపిఒలు, పారిశుధ్య కార్మికుల పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని బిఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేశారు.

## క్రికెట్ అంపైర్ బిస్మిల్లా జన్ షిన్వారీ మృతి



**ముంబయి, జూలై 8:** అంతర్జాతీయ క్రికెట్ ప్రపంచంలో విషాదకర ఘటన చోటు చేసు కుంది. ఐసీసీ ప్యానెల్ అంపైర్‌గా సేవలందిస్తున్న బిస్మిల్లా జన్ షిన్వారీ (41) మంగళవారం కన్నుమూశారు. ఆఫ్ఘనిస్థాన్ కు చెందిన షిన్వారీ గత కొంతకాలంగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ క్రమంలో ఆయన ఆరోగ్యం మరింత విషమించడంతో తుదిశ్వాస విడిచినట్లు ఆఫ్ఘనిస్థాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) అధికారికంగా ఒక ప్రకటనలో వెల్లడించింది. 1984లో జన్మించిన షిన్వారీ, తన కెరీర్‌లో మొత్తం 60 అంతర్జాతీయ మ్యాచ్‌లకు అంపైర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. వీటిలో 34 వన్డేలు, 26 టీ20 మ్యాచ్‌లు ఉన్నాయి. మైదానంలోనే కాకుండా టీవీ అంపైర్‌గా కూడా ఆయన తన సేవలు అందించారు. షిన్వారీ అకాల మరణం పట్ల పలువురు ప్రస్తుత, మాజీ క్రికెటర్లు, క్రీడా ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా తమ ప్రగాఢ సంతాపం తెలియజేస్తున్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నారు. చిన్న వయసులోనే ఒక మంచి అంపైర్‌ను కోల్పోవడం క్రికెట్ ప్రపంచానికి తీరని లోటని పలువురు వ్యాఖ్యానించారు.

## కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం

### ఎపి సిఎం చంద్రబాబు

**విజయవాడ,జూలై8,ప్రభాతవార్తప్రతినిధి:** కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డిపై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరమని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. మహిళలను అవమానపరచడం, వ్యక్తిత్వ హననానికి పాల్పడటం ఆ పార్టీ డీఎన్ఏలోనే ఉందంటూ వైసీపీ నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం అమరావతిలో సీఎం నారా చంద్రబాబు నాయుడు విలేకర్లతో మాట్లాడుతూ.. ప్రశాంతి రెడ్డిపై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నానన్నారు. వైసీపీ నేతల తీరులో మార్పు రావడం లేదని ఆయన మండిపడ్డారు. మహిళలను దూషించడం, బూతులు తిట్టడం, కించపరచడం అనేది ఆ పార్టీ రాజకీయ సిద్ధాంతంగా పెట్టుకుందని విమర్శించారు. పార్టీ ఘోర ఓటమికి ఇలాంటి పోకడలు ఒక కారణమని తెలిసినా.. వారి సహజ గుణంలో మాత్రం మార్పు రావడం లేదన్నారు. చెల్లి పుట్టుకపైనా వ్యాఖ్యలు చేసిన వారి నాయకత్వంలో పని చేస్తోన్న నేతలు అంతే దారుణంగా, అసహ్యంగా మాట్లాడుతూ వారి నీచ సంస్కృతిని చాటుకుంటున్నారని వైసీపీ నేతలపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. మహిళలపై వ్యక్తిగత విమర్శలు చేసి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రవర్తిస్తున్న వీరు మనుషులేనా? అని ప్రశ్నించారు. ఇది రాజకీయమా? అంటూ వైసీపీ నేతల వ్యవహరిస్తున్న తీరుపై సందేహం వ్యక్తం చేశారు. ఇంత కండ కావరం పనికిరాదు,ఇంత సంస్కారం హీనంగా వ్యవహరిస్తారా ?మహిళలు, మహిళా నాయకుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా ప్రణాళికా బద్ధంగా వైసీపీ చేస్తున్న కుట్రలను ప్రతి పౌరుడు గమనించాలని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు సూచించారు. మహిళల పట్ల అనుచితంగా ప్రవర్తించిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు ఉంటాయని ఆయన స్పష్టం చేశారు.

# మరో రికార్డుకు సిద్ధమైన బండి సంజయ్

## నేటి నుండి మోడీ కానుకగా 20 వేల సైకిళ్ల పంపిణీ షురూ

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కరీంనగర్ వేదికగా మరో మహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదివే విద్యార్థిని, విద్యార్థులందరికీ రేపటి నుండి ఉచితంగా సైకిళ్లను అందించనున్నారు. మొత్తం 20 వేల సైకిళ్లను పంపిణీ చేయాలని బండి సంజయ్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ మేరకు బ్రాండెడ్ సైకిల్ కంపెనీకి ఆర్డర్ కూడా ఇచ్చారు. సీఎస్సార్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బిలిటీ) ఫండ్స్ ను చెల్లించి ఈ మొత్తం సైకిళ్లను కొనుగోలు చేశారు. ఒక ప్రజా ప్రతినిధి తన నియోజకవర్గ పరిధిలో 20 వేల సైకిళ్లను పంపిణీ చేయడం ఇప్పటి వరకు ఎక్కడా జరగలేదు. ఆ క్రెడిట్ బండి సంజయ్ కే దక్కబోతోంది. ఈ సైకిళ్ల పంపిణీ ప్రారంభ కార్యక్రమానికి కరీంనగర్ అంబేద్కర్ స్టేడియం వేదిక కాబోతోంది. ఇందుకోసం స్టేడియంలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. తొలుత కరీంనగర్ టౌన్ లో టెన్త్ చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు బండి సంజయ్ రేపు ఉదయం 11 గంటలకు తన చేతుల మీదుగా సైకిళ్లను అందజేయబోతున్నారు. మొత్తం 21 స్టాల్స్ ను ఏర్పాటు చేసి రంగు రంగుల బెలూన్స్, షామియానాలతో వాటిని అందంగా ముస్తాబు చేశారు. ఈ కార్యక్రమానికి కేంద్ర మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ పమేల సత్పతి, నగర పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంసహా పలువురు ఉన్నతాధికారులు,జిల్లా విద్యాశాఖ అధికారులు హాజరుకానున్నారు. మరోవైపు ప్రతి విద్యార్థికి ఈ సైకిల్ ను అందించాలనే ఉద్దేశంతో సైకిళ్ల పంపిణీ బాధ్యతను జిల్లా కలెక్టర్‌కు అప్పగించారు. కలెక్టర్ ద్వారా డీఈఓ, ఎంఈవో స్కూళ్ల వారీగా ఎంత మంది విద్యార్థులున్నారనే జాబితాను సిద్ధం చేసిన అధికారులు ఆ మేరకు సైకిళ్లను ఆయా అసెంబ్లీ నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీగా సైకిళ్లను పంపిణీ చేయనున్నారు. నెల రోజుల్లో ఈ సైకిళ్ల పంపిణీ పూర్తి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో టెన్త్ చదువుకునే ప్రతి విద్యార్థినీ, విద్యార్థికి ఈ సైకిల్ ను అందజేయాలని కలెక్టర్‌ను కోరారు. టెన్త్ విద్యార్థుల కష్టాలను తొలగించేందుకే సైకిళ్ల పంపిణీ. ప్రభుత్వ స్కూళ్లలో చదువుకునే పిల్లలు పేద కుటుంబం నుండి వచ్చిన వాళ్లే ఉంటారనే విషయం తెలిసిందే. తమ ఇంటి నుండి స్కూల్‌దాకా వెళ్లడానికి తగిన రవాణా సౌకర్యాల్లేక, ఆటోలు, బస్సులు వెళ్లే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా టెన్త్ క్లాస్ విషయానికొచ్చే సరికి స్కూల్ వేళలు ముగిసిన తరువాత కూడా స్పెషల్ క్లాస్ లకు హాజరు కావాల్సి ఉంటుంది. దీనివల్ల పొద్దుపోయేదాకా స్కూళ్లోనే ఉండాల్సి వస్తుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని టెన్త్ బాలబాలికలకు రవాణా సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారనే విషయం బండి సంజయ్ కుమార్ దృష్టికి వచ్చింది. వేల రూపాయలు వెచ్చించి సైకిళ్లు కొనే స్తోమత ప్రభుత్వ స్కూళ్లలో చదివే పిల్లలకు లేదని గ్రహించిన బండి సంజయ్ సీఎస్సార్ ఫండ్స్‌ను సేకరించి 20 వేల సైకిళ్లను కొనుగోలు చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ కానుక పేరుతో ప్రతి ఒక్కరినీ సైకిళ్లను పంపిణీ చేసేందుకు సిద్ధమయ్యారు.

## కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకే 17న రైల్ రోకో

### ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన కల్వకుంట్ల కవిత



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే ఒక్క రైలు చక్రాన్ని కూడా ముందుకు కదలనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు,బిఆర్ఎస్ ఎంఎల్‌సి కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. తెలంగాణలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్,బిజెపి పార్టీలు చేస్తున్న మోసానికి నిరసనగా, బిసి బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఈ నెల 17వ తేదీన రైల్ రోకో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. బిసి రిజర్వేషన్ల బిల్లుపై మంగళవారం ఢిల్లీలోని కాన్‌స్టిట్యూషన్ క్లబ్‌లో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో కవిత మాట్లాడారు. రైల్ రోకో కేవలం ట్రైలర్ మాత్రమేనని, బిల్లును ఆమోదించకపోతే భవిష్యత్తులో నిరవధికంగా రైల్ రోకోను నిర్వహిస్తామని హెచ్చరించారు. రైల్ రోకోకు మద్దతు, బిసి రిజర్వేషన్ల అమలు విషయంలో అన్ని పార్టీలకు లేఖలు రాస్తానని తెలిపారు. తాము ఓబిసిని అని చెప్పుకునే ప్రధాని మోదీకి ఆ వర్గాలకు న్యాయం చేసే అవకాశం లభించిందని, తెలంగాణ అసెంబ్లీ పాస్ చేసిన బిల్లులను రాష్ట్రపతి ఆమోదించేలా చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. తమిళనాడులో అమలవుతున్న 69 శాతం రిజర్వేషన్ల తరహాలో తెలంగాణ బిసి బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్ లో చేర్చాలని ప్రతిపాదించారు.

## జాతీయ చేనేత పురస్కారానికి రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్,జూలై8:** కేంద్ర చేనేత, జౌళి మంత్రిత్వ శాఖ ప్రకటించిన జాతీయ చేనేత పురస్కారానికి ఎంపికైన చేనేత కార్మికులకురాష్ట్ర వ్యవసాయ, చేనేత జౌళిశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 19 మంది చేనేత కార్మికులు ఎంపిక కాగా, అందులో మన తెలంగాణ నుంచి ఇద్దరికి పురస్కారాలు దక్కడం గర్వకారణమన్నారు. మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొంటూ యాదాద్రి జిల్లా, సంస్థాన్ నారాయణపురం మండలం, పుట్టపాక గ్రామానికి చెందిన గజం నర్మదకు చేనేత వస్త్రాల మార్కెటింగ్ విభాగంలో రూ.8 కోట్ల టర్నోవర్ చేసినందుకు, సహజ సిద్ధ రంగులను ఉపయోగించి జీఐ ట్యాగ్ పొందిన తేలియా రుమాల్ డిజైన్ తో పట్టుచీరను నేసిన గూడ పవన్ కు జాతీయ చేనేత అవార్డుకు ఎంపికయి చేనేత రంగంలో ఆదర్శంగా నిలిచారని ప్రశంసించారు.చేనేత కార్మికులకు రాష్ట్రప్రభుత్వం అన్ని రకాలుగా చేయూతనివ్వడంతో పాటు వారి సంక్షేమం కోసం మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇటీవల చేనేత కార్మికుల కోసం రుణమాఫీ ప్రకటించి రూ.33 కోట్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. తెలంగాణ చేనేత ఉత్పత్తులకు దేశీయ, అంతర్జాతీయ మార్కెట్లలో డిమాండ్ పెరగడం కోసం ప్రత్యేక లేబుల్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. చేనేత కార్మికుల సంక్షేమం కోసం తెలంగాణ నేతన్నకు భరోసా పథకాన్ని అమలు చేసినట్లు వెల్లడించారు.

## జర్మనీ ప్రతినిధులతో సమావేశమైన కార్మికశాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి



**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త :** సెక్రటేరియట్‌లో మంగళవారంకార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిని కలిశారు జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులు.తెలంగాణ నర్సింగులకు జర్మనీలో ఉపాధి కల్పించే ట్రిపుల్ విన్ కార్యక్రమంపై చర్చించారు.నర్సులతో పాటుఐటీఐ విద్యార్థులకు జర్మనీలో ఉపాధికల్పించాలని వారికి సూచించారు.మంత్రి వివేక్ వెంకటస్వామినేటి నుంచి ఈ నెల17వరకు నర్సులకు బేగంపేటలో ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు.ఎంపికైన నర్సులకు జర్మనీలో ఉద్యోగం కల్పించనున్నారు.

## ముగిసిన ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్, సర్టిఫికెట్ వెరిఫికేషన్

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్, ఫార్మసీ కాలేజీల్లో ఇంజనీరింగ్‌తోపాటు అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహిస్తున్న ఎప్ సెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియలో భాగంగా మంగళవారంతో సర్టిఫికెట్ వెరిఫికేషన్ ముగిసింది. సర్టిఫికెట్ వెరిఫికేషన్ గడువు ముగిసే నాటికి 92,868 మంది సర్టిఫికెట్ వెరిఫికేషన్ పూర్తయింది. అయితే సోమవారంతోనే స్లాట్‌బుక్ చేసుకునే గడువు ముగియడంతో.. గడువు లోపుగా 97,533 మంది స్లాట్ బుక్ చేసుకున్నారు. ఆదివారం రాత్రి నుంచి వెబ్ ఆప్షన్లను ప్రారంభం కాగా.. ఇప్పటి వరకు(మంగళవారం సాయంత్రం 7 గంటలు) 48,726 మంది వెబ్ ఆప్షన్లు ఇచ్చారు.

## ఆలయ భూముల ఆక్రమణను అడ్డుకుంటే దాడి చేయడం హేయమైన చర్య: జెఎసి ఛైర్మన్ వి.లచ్చిరెడ్డి

**హైదరాబాద్,జులై 8, ప్రభాతవార్త :** భద్రాద్రి రామాలయ భూములు పురుషోత్తపట్నం (ఏపీ)లో కబ్జాకు గురవుతుండగా అడ్డుకున్న ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగుల జేఏసీ ఛైర్మన్, డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.లచ్చిరెడ్డి తీవ్రంగా ఖండించారు. దాడికి పాల్పడిన నింధితులను గుర్తించి వెంటనే అరెస్టు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈవో రమాదేవిపై జరిగిన దాడిని తెలంగాణ ఉద్యోగులపై జరిగిన దాడేనని డిప్యూటీ కలెక్టర్ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ, తెలంగాణ తహశీల్దార్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు ఎస్.రాములు, రమేష్ పాక, తెలంగాణ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షకార్యదర్శులు బాణాల రాంరెడ్డి, వి.భిక్షం పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు వేర్వేరు ప్రకటనలలో రమాదేవిపై మంగళవారం జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు.

## ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేసే వరకు పోరాటం

### ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ తీర్మానం

**హైదరాబాద్, జులై 8, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్స్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని భారతవిద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల చేసేంతవరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర వ్యాప్తంగాసమరశీల పోరాటాలకు సిద్ధమైనట్టు మంగళవారం జరిగిన రాష్ట్ర కమిటీ తీర్మానం చేసింది. సంఘం రాష్ట్ర అధ్యక్షులుశనిగారపు రజనీకాంత్ అధ్యక్షతన హైదరాబాద్ లో కమిటీ సమావేశం జరిగిందని నాగరాజు తెలిపారు.

# ఆగస్టులో 'టిఎన్ఐటి మీడియా అవార్డ్స్'

ది న్యూఇండియన్ టైమ్స్ విజువల్ మీడియా రంగంలో తనదైన ముద్ర వేసుకుంది. నేతృత్వంలో సీఈఓ రఘు భట్ ప్రతీసంవత్సరం టిఎన్ఐటి మీడియా అవార్డ్స్‌ను అత్యంత ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నారు. మీడియా పట్ల ఉన్న ప్యాషన్‌తో మొదలైన ఈ అవార్డ్స్ వేడుక... ఇప్పుడు సక్సెస్ ఫుల్‌గా 8వ సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. ఈ ఏడాది టిఎన్ఐటి మీడియా అవార్డ్స్ ఈవెంట్‌ని ఆగస్టు 23న బెంగళూరులోని ప్యాలెస్ గ్రౌండ్స్‌లో గ్రాండ్‌గా నిర్వహిస్తున్నాం. ఈ సందర్భంగా నిర్వాహకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో సిఈవో రఘు బట్ మాట్లాడుతూ, శుభలేఖ సుధాకర్‌కి, ఉత్తేజ్, మా తెలుగు జ్యూరీ ప్రభుకి హృదయపూర్వక ధన్యవాదాలు. ఈ అవార్డులను ప్రారంభించి ఇది ఎనిమిదవ సంవత్సరం. మలయాళం, తెలుగు, కన్నడ, తమిళ భాషల నుండి నామినేషన్లను స్వీకరిస్తున్నాం. ప్రతి మీడియా ఛానల్ మా టీంకు అప్లికేషన్లు సమర్పించమని కోరుతున్నాం. ఈ గొప్ప కార్యక్రమానికి మీ అందరి సహకారం కోరుతున్నాం. అందరికీ ధన్యవాదాలుఅన్నారు. మార్కెటింగ్ హెడ్ ఖుషీ మాట్లాడుతూ, రఘు విజన్‌తో సౌత్ ఇండియా మొత్తానికి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించాం. ప్రతి ఛానల్‌కు నామినేషన్ ఫారంలు పంపిస్తాం. వారు పూర్తి చేసి మాకు తిరిగిపంపాలి. తర్వాత జ్యూరీపరిశీలించి విజేతలను ఎంపిక చేస్తుంది. నటీనటులకు ఐఫా, సైమా లాంటి అవార్డ్స్ ఉన్నట్లే, మీడియాకి కూడా అంతే స్థాయిలో గుర్తింపు రావాలని మేము ఆశిస్తున్నాం. మీడియా రాత్రిపగలు కష్టపడుతూ సమాజానికి సమాచారం అందిస్తున్నారు. వారిని గుర్తించి గౌరవించడం గౌరవంగా భావిస్తున్నాం. ఈ ప్రయత్నానికి మీ అందరి మద్దతు కావాలి అన్నారు. జర్నలిస్ట్ ప్రభు మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. ఒకప్పుడు మీడియా అంటే కేవలం ప్రింట్‌మీడియానే. ఇప్పుడు టీవీ, వెబ్, యూట్యూబ్ ఇలా అనేక ప్లాట్‌ఫారాలుగా విస్తరించింది. మీడియాలో ప్రతి విభాగానికి ప్రత్యేకంగా అవార్డులు ఇవ్వాలన్న ఆలోచన చాలా ప్రత్యేకమైనది. గత ఏడు సంవత్సరాలుగా విజయవంతంగా ఈ అవార్డ్స్ నిర్వహిస్తూ, ఈఏడాది నాలుగు రాష్ట్రాల ని సమన్వయం చేస్తూ గ్రాండ్ ఈవెంట్ నిర్వహించడం గొప్ప విషయం.




# 'పోలీస్ వారి హెచ్చరిక' ట్రైలర్ లాంచ్

అభ్యుదయ దర్శకుడు బాబ్జీ దర్శకత్వంలో బెల్లి జనార్ధన్ నిర్మాతగా తూలికా తనిష్క్ క్రియేషన్స్ పతాకంలో రూపొందిన "పోలీస్ వారి హెచ్చరిక" ట్రైలర్‌ను ప్రముఖ సినీ పెద్దల సమక్షంలో లాంచ్ చేయడం జరిగింది. ఈ చిత్రానికి కిషన్ సాగర్, నళినీ కాంత్ సినిమాటోగ్రాఫర్స్‌గా పనిచేయగా గజ్వేల్ వేణు ఈ చిత్రానికి సంగీ తాన్ని అందించారు. శివ శర్వాణి ఈ చిత్రానికి ఎడిటింగ్ వర్క్ చేశారు. ఈ సందర్భంగా కేఎల్ దామోదర్ ప్రసాద్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మనమంతా ఇక్కడికి వచ్చామంటే కారణం బాబ్జి మీద ఉన్న గౌరవం. చిత్ర బృందం అందరికీ ఆల్ ద బెస్ట్. అలాగే ఆర్మీ నుండి వచ్చిన నిర్మాత జనార్ధన్‌తో కలిసి క్రమశిక్షణతో ఈ సినిమాను చేసి ఉంటారు అనుకుంటున్నాను. ఈ సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ, ఈ కార్యక్రమానికి వచ్చిన అందరికీ నమస్కారం. నేను ఈ ఈవెంట్‌కు బాబ్జి కోసం ఈ కార్యక్రమానికి వచ్చాను. నా ప్రతి పుట్టిన రోజుకు నన్ను విష్ చేసే సుధాకర్‌కి ధన్యవాదాలు. జనార్ధన్ గారికి ఈ సినిమాతో మంచి విజయం రావాలి అని కోరుకుంటున్నాను. సినిమా విజయం సాధించేందుకు మీడియా వారు అండగా నిలబడాలని కోరుకుంటున్నాను అన్నారు. నటుడు శుభలేఖ సుధాకర్ మాట్లాడుతూ, ఈ ట్రైలర్ లాంచ్ కార్యక్రమానికి వచ్చిన ప్రతి ఒక్కరికి నా నమస్కారం. సాధారణంగా చిన్ననాటి నుండి మనల్ని పెద్దవారు ఏదో ఒక విషయంలో హెచ్చరిస్తూ ఉంటారు. ఈ సినిమాకు అందరి ఆశీస్సులు ఉండాలి. సినిమా మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నాను అన్నారు. దర్శకుడు సముద్ర మాట్లాడుతూ, ఈ సినిమాకు ప్రేక్షకుల నుండి ఒక ఆదరణ లభిస్తుందని కోరుకుంటున్నాను. సినిమాలో చాలా మంచి ఆర్టిస్టులు నటించారు. మంచి కథతో త్వరలో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు బాబ్జి. జులై 18వ తేదీన ప్రేక్షకులుముందుకు రానుంది.







# కెజెఆర్, శ్రీదేవి హీరో హీరోయిన్లుగా 'కోర్ట్'

తెలుగు, తమిళ భాషల్లో 'గుర్తింపు' పేరుతో స్పోర్ట్స్ కోర్ట్ డ్రామాతో హీరోగా పరిచయమవుతోన్న కేజేఆర్ హీరోగా రెండో చిత్రం శ్రీకారం చుట్టుకుంది. చెన్నైలో ఈ చిత్రం పూజా కార్యక్రమాలు జరిగాయి. ఇటీవల మార్క్ ఆంటోనీ చిత్రాన్ని నిర్మించిన మినీ స్టూడియో సంస్థ ప్రొడక్షన్ నెం.15గా ఈ చిత్రాన్ని రూపొందిస్తోంది. తెలుగులో ఈ చిత్రాన్ని గంగా ఎంటర్ టైన్మెంట్స్ అందించనుంది. ప్రముఖ దర్శకుడు ప్రశాంత్ పాండ్య రాజన్ శిష్యుడైన రెగన్ స్టానిస్లాస్ ఈ చిత్రం ద్వారా దర్శకునిగా పరిచయం అవుతున్నారు. చిత్రీకరణ త్వరలోనే మొదలుకానుంది. కోర్ట్ చిత్రంతో మంచి పేరు తెచ్చుకున్న శ్రీదేవి ఇందులో హీరోయిన్‌గా నటించనున్నారు. అర్జున్ అశోకన్, సింగం పులి, జయప్రకాష్, హరీష్ కుమార్, పృధ్వి రాజ్, ఇందుమతి, అశ్విని. కె.కుమార్, అభిషేక్ జోసెఫ్ జార్జ్, అజువర్గీస్, శ్రీకాంత్ మురళి తదితరులు ఈ చిత్ర ప్రధాన తారాగణం. ఈ చిత్రానికి సంగీతం: జిబ్రాన్, ఛాయాగ్రహణం: పి.వి.శంకర్, నిర్మాత: ఎస్.వినోద్ కుమార్.




# 31న 'కింగ్‌డమ్' విడుదల

తెలుగులో రూపొందుతోన్న భారీ చిత్రాల్లో కింగ్‌డమ్ ఒకటి. విజయ్ దేవరకొండ, సత్యదేవ్, భాగ్యశ్రీ బోర్సే ప్రధాన పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి గౌతమ్ తిన్ననూరి దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగ వంశీ, సాయి సౌజన్య ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. కింగ్‌డమ్‌పై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, హృదయం లోపల గీతం విశేషంగా ఆకట్టుకున్నాయి. కింగ్‌డమ్ విడుదల కోసం విజయ్ అభిమానులతో పాటు, సినీ ప్రియులంతా ఎంతగానో ఎదురుచూస్తున్నారు. తాజాగా చిత్ర విడుదల తేదీని ప్రకటించారు నిర్మాతలు. కింగ్‌డమ్ చిత్రం జూలై 31, 2025న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుందని చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ సందర్భంగా ఒక ప్రోమోను విడుదల చేసింది. ఈ ప్రోమో సినిమాపై అంచనాలను రెట్టింపు చేసేలా ఉంది. యాక్షన్, హీరోయిజం, డ్రామాల సమ్మేళనంగా శక్తివంతమైన చిత్రంగా కింగ్‌డమ్ రూపుదిద్దుకుంటోంది. ప్రోమోలో యుద్ధ సన్నివేశాలు, భావోద్వేగాలు, విజువల్స్ కట్టిపడేశాయి. మునుపెన్నడూ లేని విధంగా అద్భుతమైన సినిమాటిక్ దృశ్యాన్ని ప్రేక్షకులకు అందించబోతున్నట్లు ఈ ప్రోమో హామీ ఇస్తోంది. ఈ అద్భుతమైన చిత్రాన్ని వెండితెరపై చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్న అభిమానులకు కొత్త విడుదల తేదీ ప్రకటన ఎంతో ఉపశమనాన్ని, ఉత్సాహాన్ని ఇచ్చిందని చెప్పవచ్చు. అభిమానుల అంచనాలకు మించేచిత్రాన్ని అందించాలనే ఏకైక లక్ష్యంతో కింగ్‌డమ్ కోసం చిత్ర బృందం అదనపు సమయాన్ని కేటాయిస్తోంది. కొత్త విడుదల తేదీ ప్రకటన సందర్భంగా నిర్మాతలు స్పందిస్తూ, కింగ్‌డమ్ కేవలం సినిమా కాదు.. ఇది మేము ఎంతో మక్కువతో నిర్మించిన ఒక గొప్ప ప్రపంచం. ప్రతి ఫ్రేమ్ మరపురానిదిగా ఉండాలని మేము కోరుకున్నాము. జులై 31న ఈ చిత్రం బాక్సాఫీస్ తుఫానుకు నాంది పలుకుతుంది అన్నారు. కింగ్‌డమ్ రిలీజ్ డేట్ ప్రోమో ఇప్పటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. అద్భుతమైన విజువల్స్, సంగీతంతో రూపొందిన ఈ ప్రోమో అభిమానుల ప్రశంసలు అందుకుంటోంది. ప్రతిభగల దర్శకుడు గౌతమ్ తిన్ననూరి కింగ్‌డమ్ కోసం అద్భుతమైన కథను ఎంచుకున్నారు. ఆ అద్భుతమైన కథను, అంతే అద్భుతంగా తెరపైకి తీసుకొచ్చి ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించడానికి సిద్ధమవుతున్నారు. కింగ్‌డమ్ చిత్రానికి ప్రతిభగల సాంకేతిక బృందం పని చేస్తోంది. సంగీత సంచలనం అనిరుధ్ రవిచందర్ సంగీతం సమకూరుస్తున్నారు. జోమోన్ టి. జాన్ మరియు గిరీష్ గంగాధరన్ ఛాయాగ్రహణం అత్యున్నత స్థాయిలో ఉండనుంది. జాతీయ అవార్డు గ్రహీత నవీన్ నూలి ఈ చిత్ర ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. జూలై 31న ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదల కానుంది.



# 'కాంతార: చాప్టర్ 1' పోస్టర్ రిలీజ్

2022లో విడుదలైన కాంతార సినిమా ఇండియన్ సినిమా పరంగా సరికొత్త దిశగా అడుగు వేసింది. సంవత్సరంలోనే అతిపెద్ద స్లీపర్ హిట్‌గా నిలిచిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించింది. పాన్‌ఇండియా లెవెల్లో భారీగా విజయం సాధించి, కొత్త బంచ్‌మార్క్స్ క్రియేట్ చేసింది. కేజీఎఫ్, సలార్, కాంతార లాంటి బ్లాక్‌బస్టర్స్ ఇచ్చిన హోంబలే ఫిలింస్‌కి ఇది ఇంకో గొప్ప మైలురాయి అయ్యింది. ఇప్పుడు అదే సినిమాకి ప్రీక్వెల్‌గా రాబోతున్న కాంతార: చాప్టర్1 పై భారీ అంచనాలు నెలకొన్నాయి. రిషబ్ శెట్టి ఎప్పుడూ చూడని థ్రిల్లింగ్ అవతార్‌లో ఉన్న పోస్టర్ ఇప్పటికే ప్రేక్షకులలో సంచలనం సృష్టించింది. ఇప్పుడు, రిషబ్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ కొత్త పోస్టర్‌ను విడుదల చేసి, షూటింగ్ పూర్తయినట్లు అనౌన్స్ చేశారు. లక్షలాది మందిని అలరించిన మాస్టర్ పీస్ కాంతార: చాప్టర్ 1 ప్రీక్వెల్ షూటింగ్ పూర్తి చేసుకుంది. కొత్తగా విడుదలైన పోస్టర్ ఉత్సాహాన్ని మరింత పెంచింది. రిషబ్ శెట్టి, అతని అభిమానులకు ఇది పర్ఫెక్ట్ బర్త్ డే గిఫ్ట్. కాంతార: చాప్టర్ 1 లక్షలాది మందిని అలరించిన లెజెండ్ మూలాలకు ఆడియన్స్‌ని తీసుకెళుతుంది. కొత్త పోస్టర్‌ను మేకర్స్ సోషల్‌నే షేర్ చేస్తూ.. కాంతారా లక్షలాది మందిని కదిలించిన మాస్టర్ పీస్ కి ప్రీక్వెల్. లెజెండ్ వెనుక ఉన్న ట్రైల్‌బ్లేజింగ్ ఎనర్జీ రిషబ్ శెట్టికి పుట్టినరోజు శుభాకాంక్షలు. డివైన్ సినిమాటిక్ విజువల్ వండర్ మోస్ట్ అవైటెడ్ ప్రీక్వెల్... కాంతార చాప్టర్ 1 అక్టోబర్ 2, 2025న ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్ .. అని పోస్ట్ చేశారు. మేకర్స్ విడుదలను అనౌన్స్ చేయడంతో సినిమా కొత్త పోస్టర్ కాంతారా: చాప్టర్1 చుట్టూ ఉన్న ఉత్సాహం మరింత పెరిగింది. హోంబాలే ఫిల్మ్స్ విజన్, రిషబ్ శెట్టి అంకితభావం, ఫస్ట్ చాప్టర్ లెగసీతో ఈ చిత్రం మరో సినిమాటిక్ మైలురాయిగా మారే దిశగా సాగుతోంది. 2022లో వచ్చిన ఈ మాస్టర్ పీస్ లెగసీని ముందుకు తీసుకెళ్లడంలో హోంబాలే ఫిల్మ్స్ ఎక్కడ రాజీపడటం లేదు. కాంతారా చాప్టర్1 కోసం జాతీయ, అంతర్జాతీయ టెక్నీషియన్స్‌తో యుద్ధ సన్నివేశాన్ని రూపొందించారు. 500 మందికి పైగా ఫైటర్లు, 3000 మంది జూనియర్ ఆర్టిస్టులు, 25 ఎకరాల్లో ఓ టౌన్ సెట్ వేసి, దాదాపు 45 నుంచి 50 రోజుల పాటు షూటింగ్ చేశారు. ఇది ఇండియన్ సినిమా చరిత్రలోనే ఒక బిగ్గెస్ట్ సీన్‌గా ఉండబోతోంది.



# ఆగస్టులో 'మిస్టర్ సోల్జర్'

ఈ చిత్ర నిర్మాణము కొరకు ముఖ్యంగా సహాయ సహకారం అందించిన మిలిటరీ గ్రామా మాజీ సైనికోధ్యుల సంఘం, మరియు మిలిటరీ మాధవరం గ్రామ సర్పంచ్, ప్రజలకు మా యొక్క కృతజ్ఞతలు. మా ఈ శ్రీ ధరణి ఆర్ట్స్ సంస్థ తరుపున అభినందనలు తెలియచేస్తున్నాము. మిస్టర్ సోల్జర్ (ఫ్రమ్ మిలటరీ మాధవరం) సెన్సార్ పూర్తి చేసుకొని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉభయ రాష్ట్రాలలో ఆగస్టు 2 వ వారంలో విడుదలకు సిద్దంగా ఉన్నందున మేము ఎంతో గర్వపడుచున్నాము. మిస్టర్ సోల్జర్ సినిమా కథా సారాన్ని క్లుప్తంగా మా ప్రేక్షకులకు వివరిస్తూ మీ ముందుకు మా సంస్థ వస్తున్నందుకు చాలా ఆనందిస్తున్నాము. భారత దేశం రాజధాని ఢిల్లీలో ఎంతో ఘనమైన చరిత్ర కలిగిన ఊరు ఈ మిలిటరీ మాధవరం గ్రామం. ఈ గ్రామం నుంచి మొదటి, రెండవ ప్రపంచ ముద్దంలో సుమారు 2,000 మంది సైనికులు పాల్గొని దేశానికి ఎంతో సేవలను అందించి, సుమారు పదుల సంఖ్యలో ఆశువులు బాసారు. దేశ స్వతంత్రం అనంతరము దేశ రక్షణలో బాగంగా సుమారు 5000 మంది సైనికులు ప్రస్తుతము ఇండియన్ ఆర్మీ రక్షణ రంగంలో చేరి సేవలు అందిస్తున్నారు. 1970 వ సంవత్సరంలో మేజర్ రాజు అనే నిజాయితీ గల ఆర్మీ ఆఫీసర్ ఎంతోమంది శత్రువులను తుదముటించి యుద్ధరంగంలో, ఎన్నో పతకాలు పొంది ఉన్నారు. అలాంటి మేజర్ రాజు నిరాధార ఆరోపణలు ఎదుర్కొని, అవమానాలను భరించి భారతమాత సాక్షిగా కుటుంబ సమేతంగా ఆత్మహత్య చేసుకున్నారు. కానీ యీ నాటికి మేజర్ రాజు మిలట్రీ మాధవరం గ్రామంలో యువత ప్రేరణ పొందుతూ ప్రతి ఇంటి నుండి పదుల సంఖ్యలో ఇండియన్ ఆర్మీకి పంపిస్తుందని ఆ గ్రామ ప్రజలకు నమ్మకం. ఒక వేళ ఆకస్మిక యుద్ధం వస్తే దేశ రక్షణకు ప్రతి గ్రామం నుండి పదుల సంఖ్యలో సైనికులు ఇండియన్ ఆర్మీ లో చేరవలసిన సమయం ఆసన్నమైందని... కథాసారాంశంతో జరిగిన యదార్థ కథను ప్రేక్షకులకు అందిస్తున్నందుకు, శ్రీ ధరణి ఆర్ట్స్ సంస్థ తరుపున మాకు చాలా గర్వకారణంగా ఉంది. ఈ చిత్రాన్ని ప్రేక్షకులు వీక్షించి, ఆదరించి మా సంస్థ బృందాన్నీ ఆశీర్వదిస్తారని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నాము.



# 'మారెమ్మ' ఫస్ట్ లుక్ సూపర్బ్

మాస్ మహారాజా రవితేజ బ్రదర్ యాక్టర్ రఘు కుమారుడు యంగ్ చాప్ మాధవ్ రూరల్ రస్టిక్ మూవీ మారెమ్మతో హీరోగా సినిమాల్లోకి అడుగుపెడుతున్నారు. ఈ హైఆక్టేన్ ప్రాజెక్ట్‌ను మంచాల నాగరాజ్ దర్శకత్వం వహిస్తున్నారు. మోక్ష ఆర్ట్స్ బ్యానర్‌పై మయూర్ రెడ్డి బండారు తమ ప్రొడక్షన్ నంబర్ 1గా నిర్మిస్తున్నారు. మేకర్స్ ఈ చిత్రం ఇంపాక్ట్ ఫుల్ టైటిల్, అద్భుతమైన ఫస్ట్ లుక్ పోస్టర్ రెండింటినీ రిలీజ్ చేశారు. ఇది పవర్ ఫుల్ రూరల్ గ్రామీణ యాక్షన్ డ్రామాగా ఉంటుందని హామీ ఇస్తోంది. ఫస్ట్ లుక్ మాధవ్‌ను రూరల్ అవతార్‌లో పరిచయం చేస్తుంది.! చెక్డ్ షర్ట్, లుంగీ ధరించి, మెడలో క్యాజువల్‌గా చుట్టుకున్న టవల్‌తో, మాధవ్ రగ్గడ్ రూరల్ హీరోగా కనిపించారు. అతని చెదిరిన జుట్టు, గడ్డం ఆ పాత్రకు పర్ఫెక్ట్‌గా ఫిట్ అయ్యాయి. పోస్టర్ బ్యాక్ డ్రాప్ లో ఉంచబడిన ఒక గేదె, బలం, ఆధిపత్యాన్ని సూచిస్తుంది. మాధవ్ పొడవాటి కర్రను పట్టుకుని ఏదైనా సవాలును ఎదుర్కోవడానికి సిద్ధంగా వున్నట్లు కనిపించారు. పోస్టర్, టైటిల్ అదిరిపోయాయి. మాధవ్‌ను ఫెరోషియస్ రగ్గడ్ పాత్రలో ప్రజెంట్ చేయడానికి మంచాల నాగరాజ్ పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను రాశారు. మాధవ్ తన తొలి పాత్ర కోసం కంప్లీట్‌గా మేకోవర్ అయ్యారు. వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి, వి.ఎస్.రూప లక్ష్మి ముఖ్యమైన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రంలో మాధవ్ సరసన దీపా బాలు కథానాయికగా నటిస్తోంది. ఈ చిత్రానికి ప్రశాంత్ అంకిరెడ్డి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, ప్రశాంత్ ఆర్ విహారి సంగీతం అందిస్తున్నారు. దేవ్ రాథోడ్ ఎడిటర్, రాజ్‌కుమార్ మురుగేశన్ ఆర్ట్ డైరెక్టర్. తారాగణం: మాధవ్, దీపా బాలు, వినోద్ కుమార్, వికాస్ వశిష్ట, దయానంద్ రెడ్డి. సాంకేతిక సిబ్బంది: బ్యానర్: మోక్ష ఆర్ట్స్ రచన-దర్శకత్వం: మంచాల నాగరాజ్, నిర్మాత: మయూర్ రెడ్డి బండారు ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: ఉమేష్ విలాసాగరం క్రియేటివ్ ప్రొడ్యూసర్: కుశాల్ రెడ్డి కందాలా.



# పాన్ ఇండియా ఫిల్మ్ 'కిల్లర్'

దర్శకత్వానికి పది సంవత్సరాలు దూరంగా ఉన్న ఎస్‌జె సూర్య 'కిల్లర్' సినిమాతో తిరిగి కెప్టెన్‌చైర్‌లో కూర్చోవడానికి సిద్ధంగా ఉన్నారు. ఈ ప్రతిష్టాత్మక చిత్రంలో ఎస్‌జె సూర్య హీరోగానే కాకుండా, కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ కూడా తానే సమకూరుస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ గోకులం మూవీస్ (గోకులం గోపాలన్ నేతృత్వంలో) ఎస్‌జె సూర్యా సొంత నిర్మాణ సంస్థ ఏంజెల్ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ చిత్రాన్ని వి.సి.ప్రవీణ్, బైజు గోపాలన్ కలిసి నిర్మిస్తున్నారు కృష్ణమూర్తి ఎగ్జిక్యూటివ్ నిర్మాత. అకాడమీ అవార్డ్ విన్నింగ్ మ్యూజిక్ డైరెక్టర్ ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకి మ్యూజిక్ ఇవ్వబోతున్నాడు. ఆయన ప్రాజెక్ట్ రావడం చూస్తేనే సినిమాలో సంగీతానికి ఎంత ప్రాధాన్యత ఉందో అర్థం అవుతుంది. ఇది ఎస్.జె. సూర్యా-ఏఆర్ రెహమాన్ కాంబినేషన్‌లో ఐదో సినిమా. ఇంతకు ముందు నాని, న్యూస్, అన్బే ఆరుయిరే, పులి సినిమాల్లో కలిసి పనిచేశారు. కిల్లర్ సినిమాని భారీ స్థాయిలో ప్లాన్ చేస్తున్నారు. ఇండియా అంతటా ప్రేక్షకులతో కనెక్ట్ అవ్వాలనే లక్ష్యంతో ఐదు భాషల్లో రిలీజ్ చేయబోతున్నారు. మిగతా క్యాస్ట్, టెక్నికల్ టీమ్ వివరాలు మేకర్స్ త్వరలోనే తెలియ జేస్తారు.



# ఆధునిక ఫ్యాషన్‌లు అలంకార సోయగాలు



తరాలు మారిన కొద్దీ ఫ్యాషన్లు కూడా మారుతు న్నాయి, కొన్ని సందర్భాల్లో వెర్రి పోకడలు కూడా సంతరించ ుకుంటున్నాయి. ప్రతి ఒక్కరు తమ ఫ్యాషన్ భావాలను వ్యక్తీకరించడానికి ఒక ప్రత్యేక మార్గాన్ని ఎంచుకుంటారు. ఒక్కొక్కరి వస్త్రధారణ ఒక్కో విధంగా ఉంటుంది. కులాలు, మతాలు, జాతులు, దేశాలు, ప్రాంతాలను బట్టి ఫ్యాషన్స్ మారుతుంటాయి. ఒక్కో జాతికి ఒక రకమైన విలక్షణ వస్త్రధారణ పద్ధతులు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచం, పరిశ్రమ చాలా పెద్దది. ఫ్యాషన్ టెక్నాలజీ క్షణక్షణం మారుతోంది. . ప్రపంచ మానవాళి దృష్టిని తమ ఫ్యాషన్ల వైపుకు మరల్చడానికి, ప్రత్యేక సౌందర్య భావాలను వ్యక్తం చేయడానికి, వారి వారి విభిన్న దుస్తులు లేదా ఉపకరణాలను ప్రదర్శించడానికి ఒక వేదికగా ప్రతి ఏటా జూలై 9న "అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవం (ఇంటర్నేషనల్ ఫ్యాషన్ డే)" పాటించడం 2016 నుంచి ఆనవాయితీగా మారింది.

**ఫ్యాషన్ ప్రపంచం చాలా పెద్దది:** ఫ్యాషన్ రంగం చాలా పెద్దది. నేడు ప్రపంచ ఫ్యాషన్ పరిశ్రమ/మార్కెట్ దాదాపు 1.84 ట్రిలియన్ డాలర్ల వ్యాపారంగా మారింది. ప్రపంచ మానవ జనాభా 8 బిలియన్లకు సాలీనా దాదాపు 100 బిలియన్ల వరకు దుస్తులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రతి ఒక్కరికి సగటున ఒక ఏడాదికి 12 14 దుస్తులు కొనుగోలు చేస్తున్నారు. వస్త్ర ఉత్పత్తిలో అతి పెద్ద దేశంగా చైనా తొలి స్థానాన్ని ఆక్రమించింది. ఫ్యాషన్ పరిశ్రమ ద్వారా సృజన, ఆవిష్కరణ, సంస్కృతి, వేషధారణ, పలు రకాలు దుస్తులు, కేశాలంకరణ, అలంకరణ, ఆభరణాలు లాంటి పలు అంశాలు ఉంటాయి. ఫ్యాషన్ ప్రపంచంలో వ్యక్తులు, డిజైనర్లు, క్రియేటర్స్, మోడల్స్, స్టైలిస్ట్స్, ఇన్నొవేటర్స్, ట్రెండ్స్, ఇన్ఫ్లుయెన్సర్స్ ద్వారా పలు రకాల ఫ్యాషన్స్ పుట్టుకొస్తున్నాయి, మార్కెట్‌ను ముంచేస్తున్నాయి. నిన్నటి ఫ్యాషన్ నేడు పాతబడిపోయి, నేటి ఫ్యాషన్స్ కోకొల్లలుగా పుట్టుకొస్తున్నాయి. **ఫ్యాషన్ అంటే దుస్తులు మాత్రమే కాదని, ఇది ఒక హద్దులు లేని వింత ప్రపంచమని అర్థం అవుతున్నది. ఫ్యాషన్ రంగం అంటేనే సృజనశీలత, ఆవిష్కరణ, సంస్కృతికి వైవిధ్యం, ప్రత్యేక గుర్తింపు లాంటి అంశాలకు పుట్టిళ్లు. సామాజిక మార్పులు, కళలకు అపూర్వ వేదికగా అంతర్జాతీయ ఫ్యాషన్ దినం ఉపయోగపడుతున్నది.**


**ఫ్యాషన్ టెక్నాలజీ ఫ్యాషన్ డిజైనర్స్:** ఫ్యాషన్ డిజైన్ అంటే దుస్తులు, కొన్ని వస్తువులను అందంగా, వినూత్నంగా తీర్చి దిద్దే కళ అని తెలుసుకోవాలి. దీనిలో అవలంబించే పద్ధతుల సమాహారాన్ని ఫ్యాషన్ టెక్నాలజీ అని పిలుస్తాం. మానవ అభిరుచులను బట్టి దుస్తులు, అలంకార వస్తువులను తయారు చేసే నిపుణులను ఫ్యాషన్ డిజైనర్స్ అంటాం. దుస్తులు, ఉపకరణాల రూపకల్పన, ఉత్పత్తిలో సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించడాన్ని ఫ్యాషన్ టెక్నాలజీగా పిలుస్తున్నాం. ఫ్యాషన్ టెక్నాలజీలో ఫ్యాషన్ డిజైన్స్, వస్త్ర సాంకేతికత, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఫ్యాషన్ మార్కెట్, రిటైల్ లాంటి పలు రంగాలు ఉంటాయి. నేటి డిజిటల్ యుగంలో కంప్యూటర్‌సహాయ ఉత్పత్తి/డిజైన్స్, 3డి ప్రింటింగ్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ లాంటి పరిజ్ఞానాలు వాడబడుతున్నాయి. ఇవి ఫ్యాషన్ ప్రపంచ పరిశ్రమను మరింత సమర్థవంతంగా, సుస్థిరంగా, వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా, ఆకర్షణీయంగా మార్చడంలో సహాయపడుతున్నది.



**అంతర్జాతీయ ఫ్యాషన్ దినోత్సవ వేడుకలు:** ఆధునిక పౌర సమాజ అభిరుచులకు అద్దం పడుతున్నది నేటి ఫ్యాషన్ పరిశ్రమ. మారుతున్న కాలంతో పాటు ఫ్యాషన్లు కూడా అత్యంత వేగంగా మారుతున్నాయి. అంతర్జాతీయ ఫ్యాషన్ దినం వేదికగా ప్రదర్శనలు, పోటీలు, సామాజిక మాధ్యమ అవగాహనలు, నూతన బ్రాండ్ల ప్రదర్శనలు, డిస్కౌంట్స్, స్థానిక బ్రాండ్ల ప్రోత్సాహం, కొత్త బ్రాండ్ల ప్రారంభం, ఫ్యాషన్ టెక్నాలజీ సృజనకారుల గుర్తింపు లాంటి కార్యక్రమాలను నిర్వహించ వచ్చు. మానవ జాతి పుట్టుక నుంచి నేటి వరకు ఫ్యాషన్ రంగం కొత్తపుంతలు తొక్కుతూనే ఉన్నది. ఇదో వింత, విచిత్ర ప్రపంచం. పౌర సమాజంతో విడదీయరాని సంబంధం కలిగిన ఫ్యాషన్ ప్రపంచం నిన్నటి, నేటి, రేపటి తరాలకు తగిన విధంగా తమ ఉత్పత్తులను విడుదల చేస్తూనే ఉన్నాయి. ఫ్యాషన్ టెక్నాలజీ పెరగడంశుభ సూచకమే అయినప్పటికీ ఫ్యాషన్ల వెర్రితలలు వేయకూడదు, మన సాంస్కృతిక మూలాలను మరిచి పోకూడదు. మన ప్రాంత వాతావరణాన్ని, అవసరాలను, సందర్భాలను బట్టి మన వేషధారణ ఉండాలి. ఫ్యాషన్ పేరుతో అసహ్యకర రూపును పొందరాదని గమనించాలి.

**- డా: బుర్ర మధుసూదన్ రెడ్డి**

# కోబ్రాను పట్టిన సాహస వనిత



**ఎదురుగా ఓ చిన్న పాము కనిపిస్తే చాలు.. ముచ్చెమటలు పడతాయి. వెంటనే పరుగు లంకించుకుంటాం. అలాంటిది కింగ్ కోబ్రా, కొండ చిలువ.. వంటి ప్రమాదకర పాములైతే..? ఇక చెప్పే పనే లేదు. పై ప్రాణాలు పైనే పోతాయి? కానీ రోషిణి ఇలా భయపడదు. పరిగెత్తదు. వాటిని పట్టుకిని సురక్షిత ప్రాంతాల్లో వదలేస్తుంటుంది. అలా ఒకటి కాదు, రెండు కాదు.. ఇప్పటివరకు కొన్ని వందల పాముల్ని కాపాడిందామె. వృత్తిరీత్యా అటవీ అధికారిణి అయిన రోషిణి.. ఇటీవలే ఓ కింగ్ కోబ్రాను పట్టుకొని వార్తల్లో నిలిచింది. ఈ సాహస వనిత గూర్చి తెలుసుకుందాం..**


**మూగజీవాలపై ప్రేమతో..!** రోషిణిది కేరళలోని తిరువనంతపురం. ఆమె చిన్నతనం నుంచే ధైర్యశాలి. మూగజీవాలు, వాటి సంరక్షణ కోసం ఏదో ఒకటి చేయాలి పరితపించేది. ఈ ఆసక్తే ఆమెను 2017లో అటవీ శాఖాలో చేరేలా చేసింది. 'బీట్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా విధుల్లో చేరిన.. 2019లో ఆ రాష్ట్ర ప్రభుత్వ శాఖ నిర్వహించిన శిక్షణలో ఆమె హాజరైంది. ఇందులో భాగంగా పాముల్ని సురక్షి తంగా ఎలా పట్టుకోవాలో మెలకువలు నేర్చుకుంది. ప్రస్తుతం పరుథిపల్లి అటవీ చెందిన 'ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్'లో సభ్యురాలిగా పనిచేస్తోంది రోషిణి. ఇలా ఈ ఆరేళ్లలో సుమారు 800లకు పైగా విషపూరితమైన, విషపూరితం కాని పాముల్ని పట్టుకొని.. సురక్షిత ప్రాంతాల్లో వదిలేసిందామె. జనావాసాల్లో వన్యప్రాణులు సంచరించినప్పుడు ప్రజలకు, వారి పంటలకు హాని కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ముఖ్యంగా ఆటవీ ప్రాంతాలకు సమీపంలో నివసించే వారికి ఈ ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. దీనికి పరిష్కారంగా కేరళ రాష్ట్ర శాఖ ప్రజల భద్రత కోసం ర్యాపిడ్ రెస్పాన్స్ బృందాన్ని ఏర్పాటు చేసింది. ఈ బృందం జనావాసాల్లోకి వచ్చిన వన్యప్రాణులను సురక్షితంగా పట్టుకోవడమే కాకుండా, వాటిని తిరిగి అడవిలో విడిచిపెడుతుంది.

**'కొండ చిలువ'తో సాహాసం!**

ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్ సభ్యురాలిగా జనావాస ప్రాంతాలను సంచరించే వన్యప్రాణులను సంరక్షించడం ఆమె బాధ్యత. ఆమె ఎక్కువగా పాముల్ని పట్టిందట. ఇలా ఆమె పట్టుకున్న తొలి పాము కొండ చిలువ, కల్లర్ అనే ప్రాంతంలో దీన్ని పట్టుకొని అక్కడికి దగ్గర్లోని ఆటవీ ప్రాంతంలో వదిలేసిందామె. ఇప్పటి వరకు ఆమె పట్టుకున్న పాముల్లో కింగ్ కోబ్రా, నల్లత్రాచు, కొండ చిలువ.. వంటి ప్రమాదకర మైన ఎక్కువట! అటవీ శాఖలో చేరినప్పట్నుంచి పాముల్ని పట్టు కోవడం, ఇతర మూగజీవాల సంరక్షణే నా జీవనశైలిగా మారిపోయింది. జానా ఆసాల్లో సంచరించే పాముల్ని పసిగట్ట పట్ట ఓవడమంటే పెద్ద సవాలే! ఈ క్రమంలో శరీరం పైనా ఒత్తిడి పడుతుంది. ముఖ్యంగా కొండ చిలువ వంటి భారీ పాముల్నిఒడిసిపట్టినప్పుడు చేతులు, భుజాల్లో విపరీతమైననొప్పి వేధిస్తుంటుంది. అంతేకాదు దీని పట్టకు వెంటనే ఇది మూత్ర, మల విసర్జన చేస్తుంది. ఆ దుర్వాసనకు అక్కడ ఒక్క క్షణమైనా నిలబడలేం. ఎంత శుభ్రం చేసుకున్నా, ఎన్నిసార్లు స్నానం చేసినా ఆ దుర్గంధం వదలదు నేనైతే అన్నం తినకుండా ఉన్న సందర్భాలెన్నో ఉన్నాయి. అంటోన్న రోషిణి తన వృత్తిలో భాగంగా ముళ్లపందులు, జింకలు వంటి ఇతర మూగజీవాల్నీ పట్టుకొని సురక్షిత ప్రాంతానికి చేర్చింది. ఆ పద్ధతి పాటిస్తా ! పాముల్ని పట్టుకోవడమంటే అంత ఆషామాషీ విషయం కాదు. ఓవైపు తనను తాను కాపాడుకుంటూనే మరోవైపే ఆ ప్రాణికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్తలు తీసువాల్సి ఉంటుంది. ఇందు కోసం తాను 'బ్యాగ్ అండ్ పైప్' అనే పద్ధతిని పాటి స్తానంటోంది రోషిణి. పామువల్ల నాకు, నా వల్ల పాముకు ఎలాంటి హాని జరగకుండా చూసుకుంటూ ఈ క్రమంలో వాటి తోకను అందుకొని బ్యాగ్ లేదా పైపులోకి పాకేలా చేసి వాటిని మూసేస్తా. పాము ఎముకలు సున్నితంగా ఉంటాయి. నఅందుకే వాటిని తోకనదగ్గర పట్టుకుంటా.. అంటోన్న ఈ ఫారెస్ట్ ఆఫీసర్. ఆ ప్రక్రియలో తన అనుభవాలన్నిటినీ ఓ డైరీలో నోట్ చేసుకోవడంతో పాటు వాటి వీడియో లను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తూ దేశవ్యాప్తంగా పాపులారిటీ సంపాదించుకుంటోంది. ఆమె ధైర్యానికి అటు నెటిజన్లు, ఇటు ప్రముఖులు ప్రశంసిస్తున్నారు. □



# పిల్లలు ఎత్తు పెరగడం లేదా?



**తమ పిల్లలు ఎత్తుగా ఉండాలి.. ఎత్తుకు తగ్గ బరువుండాలి. అని తల్లిదండ్రులు కోరుకోవడం సహజం. అయితే కొంతమంది చిన్నారుల్లో పెరుగుదల మందకొడిగా సాగడం, ఒక వయసొచ్చాక ఆగిపోవడం వల్ల సరైన ఎత్తు పెరగక పొట్టిగా కనిపిస్తుంటారు. తల్లిదండ్రుల జీన్స్ ఒక్కటే దీనికి కారణం అనుకుంటే పొరపాటే! ఎందుకంటే పోషకాహార లోపం, శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం, వారుండే వాతావరణం. వంటివీ చిన్నారుల ఎత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలోనే పిల్లలు ఎత్తు పెరగడానికి కొన్ని వ్యాయామాలు దోహదం చేస్తాయంటున్నారు. మరి, ఏంటా వర్కవుట్లు? మనమూ తెలుసుకుందాం..**



**స్ట్రెచింగ్ వ్యాయామాలు ...** స్ట్రెచింగ్ వ్యాయామాలు చేయడానికి సులభంగా ఉండడంతో పాటు, పిల్లలు ఎత్తు పెరగడానికి ఎంతో ప్రభావవంతంగా పని చేస్తాయంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో నిటారుగా నిల్చొని కిందికి వంగుతూ కాలి వేళ్లను అందుకోవడం, కాళ్లు ముందుకు చాపి కూర్చొని చేతి వేళ్లతో కాళ్లను అందుకోవడం, శరీర పైభాగాన్ని ఇరువైపులా వంచుతూ చేసే వ్యాయామాలు.. ఇలాంటి వర్కవుట్లు వెన్నెముకకు ఫ్లెక్సిబులిటీని అందిస్తాయి. అది సులభంగా సాగేలా చేస్తాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం సులువవుతుంది.

**వేలాడితే మంచిదే!...** పిల్లల ఎత్తు పెరగడానికి చాలామంది నిపుణులు సూచించే వ్యాయామాలివి. బార్ హ్యాంగింగ్స్, హ్యాంగింగ్ రాడ్, పులప్స్, చిన్-అప్స్.. వంటి ఎక్సర్‌సైజెస్ వెన్నెముకను సులభంగా సాగేలా చేస్తాయి. తద్వారా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగచ్చు. అలాగే ఈ వ్యాయామాలు వెన్ను, భుజాల కండరాలకు దృఢత్వాన్ని అందించి ఫిట్‌గా మార్చుతాయి.

**యోగాసనాలతో...** కొన్ని రకాల యోగాసనాలు శారీరక దృఢత్వాన్ని పెంచడమే కాదు.. పిల్లలు ఎత్తు పెరగడానికీ దోహదం చేస్తాయంటున్నారు నిపుణులు. సూర్య నమస్కారాలు చేయడం వల్ల శరీరమంతటికీ చక్కటి వ్యాయామం అందుతుంది. అలాగే భుజాలు, వీపు, కాళ్లలోని కండరాలను బలంగా మార్చి సులభంగా సాగేలా చేస్తుంది. ఇక చక్రాసనం వల్లభుజాలు, పాదాలపై ఒత్తిడి పడుతుంది. తద్వారా అక్కడి కండరాలు దృఢమవడంతోపాటు సాగుతాయి. ఫలితంగా ఎత్తు పెరిగే ప్రక్రియ వేగవంతమవుతుంది.

**స్కిప్పింగ్-స్విమ్మింగ్...** స్కిప్పింగ్ ఆడడమంటే ఆడపిల్లలకు భలే సరదా. ఎంతో సరదాగా చేసే ఈ వ్యాయామం వారి శరీరానికి దృఢత్వాన్ని అందించడమే కాదు.. గుండె ఆరోగ్యాన్ని సైతం మెరుగుపరుస్తుంది. అలాగే ఈ వర్కవుట్‌లో భాగంగా ఎగిరి దూకే క్రమంలో వెన్నెముక, భుజాలు, కాళ్లలోని కండరాలు ఫ్లెక్సిబుల్‌గా మారతాయి. సులభంగా సాగేలా తయారవుతాయి. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ ఎత్తు పెరగడం ఈజీ అవుతుంది. ఇక ఈత కొట్టే క్రమంలో కూడా శరీరాన్ని ముందుకు సాగదీస్తాం. తద్వారా వెన్నెముకకు చక్కటి వ్యాయామం అందుతుంది. ఇది కూడా ఎత్తు పెరిగేందుకు సహాయపడుతుంది.

**ఇవి కూడా!..** ◆. మన శరీరంలో హెచ్‌జిహెచ్ అనే పెరుగుదల ప్రేరేపించే హార్మోన్ ఉంటుంది. ఇది పిల్లల్లో నిద్రపోయినప్పుడు మాత్రమే విడుదలవుతుందట! అందుకే చిన్నారులు ఎంత చక్కగా నిద్రపోతే అంతగా పెరుగుతారంటారు.

◆ విటమిన్ 'డి' సైతం చిన్నారులు ఎత్తు పెరిగేందుకు పేరేపిస్తుందంటున్నారు నిపుణులు. ఇది కండరాలు, ఎముకల సామర్థ్యం పెరిగేలా చేసి.. పరోక్షంగా ఎత్తు పెరగడానికి సహకరిస్తుంది. ఇందు కోసం రోజూ కాసేపు ఎండలో నిలబడడం.. చేపలు పుట్టగొడగులు, గుడ గుడ్లు.. వంటి విటమిన్ 'డి' అధికంగా ఉండే ఆహార పదార్థాలు వారి డైట్‌లో భాగం చేడం మంచిది.


◆ పిల్లలకు అందించే ఆహారంలో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, విటమిన్లు.. ఇలా అనిన పోషకాలు ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం సీజనల్ పండ్లు అన్ని రకాల కాయకూరలు దుంపలు ఆకుకూరలు వంటివన్నీ వీరి ఆహారంలో చేర్చాలి. □

# ఇరుగూ పొరుగూ చూసుకోవాలి..



**మనం ఎప్పుడైనా ఇల్లుమారాలనుకున్నప్పుడు ఇరుగూ పొరుగూ చేసుకోవాలని పెద్దవాళ్లు చెబుతుంటారు కదా!** అందుకు కారణమేదైనా..తాజాగా బోస్టన్‌మెడికల్ సెంటర్ చేసిన పరిశోధనలు మాత్రం ఆ మాటలకు మరింత బలాన్ని చేకూరుస్తున్నాయి. మన చుట్టూ ఉండే వాతావరణం పిల్లలు తెలివితేటలపై ప్రభావం చూపిస్తుందట. అందులోనూ చదువుకున్నవాళ్లు మన పక్కింట్లో ఉంటే.. పిల్లల్లో భాషా నైపుణ్యాలతోపాటు కాగ్నిటివ్ సామర్థ్యాలూ ఎరుగుతాయట. ఆ మార్పు వారిలో శిశువుగా ఉన్నప్పటినుంచి మొదలవుతుందట. అందుకోసం పరిశోధకులు బోస్టన్, లాస్ ఏంజెలెస్ ప్రాంతాల్లోని 65 మంది శిశువులపై ప్రయోగం చేశారట. ఇందుకు రకరకాల వాతావరణాల్లో పెరిగే 6 నుంచి 12 నెలల పిల్లల్ని ఎంచుకున్నారు ఎలక్ట్రోఎన్ సెఫలోగ్రఫీ (ఈఈజి) ద్వారా వారి మెదడు పనితీరును క్షుణ్ణంగా పరిక్షించారట. పిల్లల్లో కాగ్నిటివ్ డెవలప్‌మెంట్‌ను ముల్లెన్ స్కేల్స్ ఆఫ్ ఎర్లీ లెర్నింగ్ (ఎమ్ఎస్ఇఎల్) విధానంలో .. అంటే రకరకాల ఆటల ద్వారా, అంచనా వేశారు. చుట్టూ చదువుకున్న వ్యక్తులు ఉంటే, ఆ పిల్లల్లో మెదడు పనితీరు మెరుగ్గా ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ఎందుకంటే వాళ్ల నుంచి చిన్నారులు నేర్చుకునే అవకాశం ఎక్కువగా ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. అందుకే మనం నివసించే ప్రదేశాన్ని ఒకటికి రెండు సార్లు ఆలోచించుకుని ఎంచుకోవాలి. □

# జలదాన మహిమ !



ఒకసారి యమధర్మరాజు దానధర్మాలు చేసి పేరు తెచ్చుకున్న భగీరధుడుని కలిసాడు. మీరు దాన ధర్మములు చేయడంలో అపరభగీరధుడుగా ఇంత మంచిపేరు తెచ్చుకున్నందుకు సంతోషం. ఈ దానఫలం గురించి ఏమైనా నాకు కూడా కాస్త తెలియజేస్తారా! అడిగాడు సంతోషం. ఈ దానఫలం గరించి ఏమైనా నాకు కూడా కాస్త తెలియజేస్తారా! అడిగాడు సందేహంగా, అందుకు భగీరదుడు వినయపూర్వకంగా నమస్కరించి. 'యమధర్మరాజా! మీకు తెలియని ధర్మం వుండా! దానం అంటే ధనం, ధాన్యరాశులు దానం చేయడం మాత్రమే కాదు. జలదానం కూడా గొప్పది. జలం పవిత్రమైనది జలం దానం చేయడం కూడా పుణ్యప్రదం అని చెప్పాలి. సకల జనులకు జీవనాధారం. ఈ జలమే. పూర్వకాంలో చెరువులు, తటాకాలు తవ్వించడం ద్వారా వేసవి దాహం తీర్చిన వారు కావడం వలన సమస్త పాపాలు నశించి అనంతపుణ్య ఫలం పొందగలరు. అని యమలోకాధిపతికి భగీరదుడుకి ఈ విషయం తెలియ జేసాడు. జలదానంలో అంతటి ఫలం ఉన్నదా! అని ఆశ్చర్యం వ్యక్తం చేసాడు యమధర్మరాజు. అవును ధర్మరాజా! మండువేసవిలో చల్లటి నీరు ఇచ్చి దాహం తీర్చిన వారికి కూడా ఈ పుణ్య ఫలం విశేషంగా దక్కుతుంది. అంటూ వివరించాడు భగీరధుడు. అయితే మేముకూడా ఈ విషయంపై పరిశీలించి జలదాన మహిమతో కూడిన పాపపుణ్యములు పరిగణనలోకి తీసుకోగలము. అని యముడు తన లోకానికి తిరిగి వెళ్లి పోయాడు. అందుకే మనం జలమును వృధా చేయరాదు. జలమును సద్వినియోగం చేసుకోవాలి. జలమును గౌరవించాలి. సకల ప్రాణ కోటికి జలమే జీవనాధారం. అని అందరూ గ్రహించాలి.

**-ఎల్.ప్రఫుల్ల చంద్ర**

ఆధ్యాత్మికం

# అనర్సా మిఠాయి

ఝార్ఖండ్ రాష్ట్ర ప్రత్యేక మిఠాయి అనర్సా. ఇది చేయడానికి ఏమేం కావాలంటే.. బియ్యం కప్పున్నర, గోధుమపిండి అర కప్పు, బెల్లం పొడి కప్పు, పావు కప్పు పాల, 3 చెంచాల వెన్న, చెంచా గసగసాలు, పావు కప్పు నువ్వులు, పావు చెంచా యాలకుల పొడి, వేయించడానికి సరిపడా నూనె అవసరమవుతాయి. తయారీ చాలా సులువే..నువ్వులు, గసగసాలను కలిపి ఒక పళ్లెంలో పోయాలి. బియ్యం ముందు రోజు రాత్రి నానబెట్టి,ఉదయం ఆ నీళ్లు తీసేసి.. గ్రైండ్ చేయాలి. ఆ బియ్యప్పిండిని ఒక పాత్రలోని తీసుకుని.. గోధుమపిండి, నెయ్యి, యాలకుల పొడి, బెల్లంపొడి, పాలు, వెన్న జతచేసి బాగా కలపాలి. ఈ పిండిని నిమ్మకాయంత భాగాలుగా తీసుకుని, అరచేతులతో బూరెల్లా చేసి.. నువ్వులు,గసగసాల్లో ముంచి తీసి..కాగుతున్న నూనెలో వేయించాలి. బంగారు రంగులోకి మారగానే టిష్యూ పేపర్ మీదకి తీస్తే సరి. ఘుమఘుమలాడే అనర్సా రెడీ. ఈ తియ్యటి స్వీటు ఎంతో శక్తి కూడా. □



# జుట్టుకు అవిసె గింజలు..

అధిక బరువును తగ్గించుకోవడానికి అవిసె గింజల్ని ఆహారంలో భాగం చేసుకుంటారు చాలా మంది. ఇందులోని ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు, అత్యధిక ఫైబర్లు శరీరానికి ఎంతో మేలు చేస్తాయి. అంతే కాదు.. ఈ ఒమేగా ఫ్యాటీ ఆమ్లాలు చర్మం, కుదుళ్ల ఆరోగ్యానికి మేలు చేసే కొలాజెన్ ఉత్పత్తికీ తోడ్పడతాయి. ఈ క్రమంలో జుట్టు, కుదుళ్ల ఆరోగ్యానికి మేలు చేసే ఈ అవిసె గింజల హెయిర్‌ప్యాక్ ట్రై చేయండి..

**కావాల్సినవి :** అవిసె గింజలు : ఒక కప్పు, నీళ్లు: ఆరు కప్పులు, కొబ్బరి నూనె: ఐదు టీస్పూన్‌లు.

**తయారీ :** ఒక కప్పు అవిసె గింజలకి ఆరు కప్పుల నీరు చేర్చి బాగా మరిగించాలి. నీళ్లు సగానికి రాగానే స్టౌ మీద నుంచి దించి చల్లారనివ్వాలి. చల్లారినప్పుడు ఆ నీరు జెల్‌లా మారడం గమనించవచ్చు. ఇప్పుడు ఒక పల్చటి శుభ్రమైన క్లాత్ తీసుకొని, జెల్ నుంచి అవిసె గింజలను వడగట్టాలి. ఇలా వడగట్టిన జెల్‌కి ఐదు టీస్పూన్‌ల కొబ్బరినూనెను చేర్చాలి.



**ఎలావాడాలి:** హెయిర్ ప్యాక్ వేసుకునే ముందు జుట్టు శుభ్రంగా, పొడిగా ఉండాలి. జుట్టుని సన్నని పాయలుగా విడదీస్తూ హెయిర్ ప్యాక్ కోసం తయారు చేసుకున్న జెల్‌ని కుదుళ్ల నుంచి వెంట్రుకల చివర్ల వరకు పట్టించాలి. నెమ్మదిగా ముని వేళ్లతో ఒక పది నిమిషాల పాటు కుదుళ్లను మసాజ్ చేసి, గంటపాటు ఆరనివ్వాలి. ఆ తర్వాత గాఢత తక్కువగా ఉండే షాంపూతో జుట్టుని శుభ్రం చేసుకోవాలి. ఈ హెయిర్ ప్యాక్ జుట్టు పెరగ డానికి తోడనపడటమే కాకుండా హెయిర్ కండిషన్‌గానూ ఉపయోగపడుతుంది. □

# ఇది దివ్య ఔషధం

**. నీరసం, నిస్సత్తువ, తలనొప్పి, వికారం, వేడిచేయడం, అరికాళ్ల మంటలు..ఇలా ఎన్నిటికో దివ్య ఔషధం కొబ్బరిబొండం. ఇందులో ఏమేం సుగుణాలున్నాయో చూద్దాం..**

కొబ్బరి నీళ్లలో ప్రొటీన్లు, పీచు, చక్కెర, కాల్షియం, పొటాషియం, మెగ్నీసియం, సొడియం, భాస్వరం ఉన్నందున శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. కొబ్బరి నీళ్లు తాగడం వల్ల వెంటనే శక్తి వస్తుంది. రోగనిరోధక శక్తి పెరుగుతుంది. మూత్రపిండాల్లో ఇన్ఫెక్షన్లను నివారిస్తాయి. రాళ్లు ఏర్పడే అవకాశం తగ్గుతుంది. కొబ్బరి నీళ్లలో ఉండే ఖనిజాలు, యాంటాక్సిడెంట్లు శరీరాన్నిన ఆరోగ్యంగా ఉంచుతాయి. కండరాల పనితీరు మెరుగవుతుంది.



ఎముకలు, దంతాలు పటిష్టంగా ఉంటాయి. జీర్ణప్రక్రియ సజావుగా ఉంటుంది. డీ హైడ్రేషన్ సమస్య తలెత్తదు. చర్మం పొడిబారదు, నేవళంగా ఉంటుంది. ఊబకాయం రాదు. కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయి క్రమబద్ధంగా ఉంటుంది. రక్తపోటు అదుపులో ఉంటుంది. గుండె జబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది. అన్నిటినీ మించి ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. తియ్యటి కొబ్బరినీళ్లని ఎక్కువమంది అలాగే తాగుతారు. భిన్నమైన రుచి కావాలనుకునేవాళ్లు.. పండ్లరసాలు లేదా నిమ్మరసం కలిపి తాగొచ్చు. □

## కుడో ప్రపంచ కప్‌లో భారత్ అథ్లెట్
# సోహైల్‌కు రజతం



**న్యూఢిల్లీ:** కుడో ప్రపంచ కప్-2025లో పురుషుల 250 పి విభాగంలో రజత పతకాన్ని సాధించడం ద్వారా భారత్‌కు చెందిన సోహైల్ ఖాన్ చరిత్ర సృష్టించాడు, ప్రపంచ ఈవెంట్‌లో సీనియర్ పురుషుల విభాగంలో భారతదేశం యొక్క అత్యుత్తమ ముగింపును నమోదు చేశాడు. బల్గేరియాలో జరిగిన ఈ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌లో అద్భుత ప్రదర్శన కనపరిచి పోరు సాగించి చివరకు రజత పతకాన్ని దక్కించుకున్నారు. సోహైల్ తన రౌండ్ ఆఫ్ 16లో పాకిస్తాన్‌కు చెందిన అబ్దుల్లాతో జరిగిన మ్యాచ్‌లో తన ప్రచారాన్ని ప్రారంభించాడు. కానీ ప్రత్యర్థి బరువు అవసరాన్ని తీర్చడంలో విఫలమైన తర్వాత వాకోవర్ ద్వారా ముందుకు సాగాడు. క్వార్టర్ ఫైనల్లో, బల్గేరియాకు చెందిన రుసేవ్ రాడోస్లావ్‌పై 1-0 తేడాతో విజయం సాధించడానికి సోహైల్ తీవ్రంగా పోరాడాడు. కుడో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ విడుదల చేసిన అధికారిక ప్రపంచ ర్యాంకింగ్స్ ఆధారంగా, ఎమ్ 250 విభాగంలో 12వ సీడ్‌గా సోహైల్ ఈ టోర్నమెంట్‌లోకి ప్రవేశించాడు. జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలో అతని స్థిరమైన ప్రదర్శనలు అతనికి ఈ స్థానాన్ని సంపాదించడానికి సహాయపడ్డాయి. ఈ టోర్నమెంట్‌లో ప్రపంచవ్యాప్తంగా అగ్రశ్రేణి కుడో అథ్లెట్లు పాల్గొన్నారు.

# మహిళల ప్రపంచ కప్‌లో వంతిక, పద్మిని, నందిధా గెలుపు



**న్యూఢిల్లీ:** మహిళల ప్రపంచ కప్ 2025లో భారత్ గ్రాండ్ మాస్టర్లు వంతిక, పద్మిని విజయాన్ని సాధించి మలి రౌండ్‌కు చేరుకున్నారు. జార్జియాలోని బటుమీలో జరిగిన 2025 మహిళల చెస్ ప్రపంచ కప్‌లో రెండవ రౌండ్‌కు వెళ్లేందుకు భారత్‌కు చెందిన వంటికా అగర్వాల్, పద్మిని రౌట్ మరియు శిజు నందిధా తమ తమ గేమ్‌లలో విజయాలను నమోదు చేసుకున్నారు. అంతకుముందు రోజు బ్లాక్ పావులతో డ్రాగా ముగిసిన అగర్వాల్, తుర్క్మెనిస్తాన్‌కు చెందిన లాలా షోహ్రాదోవాను కేవలం 27 కదలికలలో సులభంగా ఓడించి నాకౌట్ పోటీలో రెండవ రౌండ్‌లో తన స్థానాన్ని భద్రపరచుకుంది. అలాగే మొదటి రౌండ్‌లో చైనాకు చెందిన లాన్లిన్ జాంగ్‌ను ఓడించి వరుసగా రెండో విజయాన్ని నమోదు చేసింది. మరోవైపు, నందిదా పివి కష్టపడి పనిచేయవలసి వచ్చింది. ప్రత్యర్థి అనాహి ఓర్టిజ్ చేసిన ఒక చిన్న పొరపాటు వల్ల నందిదా దానిని సద్వినియోగం చేసుకుని, టోర్నమెంట్‌లో మరింత ముందుకు సాగడానికి మొదటి రౌండ్‌లో రెండు విజయాలను నమోదు చేసింది. నందిదా తదుపరి రెండవ రౌండ్‌లో అనుభవజ్ఞురాలైన హారిక ద్రోణవల్లితో తలపడనుంది, మరోచోట, ప్రియాంక కె మొదటి రౌండ్‌లో టైబ్రేక్ సాధించాలంటే హంగేరీకి చెందిన గాల్ జ్సోకాపై తప్పక గెలవాల్సిన విజయాన్ని నమోదు చేసింది. తొలి గేమ్‌లో బ్లాక్ పావులతో ఓడిపోయిన ప్రియాంక, రెండో గేమ్‌లో తిరిగి పోరాడి, రెండో గేమ్‌లో 34 ఎత్తుగడల్లో విజయం సాధించింది. ఈ విజయం ప్రియాంక మొదటి రౌండ్‌లో స్కోరును 1-1తో సమం చేయడానికి మరియు జ్సోకాపై టైబ్రేక్‌ను సాధించడానికి సహాయపడింది. కిరణ్ మొహంతి క్రాష్ అవుట్ ఇంతలో, కిరణ్ మొహంతి డ్రాతో సరిపెట్టుకుని, 2025 మహిళల చెస్ ప్రపంచ కప్‌లో మొదటి రౌండ్‌లోనే నిష్క్రమించిన ఏకైక భారతీయురాలిగా నిలిచింది.

# ఇంగ్లండ్ సిరీస్‌లో ఈక్వేషన్స్ సక్సెస్



## ఛేజింగ్స్‌తో 58 యేళ్ల చరిత్రాత్మక గెలుపు

**న్యూఢిల్లీ:** టీమిండియా విషయంలో భారత్ క్రికెట్ బోర్డు ఈక్వేషన్లు విజయవంతం అయ్యాయి. కీలక మార్పులతోనే ఇంగ్లండ్ గడ్డ ఎడ్జ్‌బాస్టన్‌లో 58 ఏళ్ల తర్వాత భారత్‌కు చారిత్రాత్మక విజయం సాధ్యమైంది. ఇదే సమయంలో వరల్డ్ టెస్టు చాంపియన్ పాయింట్ల పట్టికలో మెరుగైన చోటు దక్కింది. దీని వెనుక వ్యూహాలు, సరైన ప్లేయింగ్ ఎలెవన్ సెలక్షన్, ఆకాష్ దీప్, సిరాజ్ బౌలింగ్, గిల్ అద్భుత బ్యాటింగ్ వంటి కారణాలు ఉన్నాయి. సరైన ఆటగాళ్ళ ఎంపిక గెలుపునకు దోహదపడింది. కెప్టెన్ శుభమన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ రెండో టెస్టు కోసం బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను సెలక్ట్ చేశారు. జస్ప్రీత్ బుమ్రా లేనప్పటికీ కెప్టెన్, కోచ్ ఆకాష్ దీప్‌ను ఒక అద్భుతమైన బౌలర్‌గా జట్టులో చేర్చారు.

అలాగే, సాయి సుదర్శన్‌కు బదులుగా వాషింగ్టన్ సుందర్‌కు అవకాశం ఇచ్చారు. ఇది టీమిండియాకు బాగా కలిసొచ్చింది. అలాగే ఆకాష్ దీప్, సిరాజ్ బౌలింగ్: భారత్ ఈ చారిత్రాత్మక విజయంలో ఫాస్ట్ బౌలర్లు ఆకాష్ దీప్, మహ్మద్ సిరాజ్‌లది పెద్ద పాత్ర. బ్యాటింగ్‌కు అనుకూలమైన పిచ్‌పై కూడా సిరాజ్, ఆకాష్ అద్భుతమైన బౌలింగ్ చేశారు. సిరాజ్ మొదటి ఇన్నింగ్స్‌లో 5 వికెట్లు, సిరాజ్ మొత్తం 6 వికెట్లు, ఆకాష్ మొదటి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లు తీశాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో ఆకాష్ మళ్ళీ 6 వికెట్లు తీయగా, సిరాజ్‌కు ఒక వికెట్ లభించింది. ఇక జట్టు విజయానికి కెప్టెన్ గిల్ తన బ్యాటింగ్‌తో బలమైన పునాది వేశాడు. భారత మొదటి ఇన్నింగ్స్‌లో 587 పరుగులు చేసింది. గిల్ మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన డబుల్ సెంచరీ (269 పరుగులు) సాధించాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో కూడా గిల్ సెంచరీ (161 పరుగులు) బాది జట్టును పటిష్టమైన స్థితికి చేర్చాడు.

గిల్ ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌ల కారణంగా భారత్ ఇంగ్లాండ్ ముందు 608 భారీ టార్గెట్ ఉంచగలిగింది. ఇంగ్లాండ్ టెస్టు సిరీస్‌తోనే భారత ప్రపంచ టెస్టు ఛాంపియన్ షిప్-2025-27 కొత్త సైకిల్ మొదలైంది. రెండో మ్యాచ్‌లో విజయం భారత్ పాయింట్ల పట్టికలో నాలుగు స్థానాలు ఎగబాకి మూడో స్థానానికి చేరుకుంది.

ఈ సైకిల్‌లో టీమ్‌ఇండియా రెండు మ్యాచ్‌లు ఆడింది. ఓ మ్యాచ్‌లో ఓడిపోగా, మరో మ్యాచ్‌లో గెలిచింది. 50 గెలుపు శాతంతో పాటు 12 పాయింట్లతో భారత్ మూడో స్థానంలో ఉంది. అటు భారత్ చేతిలో రెండో టెస్టులో ఓడిపోయిన ఇంగ్లాండ్ నాలుగో స్థానానికి పడిపోయింది.

# ఐసిసి ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి ఎగబాకిన దీప్తి

## మూడో ర్యాంక్ కొల్లగొట్టిన మంధాన

**న్యూఢిల్లీ:** భారత మహిళల జట్టు ఆల్‌రౌండర్ దీప్తి శర్మ ఐసీసీ ర్యాంకింగ్స్‌లో అదరగొట్టింది. ఇంగ్లండ్ పర్యటనలో తిప్పేస్తున్న ఆమె టీ20 బౌలర్ల ర్యాంకిగ్స్‌లో రెండో స్థానానికి దూసుకెళ్లింది. గత ఆరేళ్లుగా టాప్ 10లో ఉంటున్న దీప్తి.. ఒక ర్యాంక్ ఎగబాకి టాప్ 2గా నిలిచింది. అగ్రస్థానంలో ఉన్న పాకిస్థాన్ సదియా ఇక్బాల్‌కు, దీప్తికి 8 పాయింట్ల తేడానే ఉంది. టీమిండియా విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న ఈ ఆల్‌రౌండర్‌కు కెరీర్లో ఇదే అత్యుత్తమ ర్యాంక్ కావడం విశేషం. పేసర్ రేణుకా సింగ్ 6లో, రాధా యాదవ్ 18లో, తెలుగమ్మాయి అరుంధతి 11 స్థానాలు మెరుగుపరచుకొని 43వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. గత కొంత కాలంగా అంతర్జాతీయ క్రికెట్‌లో దీప్తి నిలకడగా రాణిస్తోంది. ఈమధ్యే ముక్కోణపు వన్డే సిరీస్ గెలుపొందడంలో ముఖ్య భూమిక ఆమెదే. అనంతరం ఇంగ్లండ్ పర్యటనలో కూడా దీప్తి బ్యాటుతో, బంతితో చెలరేగిపోతోంది. మూడో టీ20లో మూడు వికెట్లు తీసిన భారత స్టార్ టీ20ల్లో తన ర్యాంక్‌ను మెరుగుపరచుకుంది. ఇంగ్లండ్ బౌలర్లలో ఇసీ వాంగ్ 57వ, లారెన్ ఫిలర్ 68వ ర్యాంక్‌లో కొనసాగుతున్నారు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత వైస్ కెప్టెన్ స్మృతి మంధాన టాప్ 5లో చోటు దక్కించుకుంది. ఇంగ్లండ్ గడ్డపై పరుగుల వరద పారిస్తున్న మంధాన మూడో ర్యాంక్ కైవసం చేసుకుంది. మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ 12వ స్థానంలో ఉండగా ఈమధ్యే పునరాగమనం చేసిన షఫాలీ వర్మ 13, కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 15 వ స్థానంలో ఉన్నారు.



# భారీ స్కోర్‌తో దక్షిణాఫ్రికా విక్టరీ

## జింబాబ్వే క్లీన్ స్వీప్

### 367 పరుగులతో కెప్టెన్ ముల్డర్ నాటౌట్

**న్యూఢిల్లీ:** జింబాబ్వేతో జరిగిన రెండో టెస్ట్‌లో ఇన్నింగ్స్ 236 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా ఘన విజయం సాధించింది. దీంతో రెండు టెస్టు సిరీస్‌ను 2-0 తేడాతో దక్షిణాఫ్రికా క్వీన్ స్వీప్ చేసింది. 436 పరుగుల లోటుతో ఫాలో అన్ ఆడిన జింబాబ్వే తమ రెండో ఇన్నింగ్స్‌లో 220 పరుగులకు కుప్పకూలింది. సఫారీ బౌలర్లలో కార్బిన్ బాష్ 4 వికెటు,సేమరన్ ముత్తుసామి 3 వికెట్లు, కోడీ యాసఫ్ 2 వికెట్లు సాధించారు. జింబాబ్వే బ్యాటర్లలో నిక్ వెల్చ్ 55 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలవగా, క్రెయిన్ ఎర్విన్ 49 పరుగులు, కైతానో 40 పరుగులతో ఫర్వాలేదనిపించారు. దక్షిణాఫ్రికా ఐదు వికెట్లకు 626 పరుగుల స్కోర్‌తో ఉండగా, దక్షిణాఫ్రికా కెప్టెన్ వియాన్ ముల్డర్ అజేయ ట్రిపుల్ సెంచరీతో (334 బంతుల్లో 49 ఫోర్లు, 4 సిక్సుల సాయంతో 367 పరుగులతో చెలరేగాడు. అతడితో పాటు డవిడ్ బెడింగ్హమ్ 82 పరుగులు, లుహాన్ డ్రి ప్రిటోరియన్ 78 పరుగులు, డెవాల్డ్ ట్రెవిస్ 30 పరుగులు, వెర్రిన్ 42 పరుగులతో రాణించారు. జింబాబ్వే బౌలర్లలో చివంగి, మటిగిము తలో 2 వికెట్లు తీయగా, మసకద్ద ఒక వికెట్ సాధించాడు. అనంతరం జింబాబ్వే తమ తొలి ఇన్నింగ్స్‌లో 170 పరుగులకే అల్ ఔట్ అయింది. ప్రోటీస్ బౌలర్లలో సుబ్రేయన్ 4 వికెట్లు, మల్డర్, యాసఫ్ తలా 2 వికెట్లు పడగొట్టారు. ఫలితంగా జింబాబ్వే ఫాలో అన్ ఆడింది. ఫాలో అన్ లో కూడా విఫలం కావడంతో అతిధ్య జట్టు ఓటమిని చవిచూడాల్సి వచ్చింది.

# డాలర్ వర్సెస్ రూపాయి 85.70

**ముంబై, జూలై 8:** డాలరుతో రూపాయి మారకం విలువలు కొంతమేర పెరిగాయి. మంగళ వారం కరెన్సీ మార్కెట్ ముగిసే నాటికి డారుకు రూపాయి 16 పైసలు పెరిగి 85.70 రూపాయలుగా కొనసాగింది. గతనెల 13వ తేదీ అధ్వాన్నంగా క్షీణించిన తర్వాత కొంతమేర కోలుకున్నదని నిపుణుల అంచనా. అయితే ఇంట్రాడే ట్రేడింగ్‌లో ఒకదశలో 86 రూపాయలకు సైతం చేరుకుంది. ఆసియా కరెన్సీలతో పోలిస్తే భారత్ రూపాయి కొంతమేర రికవరీ అయింది. ముడిచమురు ధరలు కొంతమేర తగ్గడం విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు అమ్మకాల వత్తిడిని తగ్గించడం వంటివి కొంతమేర కరెన్సీకి వెన్నుదన్నుగా నిలిచినట్లు ఎల్‌కెపి సెక్యూరిటీస్ ప్రతినిధి జతీన్‌త్రివేది అన్నారు. మార్కెట్ ట్రేడ్ ఒప్పందాలు, అమెరికాతో జరిగే డీల్స్ కూడా కొంతమేర సెంటిమెంట్‌ను బలపరిచాయి. రానున్న కాలంలో కూడా రూపాయి డాలరు విలువలతో పోలిస్తే 85.25నుంచి 86 వరకూ ట్రేడ్ అవుతుందని త్రివేది అంచనావేసారు. జపాన్, దక్షిణకొరియా, మలేసియా, కజక్‌స్థాన్ వంటివి అమెరికా ఎగుమతులకు 25శాతం సుంకాలు చెల్లించాల్సి వస్తోంది. ఇండోనేసియా ఒక్కటే 32 శాతం సుంకాలు చెల్లించాల్సి ఉంటే బంగ్లాదేశ్ 35శాతం, కంబోడియా, థాయిలాండ్ 36శాతం చొప్పున సుంకాలు చెల్లించాల్సి ఉంటుంది. ఆరు దేశాల కరెన్సీలతో పోలిస్తే డాలర్‌సూచీ తాజా సుంకాలతో కొంతమేర క్షీణించింది. 97.35గా మారింది. ఈ సూచీ ఈఏడాది ఇప్పటివరకూ 10.32శాతంగానిలిచింది. త్వరలో జరిగే ఫెడ్‌రిజర్వు మినిట్స్‌పై అందరి ఫోకస్ నిలిచింది. కమొడిటీలపరంగాచూస్తే ముడిచమురు ధరలు తగ్గాయి. ఒపెక్‌ప్లస్ దేశాలకూటమి ఉత్పత్తిని పెంచాలన్న నిర్ణయంతో ముడిచమురు ధరలు దిగివచ్చాయి. బ్రెంట్‌ముడిచమురు 0.59శాతం తగ్గి బ్యారల్‌కు 69.17 రూపాయలుగా నిలిచింది. ఇక డబ్ల్యుటిఐ ముడిచమురుధరలు 0.79 శాతం క్షీణించి 67.39గా నిలిచింది.



# టాప్ 10 బిలియనీర్ల జాబితా నుంచి బిల్‌గేట్స్ అవుట్..



**న్యూఢిల్లీ, జులై 8:** ప్రపంచ కుబేరుల జాబితాలో దశాబ్దాలుగా అగ్ర స్థానాల్లో కొనసాగిన మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్, ఇప్పుడు టాప్10 జాబితాలో స్థానం కోల్పోయారు. ఆయన చేసిన భారీ దాన ధర్మాల కారణంగా సంపద గణనలో జరిగిన మార్పులతో ఈ పరిణామం చోటుచేసుకుంది. మరింత ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఒకప్పుడు ఆయన వద్ద సహాయకుడి గా పనిచేసి, ఆ తర్వాత మైక్రోసాఫ్ట్ సీఈవోగా బాధ్యతలు చేపట్టిన స్టీవ్ బామర్, ఇప్పుడు సంపదలో గేట్స్‌ను అధిగమించడం విశేషం.ప్రఖ్యాత బ్లూమ్‌బెర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ తాజాగా వెల్లడించిన వివరాల ప్రకారం, బిల్ గేట్స్ సంపద విలువను పునఃసమీక్షించారు. ఆయన చారిటీకి ఇస్తున్న ప్రాధాన్యత, గేట్స్ ఫౌండేషన్‌కు అందిస్తున్న భారీ విరాళాలను పరిగణనలోకి తీసుకుని ఈ లెక్కింపు చేపట్టారు. ఈ సమీక్షలో భాగంగా గేట్స్ సంపద విలువ ఏకంగా 52 బిలియన్ డాలర్లు (దాదాపు 30 శాతం) తగ్గింది. దీంతో ఆయన నికర సంపద 175 బిలియన్ డాలర్ల నుంచి 124 బిలియన్ డాలర్లకు పడిపోయింది. ఫలితంగా, ప్రపంచకుబేరుల జాబితాలో 5వస్థానంలో ఉన్న ఆయన, ఏకంగా 12వ స్థానానికి పడిపోయారు. ఇదే సమయంలో 172 బిలియన్ డాలర్ల సంపదతో స్టీవ్ బామర్ 5వ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. గేట్స్ ఇప్పుడు గూగుల్ సహ వ్యవస్థాపకులు లారీ పేజ్, సెర్గీ బ్రిన్, ఎన్విడియా సీఈవో జెన్సన్ హువాంగ్, తన చిరకాల మిత్రుడు వారెన్ బఫెట్ కంటే కూడా వెనకబడిపోయారు. మే నెలలో తన బ్లాగ్‌లో రాసిన ఒక పోస్ట్‌లో బిల్ గేట్స్ తన సంపద, దాతృత్వం గురించి స్వయంగా వివరించారు. తన నికర సంపద 108 బిలియన్ డాలర్లు అని పేర్కొంటూ, రాబోయే రెండు దశాబ్దాలలో తన సంపదలో దాదాపు మొత్తాన్ని గేట్స్ ఫౌండేషన్ ద్వారా విరాళంగా ఇవ్వనున్నట్లు ప్రకటించారు. 2045 నాటికి ఫౌండేషన్ కార్యకలాపాలు ముగిసేలోపు సుమారు 200 బిలియన్ డాలర్లకు పైగా ఖర్చు చేస్తుందని ఆయన అంచనా వేశారు. గేట్స్ ఫౌండేషన్ వెబ్‌సైట్ ప్రకారం, డిసెంబర్ 2024 నాటికి బిల్ గేట్స్, ఆయన మాజీ భార్య మెలిండా ఫ్రెంచ్ గేట్స్ కలిసి ఫౌండేషన్‌కు 60 బిలియన్ డాలర్లు అందించారు.

# టాటా మోటార్స్ నుంచి మినీ ట్రక్కులు..

**ముంబై, జులై 8:** వాహనాల తయారీ సంస్థ టాటా మోటార్స్ తాజాగా కార్గో రవాణా కోసం ఏస్ ప్రో పేరిట 4-వీల్ మినీ ట్రక్కులను ప్రవేశపెట్టింది. దాదాపు 750 కేజీల పేలోడ్ సామర్థ్యంతో, పెట్రోల్, బై-ఫ్యుయెల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో ఈ వాహనాలు లభిస్తాయని సంస్థ వైస్ ప్రెసిడెంట్ పినాకి హల్దార్ తెలిపారు. ఎలక్ట్రిక్ వెర్షన్ ఒకసారి ఛార్జ్ చేస్తే సుమారు 125 కిలోమీటర్ల నుంచి 155 కిలోమీటర్ల వరకు మైలేజి ఇస్తుందని పేర్కొన్నారు. మారుతున్న మార్కెట్ పరిస్థితుల నేపథ్యంలో తేలికపాటి వాణిజ్య వాహనాల పరిశ్రమ వృద్ధి ప్రస్తుతం ఒక మోస్తరుగానే ఉన్నప్పటికీ, మధ్యకాలికం,దీర్ఘకాలికంగా మెరుగ్గా ఉంటుందని హల్దార్ చెప్పారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో జాగ్వార్ ల్యాండ్ రోవర్ హోల్‌సేల్, రిటైల్ అమ్మకాలు తగ్గాయి. డీలర్లకు సరఫరా వార్షికంగా 11శాతం క్షీణించి 87,286 యూనిట్లకు పరిమితమయ్యాయి. తొలి త్రైమాసికంలో ఉత్తర అమెరికా, యూరప్, బ్రిటన్‌లో హోల్‌సేల్ అమ్మకాలు వరుసగా 12శాతం, 14శాతం, 25శాతం తగ్గినట్లు జెఎల్ఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. ఇక రిటైల్ అమ్మకాలు 15శాతం క్షీణించి 94,420 యూనిట్లుగా నమోదైనట్లు వివరించింది. సమస్యాత్మక పరిస్థితులు నెలకొన్న తరుణంలో అంచనాలకు అనుగుణంగానే అమ్మకాలు ఉన్నట్లు కంపెనీ పేర్కొంది. వారసత్వంగా వస్తున్న మోడల్స్‌ను క్రమంగా నిలిపివేసి కొత్త జాగ్వార్ మోడల్స్‌ను ప్రవేశపెట్టనుంటటం, అమెరికాలో దిగుమతి సుంకాల వ్యవహారం కారణంగా ఏప్రిల్‌లో ఎగుమతులు తాత్కాలికంగా నిలిచిపోవడం తదితర అంశాలు విక్రయాలు తగ్గడానికి కారణమని వివరించింది.



# స్టాక్ సూచీల్లో కొనుగోళ్ల జోష్

**ముంబై, జులై 8:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు మంగళవారం లాభాల్లో ముగిసాయి. ఉదయం ఫ్లాట్‌గా ప్రారంభమైన సూచీలు, చివరికి కొనుగోళ్ల మద్దతుతో లాభపడ్డాయి. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఐసిఐసిఐ బ్యాంకు వంటి షేర్లు అండగా నిలిచాయి. మరోవైపు ట్రంప్ టారిఫ్‌లపై అనిశ్చితి కొనసాగుతోంది. ఇప్పటికే వివిధ దేశాలపై టారిఫ్‌లను ప్రకటించిన విషయం విదితమే. దీంతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి బలహీన సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 83,387.03 పాయింట్ల వద్ద ప్రారంభమై రోజంతా అదే ధోరణిని కనబరచాయి. ఇంట్రాడేలో 83,320.95 పాయింట్ల వద్ద కనిష్టానికి చేరింది. సెన్సెక్స్ చివరికి 270.01 పాయింట్లు లాభపడి 83,712.51 పాయింట్ల వద్ద నిలిచింది. నిఫ్టీ కూడా 61.20 పాయింట్లు పుంజుకొని 25,522.50 పాయింట్ల వద్ద నిలిచింది. కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఎటర్నల్, ఏసియన్ పెయింట్స్, ఎన్‌టిపిసి, బిఇఎల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టైటాన్, ట్రెంట్, యాక్సిస్ బ్యాంకు, మారుతి సుజుకి, హిందుస్థాన్ యూనిలీవర్ వంటి షేర్లు నష్టాల్లో ముగిసాయి.



# వాణిజ్యం

# భారత్ ఫార్మారంగంపై యుఎస్ టారిఫ్ ఎఫెక్ట్!



**చెన్నై, జూలై 8:** అమెరికా సుంకాల భయంతో భారతీయ ఫార్మా కంపెనీల స్టాక్స్ మంగళవారం క్షీణించాయి. నిఫ్టీ ఫార్మా సూచీ కూడా సుమారు 1శాతం క్షీణించి 22,159 పాయింట్ల వద్దనే నిలిచింది. అరబిందోఫార్మా 3శాతం, లూపిన్ 3శాతం, డాక్టర్ రెడ్డిస్, జైడస్ లైఫ్‌సైన్సెస్ 1.6శాతం చొప్పున క్షీణించాయి. గ్రాన్యూల్స్ ఇండియా, సన్‌ఫార్మా, సిప్లా, టొరెంట్ ఫార్మా సంస్థలు ఒకటి శాతం చొప్పున క్షీణించాయి. సోమవారం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ సుమారు 14 దేశాలకు సుంకాలు అమలు చేస్తున్నట్లు లేఖలు రాసామని, వాటిలో కీలక వాణిజ్య భాగస్వామ్య దేశాలుకూడా ఉన్నాయన్నారు. కొత్త దిగుమతి సుంకాలు ఆగస్టు 1వ తేదీనుంచి అమలులోకి వస్తాయని, అదనపు లేఖలు కూడా మరోసారి ఈనెలలోనే రాయడం జరుగుతుందని చెప్పారు. అలాగే భారత్‌తో జరిగే వాణిజ్య ఒప్పందానికి ముందే ట్రంప్ నుంచి లేఖలు రావచ్చన్న అంచనాలున్నాయి. ఈ సుంకాల కారణంగా వాణిజ్య విధానాల్లో మార్పులు తప్పవు. ఫార్మారంగం ఎక్కువగా ఎమెరికా ఎగుమతులపైనే ఆధారపడి కొనసాగుతుంది. 30 నుంచి 40శాతం రాబడుల్లో అమెరికాదేవాటా. ఎక్కువసుంకాలు లాభాల మార్జిన్‌లను తగ్గిచడంతో పాటు, అమెరికా, భారత్ చర్చల పరంగా కూడా ఎక్కువ ఫోకస్ పెంచుతున్నారు.

# స్మార్ట్ డివైస్‌లతో ఆటోమేటిక్ పేమెంట్స్

**ముంబై, జులై 8:** నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) యుపిఐని మరింత స్మార్ట్‌గా తీర్చిదిద్దుతోంది. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ రెడీ వెర్షన్ యుపిఐని సిద్ధం చేస్తోంది. దీని ద్వారా మనిషి అవసరం లేకుండానే ఇంట్లో ఉండే గృహోపరణాలు, వేరియబుల్స్, కనెక్టెడ్ వెహికల్స్ వాటంతట అవే చెల్లింపులు చేసేస్తాయి. అంటే రిఫ్రిజిరేటర్లు, వాషింగ్ మెషిన్లు, స్మార్ట్‌వాచ్‌లు కూడా ఇకపై యుపిఐ లావాదేవీలను నిర్వహించగలవు. ప్రస్తుతం మనం ఏదైనా యుపిఐ పేమెంట్ చేయాలంటే మన దగ్గర మొబైల్ ఫోన్ ఉండాల్సిందే. దానికంటే యుపిఐ ఐడి ఉంటుంది. ప్రస్తుతం యుపిఐ సర్కిల్ చెల్లింపుల వ్యవస్థ కూడా కొత్తగా అందుబాటులోకి వచ్చింది. అంటే ఒక యూజర్ బ్యాంకు ఖాతా నుంచి సెకండరీ యూజర్ కూడా చెల్లింపులు చేసే సదుపాయం అందుబాటులోకి వచ్చింది. ఆటోపేమెంట్ సదుపాయం కూడా దాదాపు ఇదే కోవలోకి వస్తుంది. ఇప్పుడు ఎన్‌పిఐసిఐ అభివృద్ధిచేస్తున్న కొత్తవ్యవస్థ కూడా మన అవసరం లేకుండా పనిచేస్తుందని కొన్ని కథనాలు పేర్కొన్నాయి. ఆయా డివైజులు కూడా వ్యక్తుల ప్రైమరీ ఖాతాలకు అనుసంధానమై ఉంటాయి. వాటికంటూ ప్రత్యేక యుపిఐ ఐడి కూడా ఉంటుంది. వన్‌టైమ్ అథంటికేషన్ ఆధారంగా ఆయా డివైజులు అనుసంధానం అవుతాయి. ఒకసారి ప్రైమరీ యూజర్ అనుమతి తీసుకున్నాక వ్యక్తి అవసరం లేకుండానే చెల్లింపులు చేస్తాయి. ఈ యేడాది జరగబోయే గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఈ ఐఒటి రెడీ యుపిఐని ప్రదర్శిచే అవకాశం ఉంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.